మనం దసరా శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటన కర్తలు,
ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు మనం
దసరా పర్వదిన శుభాకాంక్షలు.

సెలవు

పండుగ సందర్భంగా మా కార్యాలయానికి మంగళవారం
సెలవు. బుధవారం పత్రిక వెలువడదు. గురువారం పున:దర్శనం.

– ఎడిటర్

మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 20 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 285 || పేజీలు:12 || వెల రూ.5

చిన్నారుల కాళ్లు కడిగిన యూపీ సీఎం యోగి



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

జాగో..!

ఎల్‌నినోను ఎదుర్కొందాం

ప్రకృతి విపత్తుపై 'మన'ం యుద్ధం

manamelnino2026@gmail.com, whatsapp no 9133199333

ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితులు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను కింద తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్ కు పంపించండి.

– ఎడిటర్



గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

అంతర్జాతీయ స్థాయిలో వేయాలె

స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

ఫ్యూచర్ సిటీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

పోలీస్ కమిషనరేట్ ప్రారంభం



హైదరాబాద్, అక్టోబర్ 19: అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించిన ముఖ్యమంత్రి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నిర్దేశిత గడువుకు పదిహేను రోజుల ముందుగానే పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అవసరమైతే సిబ్బంది

...మిగతా 2లో

దసరా వేడుకలకు నేడు కొండారెడ్డి పల్లికి సీఎం

2

ఎల్‌నినోపై డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ

హైదరాబాద్, అక్టోబర్ 19 (మనం బ్యూరో): రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎల్‌నినో పరిస్థితులపై అధ్యయనానికి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షత వహించనున్న ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క వ్యవహరించనున్నారు. ఈమేరకు ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. కరువు పరిస్థితులను ఎదుర్కునేందుకు ముందస్తు చర్యలపై ఈ కమిటీ సమీక్షించనుంది. జల సంరక్షణకు ప్రాధాన్యం, ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించనుంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టనుంది. వేసవికి ముందే గ్రామీణ నీటి సమస్యల గుర్తింపు, పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయనుంది. అలాగే, ఎల్‌నినో ప్రభావంపై ఎప్పటికప్పుడు సమీక్షించి ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయుంది.

నిధుల ఖర్చులో జాప్యం ఉండొద్దు: భట్టి

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్

...మిగతా 2లో

ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలి

సీఎం రేవంత్ దసరా శుభాకాంక్షలు



హైదరాబాద్, అక్టోబర్ 19: చెడుపై మంచి సాధించిన గెలుపు, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం

...మిగతా 2లో



ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంలో వేగం పెంచాలి

ఆర్థిక వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి

నిధుల వినియోగ పురోగతిపై శాఖల వారీగా సమీక్షించిన డిప్యూటీ సీఎం



హైదరాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్): ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి బడ్జెట్లో కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడానికి వేగం పెంచాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేటాయింపులకు అనుగుణంగా నిధుల వ్యయాన్ని వేగవంతం చేయడంతోపాటు, నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులకు సూచించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఆర్థిక శాఖలో సంస్కరణలు, ఆదాయ వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సచివాలయంలో సోమవారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

సబ్ ప్లాన్ నిధుల వినియోగంలో జాప్యం వద్దు..

ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సామాజిక, ఆర్థిక సాధికారత కోసం కేటాయించిన నిధుల

...మిగతా 2లో

సరస్ మేళా.. రికార్డు స్థాయిలో

రూ.9.29 కోట్ల అమ్మకాలు

మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు భారీ ఆదరణ



2

పారదర్శక రెవెన్యూ సేవలు..

రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు

భూవివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం

భూభారతితో ఏళ్లనాటి భూ సమస్యలకు పరిష్కారం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్): ప్రజలకు మెరుగైన, పారదర్శక రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు, భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలోని పెద్దల నిర్లక్ష్యం, స్వార్థపూరిత నిర్ణయాల వల్ల పదేళ్లలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైందని.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి సూచనల మేరకు

...మిగతా 2లో

ప్రజా జీవితాల్లో దసరా శుభాలను, సుఖ సంతోషాలను తీసుకురావాలె

కేసీఆర్ దసరా శుభాకాంక్షలు



3







SUDHAKAR
PIPES AND FITTINGS

దుర్గామాత ఆశీస్సులు మీపై ఎల్లప్పుడూ
ఉండాలని కోరుకుంటూ సుధాకర్ కంపెనీ వారి తరపున
మీకు, మీ కుటుంబ సభ్యులకు
దసరా శుభాకాంక్షలు!





www.sudhakarind.com
info@sudhakarind.com
Toll Free No: 1800 120 000 066

అంతర్జాతీయ స్థాయిలో చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

సంఖ్యను పెంచాలని తెలిపారు. నవంబరు నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7 నుండి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. 'మీ పెట్టుబడులకు మాది భరోసా' అనే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ప్రాంగణంలో ఈ సదస్సు జరగనున్న నేపథ్యంలో యూనివర్సిటీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి సమ్మిట్ ఏర్పాట్లపై కసరత్తు చేయాలన్నారు. దేశవిదేశాల నుంచి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా ఆ స్థాయిలో సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని అధికారులకు సూచించారు. బహిరంగ ప్రాంగణ పనులను నవంబరు 15లోగా పూర్తి చేసేందుకు



చర్యలు తీసుకోవాలన్నారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' కేవలం వ్యాపార సదస్సు మాత్రమే కాదని, తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే చారిత్రక వేదికగా నిలుస్తుందని సీఎం అన్నారు. అందుకే సమ్మిట్ ఏర్పాట్లపై ఇప్పటి నుంచే ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులు ఒక కమిటీని నియమించుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రారంభం..

భారత్ ఫ్యూచర్ సిటీని సందర్శించే ముందు ఇబ్రహీం పట్నంలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భవనంలోని కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించి తరుణ్ జోషికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించిన ఆయన... ఎఫ్ సీ డీఏ కార్యాలయ ఆవరణలో(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన క్యాంపస్ నమూనాను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినోపై డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

నిధుల వినియోగాన్ని వేగవంతం చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం దీనికి సంబంధించి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల వ్యయంపై నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు.

ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉందని అన్నారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. మనలోని అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి చెడు లక్షణాలను తొలగించుకుని, ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ పండుగ సందేశమిస్తోందని అన్నారు.

ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల పూలు పూయించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.రాక్షసుడైన మహిషాసురుడిని సంహరించి దుష్టశక్తులపై విజయం సాధించిన అమ్మవారి శక్తిని, శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన విజయాన్ని ఈ పర్వదినం మనకు గుర్తుచేస్తుందన్నారు. తెలంగాణలో దసరా సందర్భంగా జమ్మిచెట్టుకు పూజలు చేయడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకోవడం ప్రత్యేక సంప్రదాయమని గుర్తు చేశారు. ఈ ఆచారం ప్రకృతిని ప్రేమించాలని, పెద్దలను గౌరవించాలని చాటిచెబుతుందని అన్నారు.

దసరా వేడుకలకు నేడు కొండారెడ్డి పల్లికి సీఎం

హైదరాబాద్, అక్టోబర్ 19: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దసరా వేడుకలను సొంతూరు కొండారెడ్డిపల్లెలో జరుపుకోనున్నారు. నేడు హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నానికి గ్రామానికి చేరుకుని 12.30 గంటలకు ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 2 గంటలకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులను కలుస్తారు. సాయంత్రం అక్కడ జరిగే జమ్మి పూజ, తదితర కార్యక్రమంలో పాల్గొని తిరిగి రాత్రి హైదరాబాద్‌కు వస్తారు.

చిన్నారుల కాళ్లు కడిగిన యూపీ సీఎం యోగి

గోరఖ్ పూర్, అక్టోబర్ 19: మహార్నవమి సందర్భంగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కన్యా పూజ నిర్వహించారు. గోరఖ్ పూర్ లోని గోరఖ్ నాథ్ ఆలయంలో బాలికల పాదాలు కడిగి, వస్త్రాలు సమర్పించారు. దేశ ప్రజల శ్రేయస్సు, శాంతి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేస్తున్నామని పొంగులేటి స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

34 నెలల్లో 12.40 లక్షల పాస్‌బుక్కుల జారీ...

ప్రజలు కోరిన భూవివాదాలు లేని తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు 5,68,858 పాస్‌బుక్కులు జారీ చేశామని.. అలాగే ఈ చట్టానికి ముందు 6,71,508 పాస్‌బుక్కులతో కలిపి మొత్తం ఈ 34 నెలల్లో 12,40,366 పాస్‌బుక్కులను రైతులకు అందజేయడం జరిగిందని పొంగులేటి వెల్లడించారు. దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలకు భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా రీ-సర్వే ద్వారా పరిష్కారం చూపుతున్నామన్నారు.

క్షేత్రస్థాయిలో రీ-సర్వేల ద్వారా భరోసా..

కొన్ని దశాబ్దాలుగా భూమిని సాగు చేస్తున్నా రికార్డుల్లో హక్కులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమై ఇబ్బంది పడుతున్న రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలిచి సమగ్ర సర్వే నిర్వహిస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రెవెన్యూ గ్రామంలో రీ-సర్వే నిర్వహించి గిరిజనులు, గిరిజనేతరుల సమస్యను పరిష్కరించి 906 మంది రైతులకు 1,600 ఎకరాలకుపైగా హక్కులు కల్పించామన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో రీ-సర్వే ద్వారా 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు ఇవ్వడం జరిగిందని మంత్రి వెల్లడించారు.

వేగవంతంగా కొనసాగుతున్న సర్వే పనులతో రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులతో రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం లభించిందని తెలిపారు. అలాగే ములుగు జిల్లా ముల్కాపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలాల్లో ఈ రీ-సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యలను పరిష్కరించి త్వరలోనే హక్కుదారులకు పాస్‌బుక్కులు అందిస్తామని చెప్పారు. ఇదే పద్ధతిలో ఇతర ప్రాంతాల్లోనూ సర్వే నిర్వహించి భూమిపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాకోణంలో ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనగామ జిల్లాలో ఫుడ్ పార్క్ ఏర్పాటుపై కలెక్టర్తో చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సెక్రటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కొత్త బోర్లకు అనుమతులివ్వొద్దు

సీఎస్ సంజయ్ జాజు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 19: ఎల్ నినోపై ఉమ్మడి జిల్లాల ప్రత్యేక అధికారులతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీరు, విద్యుత్ సమస్య రాకుండా మండల స్థాయి వరకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పరిశ్రమలకు పవర్‌కట్ ఉండబోదని, యాజమాన్యాలు ఆందోళన పడొద్దని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ పొదుపుగా వాడాలని ఆదేశించారు. హైదరాబాద్లో నిర్మాణాల కోసం కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వొద్దని చెప్పారు. మరోవైపు నల్లాలకు మోటార్లు పెట్టకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు ప్రత్యేకాధికారి జయేశ్ రంజన్ తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణ పనులకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.

సరస్ మేళా.. రికార్డు స్థాయిలో రూ.9.29 కోట్ల అమ్మకాలు

5,98,029 మంది సందర్శకులతో అనునిత్యం కళకళలాడిన ప్రదర్శన

హైదరాబాద్, అక్టోబర్ 19: గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తున్న సరస్ మేళా ఈ ఏడాది ఘన విజయాన్ని సాధించింది. అక్టోబర్ 7 నుంచి 18 వరకు హైదరాబాద్లో నిర్వహించిన సరస్ మేళాలో రికార్డు స్థాయిలో రూ.9.29 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. మొత్తం 5,98,029 మంది సందర్శకులు మేళాను సందర్శించి మహిళా సంఘాల ఉత్పత్తులను కొనుగోలు చేశారు. హెచ్ఎండిఎ గ్రౌండ్లో 225 స్టాళ్లతో నిర్వహించిన ఈ మేళా మహిళా వ్యాపారులకు మంచి మార్కెట్ వేదికగా నిలిచింది. చివరి నాలుగు రోజుల్లో ప్రతిరోజూ రూ.కోటి కి పైగా అమ్మకాలు జరగడం విశేషం.

మూడేళ్లలోనే అత్యధిక అమ్మకాలు

సరస్ మేళాలో గత మూడేళ్ల అమ్మకాల గణాంకాలు.. ప్రజా ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాల ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణను చాటుతున్నాయి. 2024లో రూ.7.81 కోట్ల అమ్మకాలు జరగగా, 2025లో రూ.3.28 కోట్ల వ్యాపారం నమోదైంది. ఈ ఏడాది ఏకంగా రూ.9.29 కోట్ల అమ్మకాలు జరిగాయి. 2025తో పోలిస్తే ఈసారి అమ్మకాలు దాదాపు మూడు రెట్లు పెరిగింది.

సందర్శకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2025లో 1,69,015 మంది మేళాను సందర్శించగా, ఈ ఏడాది 5,98,029 మంది సందర్శించారు. మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, చేనేత వస్త్రాలు, హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తులకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించింది. అమ్మకాలు ఆశించిన స్థాయిని మించడంతో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

మహిళా సాధికారతకు సరస్ మేళా బాటలు

గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం, మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశాలను పెంచడం సరస్ మేళా ప్రధాన ఉద్దేశం. మహిళల సంప్రదాయ నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మార్చి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడంలో ఈ మేళా కీలక పాత్ర పోషిస్తోంది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లక్ష్యాలకు అనుగుణంగా మహిళలను కేవలం ఉత్పత్తిదారులుగానే కాకుండా, సొంత వ్యాపారాలను నిర్వహించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి వేదికలు దోహదపడుతున్నాయి.

మహిళలకు మెరుగైన సౌకర్యాలు

మేళాలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామీణాభివృద్ధి శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. వారి వసతి, భోజనం, రవాణా ఖర్చులను శాఖే భరించింది. సందర్శకుల సౌకర్యార్థం సెంట్రలైజ్డ్ ఏసీ ఏర్పాటు చేయడంతో పాటు, పార్కింగ్, భద్రత, ఇతర మౌలిక వసతులను కల్పించారు. మెరుగైన నిర్వహణ, సౌకర్యవంతమైన వాతావరణం కారణంగా సందర్శకుల రాక పెరిగి, అమ్మకాలు కూడా గణనీయంగా వృద్ధి చెందాయి.

రికార్డు అమ్మకాలపై మంత్రి సీతక్క హర్షం

సరస్ మేళా విజయవంతం కావడం, మహిళా సంఘాల ఉత్పత్తులకు పెద్దఎత్తున ఆదరణ లభించడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభించి, వారి కష్టానికి తగిన ఆదాయం సమకూరడం సంతోషకరమని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి, సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ స్వావలంబన సాధించాలన్నదే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. సరస్ మేళాను విజయవంతం చేసిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సెర్ప్ సిబ్బందిని మంత్రి అభినందించారు. మహిళల ఉత్పత్తులకు మరింత విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ, వారి ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం నిరంతరం ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంలో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన కేటాయించిన సబ్ప్లాన్ నిధులు ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సమర్థవంతంగా ఉపయోగపడేలా శాఖలవారీగా వ్యయ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. చట్ట నిబంధనలు, బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా సాధారణ పద్దుల తరహాలోనే ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక పద్దుల కింద కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని పేర్కొన్నారు. నిధుల ఖర్చులో ఉన్న అంతరాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వెనుకబడిన శాఖలపై ప్రత్యేక సమీక్షలు..

నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలతో ఆర్థిక శాఖ అధికారులు ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించి, ఖర్చుల పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ మేరకు ముందుగా ఖర్చులో ఎక్కువ గ్యాప్ ఉన్న వ్యవసాయం, వైద్యం, ఇంధనం, పురపాలక, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమం, పరిశ్రమలు, గిరిజన సంక్షేమ శాఖల కార్యదర్శులతో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఆయా శాఖలకు



కేటాయించిన నిధులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, మిగిలిన నిధుల వినియోగానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి, నివేదిక రూపొందించాలని సూచించారు.

ఆర్థిక సంస్కరణలతో ఆదాయ వనరుల పెంపు..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు, అదనపు ఆదాయ మార్గాలను గుర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బడ్జెట్ రూపకల్పనలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ, వ్యయ నియంత్రణ, నిధుల సద్వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల లభ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్థిక శాఖలో అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ ఆదాయ వనరుల సమీకరణకు చేపడుతున్న చర్యలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని భట్టి పేర్కొన్నారు.

ఆర్థిక నిర్వహణలో అత్యుత్తమ ప్రమాణాలను పాటించేందుకు అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు, ఆర్థిక రంగ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. నిపుణుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల వ్యయం, అభివృద్ధి కార్యక్రమాల అమలు మధ్య సమన్వయం ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఫైనాన్స్, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశదేశాల్లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

ఆస్ట్రేలియా గడ్డపై అంగరంగ వైభవంగా టాంజానియాలో టీసీఏ ఆధ్వర్యంలో దక్షిణాఫ్రికాలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్, మనం ప్రతినిధి: విదేశాల్లో బతుకమ్మపండుగను విశేషరీతిలో నిర్వహించడంలో ప్రసిద్ధి పొందిన 'టి-ప్యాడ్' ఈ దఫా 15వేల మందితో వేడుకలను భారీ ఎత్తున నిర్వహించింది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం ఫ్రిస్కో నగరంలో గల ప్రతిష్టాత్మక కొమెరికా సెంటర్ వేదికగా నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు తెలుగువారు భారీగా పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా వేడుకలకు హాజరై విజయవంతం చేశారు. బతుకమ్మ ఆటపాటలు ప్రాంగణానికి తెలంగాణ సంప్రదాయ పరిమళాలతో కొత్త వన్నెలద్దాయి. కనీసం వెయ్యి మందికి పైగా మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆడారు. అనంతరం శాస్త్రోక్తంగా, పద్ధతి ప్రకారం బతుకమ్మల నిమజ్జన నిర్వహించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన మహిషాసుర మర్ధిని నృత్యరూపం ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రైమ్ టైమ్ ఈవెంట్ అత్యంత ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ సినీ నటుడు నవీన్ పోలిశెట్టి ఈ వేడుకలకు ప్రత్యేకంగా హాజరై సందడి చేశారు. సభికులతో నేరుగా మాట్లాడుతూ చమక్కులు విసురుతూ, యువతతో పాటు చిన్నపిల్లలను వేదికపైకి ఆహ్వానించి వారితో కలిసి డ్యాన్స్ చేస్తూ ప్రాంగణాన్ని ఉర్రూత లూగించారు. ప్రముఖ గాయకుడు కృష్ణ చైతన్య నేతృత్వంలోని 'ఇన్ఫ్యూజన్ బ్యాండ్' సంగీత విభావరి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ భారీ కార్యక్రమాన్ని టి-ప్యాడ్ ప్రెసిడెంట్ లక్ష్మి పోరెడ్డి, ఫౌండేషన్ కమిటీ చైర్ రఘువీర్ బండారు, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ చైర్ రవికాంత్ మామిడి, కోఆర్డినేటర్ లింగారెడ్డి ఆల్వ నాయకత్వం లో విజయవంతం చేశారు. దాదాపు 20 కమిటీలకు చెందిన వాలంటీర్లు గడిచిన రెండు మూడు నెలలుగా రేయింబవళ్లు శ్రమించి ఈవెంట్ను మరపురానిదిగా నిలపడంలో తీవ్ర కృషి చేశారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, సురక్షితమైన సెక్యూరిటీ చెకింగ్స్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత సాఫీగా సాగింది. కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా టి-ప్యాడ్ నాయకత్వం ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేసింది.

ఆస్ట్రేలియా గడ్డపై అంగరంగ వైభవంగా..

6 వేల మందితో మెల్‌బోర్న్‌లో బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాలుగా ఆస్ట్రేలియాలో ఘనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మెల్బోర్న్ నగరంలో ఏకంగా 6000 మందికి పైగా తెలంగాణ బిడ్డల సమక్షంలో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. పూలతో గౌరమ్మను పేర్చి, ఆటపాటలతో ఆడబిడ్డలంతా కలిసి ఆస్ట్రేలియా గడ్డపై తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పారు. ఆస్ట్రేలియా బీఆర్ఎస్ ఎన్ఆర్ ఐ నాయకుడు అనిల్ బైరెడ్డి మాట్లాడుతూ..ఆస్ట్రేలియా గడ్డపై మన తెలంగాణ సంప్రదాయాన్ని, బతుకమ్మ సంస్కృతిని గత 13 సంవత్సరాలుగా కొనసాగిస్తూ వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అందులో మొట్టమొదటిగా ఈ సంఘాన్ని నేను స్థాపించినందుకు నాకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. ప్రవాసంలో ఉన్నా మన సంస్కృతిని మరిచిపోకుండా ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు అని తెలియజేశారు. ఆస్ట్రేలియా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ నాయకురాలు కిరణ్ పాల్వాయి మాట్లాడుతూ..ఇంత అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈ వేడుకలకు ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి, బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డకు పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు. ఇక్కడికి వచ్చిన మన తెలంగాణ బిడ్డలందరికీ అనుకూలంగా ఉండేలా, మన తెలంగాణ పిండి వంటలు, సంప్రదాయ వంటకాలన్నీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి అందరికీ అందించడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు.

ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి పాల్గొని ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ ఆడి, అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.





ఈ వేడుకలను విజయవంతం చేయడంలో ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ సభ్యులు రాజ్ వుల్వాల, పుల్లారెడ్డి, వంశీ కొట్టాల, మహేష్ బద్దం, ప్రవీణ్ దేశం, అమర్ అత్తాపురం, కృష్ణ వాడియాల, రవి దామెర, దీపక్, రఘు కొట్లా, మధు పర్సా, మధు పైళ్ల, రమేష్ ముత్యాల, సత్య గుండ, శ్యామ్, కార్తీక్, శ్రీకాంత్ నంగునూరి, రాజేష్, ఫణి, సతీష్, పరి, కర్ర శ్రీనివాస్, కిషోర్ యన్నం తదితరులు కృషి చేశారు.

టాంజానియాలో టీసీఏ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ ఆడపడుచులు జరుపుకునే పూల పండుగ బతుకమ్మ వేడుకలు టాంజానియా నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని ప్రముఖ్ సదన్ భవన్‌లో తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు భారత హైకమిషనర్ బిశ్వదీప్‌దే హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో దాదాపు 600 మంది ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. తెలంగాణ ఆడ పడుచులు తొమ్మిది రకాల పూలతో అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చి, సాంప్ర దాయ వస్త్రధారణలో బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సంబరాలు జరుపుకున్నారు. మహిళలు, చిన్నారులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేసినందుకు అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ కమిటీ చైర్మన్ సైదులు, వైస్ చైర్మన్ సంపత్ , ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వంగ నర్సింహారెడ్డి, సురేందర్ సీలం, సంతోష్ రెడ్డి పటోళ్ల, సంతోష్ రెడ్డి, మధు రెడ్డి, సూర్య మోహన్ రెడ్డి, ప్రవీణ్, మహేష్ రెడ్డి, కమిటీ సభ్యులు రమేష్, శరత్, రేవంత్, సాయి కృష్ణ, శ్రవణ్, శ్రీనివాస్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

దేవీ నవరాత్రుల సందర్భంగా ఎస్ఎస్‌డీసీవో దక్షిణాఫ్రికా ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా ముగిశాయి. నాగయ్యాస్ మాల్లోని దేవీ మండపంలో జ

సీఎం రేవంత్ రెడ్డితో మధుయాష్కి భేటీ

సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశంపై చర్చ

ఏఐపీసీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తా : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 19(మనం బ్యూరో): ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం జూబ్లీహిల్స్ లోని ఎంసీహెచ్ఆర్డీసీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఐపీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మధుయాష్కికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి మధ్య సుమారు గంటన్నర పాటు సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వంలో చేసిన సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పులపై వడ్డీ భారం తదితర అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి త్వరలో మూడేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో, ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరంపై చర్చ జరిగింది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు, గృహ వినియోగదారులకు ఉచిత కరెంటు, దేశంలో ఎక్కడా లేని విధంగా సబ్సిడీ ధరకే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ఉపాధి కల్పన.. మరీ ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో నూతన కంపెనీలను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉపాధి కల్పన తదితర సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వం సాధించిన పురోగతిని ప్రజలకు వివరించాలన్న దానిపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఏఐపీసీ బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రొఫెషనల్స్‌ను భాగస్వాములను చేస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై సమర్థవంతమైన చర్చలకు వేదికగా ఏఐపీసీని తీర్చిదిద్దే అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. వివిధ రంగాల్లో నిపుణులను అబ్బిజ ద్వారా ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై వారు సమగ్రమైన నివేదికలు ఇవ్వడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఇటు ప్రభుత్వం గానీ, అటు పార్టీ గాని ప్రొఫెషనల్స్ సేవలను సద్వినియోగం చేసుకొని నూతన పాలసీలు, విధానాలు రూపకల్పనలో భాగస్వామ్యం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి గారు, మధుయాష్కి అభిప్రాయపడ్డారు.

మీ కథనం అన్నిఅబద్ధాలే

కేసీఆర్‌పై కథరాలు.. ఖండించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

తప్పుడు వార్తలపై తీవ్ర అభ్యంతరం

24 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : కొండపోచమ్మ సాగర్ నుంచి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖరరావు వ్యవసాయ క్షేత్రానికి నీటిని తరలించుకుపోతున్నారంటూ ఓ దినపత్రికలో ప్రచురితమైన కథనంలో ఎలాంటి వాస్తవం లేదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. ఈ కథనం నిరాధారమైనదని పేర్కొంటూ ఆయన తీవ్రంగా ఖండించారు. ఉద్యమ నేత కేసీఆర్ ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా నిందారోపణలతో కూడిన కథనాన్ని ప్రచురించడంపై ఎంపీ రవిచంద్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఛానల్, పత్రికలు దుష్ప్రచారానికి పాల్పడుతున్నాయని ఆయన విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి వాస్తవాలతో సంబంధం లేని కథనాలను ప్రచురించడం సరికాదని పేర్కొన్నారు.

24 గంటల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్‌కు చెందిన ఓ దినపత్రికలో ఈ నెల 17న ప్రచురించిన కథనాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు, రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. క్షమాపణలకు సంబంధించిన వార్తను 24 గంటల్లో తగిన ప్రాధాన్యంతో ప్రచురించాలని స్పష్టం చేశారు. తన డిమాండ్లను పాటించని పక్షంలో పరువునష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హెచ్చరించారు. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించడాన్ని సహించబోమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

దురుద్దేశంతో కథనం : బీఆర్ఎస్

ఎన్నారై కువైట్ అధ్యక్షురాలు అభిలాష గొడిశాల

అక్టోబర్ 17న ఓ దినపత్రిక మొదటిపేజీలో 'కేసీఆర్ ఫాం హౌస్‌కు మళ్లిన కొండపోచమ్మ' పేరిట తప్పుడు కథనాన్ని ప్రచురించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేస్తున్నతప్పుడు ప్రచారంపై ఖండాంతరాల నుంచి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రచురించిన తప్పుడు కథనాన్ని బీఆర్ఎస్ ఎన్నారై కువైట్ అధ్యక్షురాలు అభిలాష గొడిశాల తీవ్రంగా ఖండించారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై అధికారిక ఆధారాలు లేకుండా సంచలన శీర్షికలతో ప్రజల్లో అపోహలు కలిగించడం సమంజసం కాదని, సాగునీటి శాఖ రికార్డులను పరిశీలించకుండా, సంబంధిత అధికారుల వివరణ తీసుకోకుండా సంచలనం కోసం, రాజకీయ దురుద్దేశంతో ఈ కథనాన్ని ప్రచురించారని అభిలాష గొడిశాల విమర్శించారు. వార్తా పత్రికను రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చి, పత్రికా స్వేచ్ఛ ముసుగులో నిరాధార ఆరోపణలు చేస్తే మూస్తూ ఊరుకొనేది లేదని, స్వేచ్ఛకు బాధ్యత కూడా ఉండాలని, వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసే ఆరోపణలకు తగిన ఆధారాలు కూడా ఉండాలని అభిలాష పేర్కొన్నది.

పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తాం..

పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తాం. ప్రజల తరఫున ప్రశ్నించే జర్నలిజాన్ని సమర్థిస్తాం. అదే సమయంలో, వ్యక్తుల గౌరవానికి, ప్రజల విశ్వాసానికి భంగం కలిగించే ఆరోపణలను బాధ్యతారహితంగా ప్రచురించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ కుట్రపూరిత దుష్ప్రచారాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలం అందరం ఐక్యంగా తిప్పికొడతామన్నారు. ఈ కథనానికి సంబంధించిన ఆధారాలను వెలుగు యాజమాన్యం బహిర్గతం చేయాలని, ఆరోపణలను నిరూపించలేకపోతే కథనాన్ని ఉపసంహరించుకొని, మొదటి పేజీలో తగిన ప్రాధాన్యంతో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి బేషరతుగా క్షమాపణ ప్రచురించాలని కోరారు. డిజిటల్ వేదికలు, అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లోనూ అదే వివరణ ఇవ్వాలని అభిలాష డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ చరిత్ర త్యాగాలతో ముడిపడి ఉంది

దేశం కోసం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ఒక్క చుక్క రక్తమైనా ధారపోసిండ్రా?

చార్మినార్ వద్ద రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమావేశం: పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, అక్టోబర్ 19 (మనం బ్యూరో) : రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్లోని చార్మినార్ వద్ద రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఏఐసీసీ నాయకులు గిడుగు రుద్రరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇతర కాంగ్రెస్ నాయకులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని, దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగధనుడని కొనియాడారు. చార్మినార్‌తో రాజీవ్ గాంధీకి విడదీయలేని అనుబంధం ఉందని పేర్కొన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదే అని, నేడు దేశ ప్రజలు మొబైల్ ఫోన్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవడంలో ఆయన దూరదృష్టి కీలక పాత్ర పోషించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర త్యాగాలతో ముడిపడి ఉందని దేశం కోసం తన ప్రతి రక్తపు బొట్టును ధారపోస్తానని చెప్పిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసిన సోనియా గాంధీ వంటి నాయకులు కాంగ్రెస్ పార్టీకి ఆదర్శమని అన్నారు. దేశంలో శాశ్వతంగా అధికారంలో కొనసాగాలనే లక్ష్యంతో కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. మతం, కులం పేరుతో ఓటర్ల జాబితాల నుంచి ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. దేశం కోసం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ఒక్క చుక్క రక్తమైనా ధారపోశారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే త్యాగాలకు ప్రతీక అని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు.

రాష్ట్ర ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు కామెంట్స్

మహేశ్ గౌడ్, పొంగులేటి, వంశీకృష్ణకు నోటీసులు జారీ చేసిన బీఆర్ఎస్

స్పందించకపోతే పరువు నష్టం సహా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక


హైదరాబాద్, మనం ప్రతినిధి : కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్ హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్ చార్జ్ సోమ భరత్ కుమార్ వారికి నోటీసులు జారీ చేశారు.

కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్ కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది. అయితే, తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.

ప్రజలకు ఈ దసరా సుఖ సంతోషాలను తీసుకురావాలె

కేసీఆర్ దసరా శుభాకాంక్షలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయ వేడుకల్లో దసరా పండుగకి ప్రత్యేక స్థానం ఉన్నదని కేసీఆర్ అన్నారు. విజయానికి సంకేతంగా నిలిచిన జమ్మి వృక్షానికి పూజ చేయడం, శుభానికి సూచికగా పాలపిట్టను దర్శించుకోవడం, అలయ్ బలయ్‌తో పరస్పరం ప్రేమాభిమానాలను



చాటుకోవడం, పవిత్రమైన జమ్మి ఆకును బంగారంగా భావించి పంచుకోవడం, పెద్దల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకునే మహోన్నత సంస్కృతి సంప్రదాయాన్ని దసరా పండుగ మనకందిస్తున్నదని కేసీఆర్ తెలిపారు. పండుగకున్న ప్రత్యేక తను విశిష్టతను గౌరవిస్తూ, జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మానిదే చివరి విజయమనే విజయ దశమి స్ఫూర్తి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ, అనంతర పదేండ్ల ప్రగతి ప్రస్థానంలోనూ ఇమిడి ఉన్నదని తెలిపారు. భవిష్యత్తులోనూ దసరా స్ఫూర్తితో ప్రజలు కొనసాగుతున్న అధర్మం మీద విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలను అన్ని రంగాల్లో విజేతలుగా నిలబెట్టడం ద్వారానే దసరా పండుగ స్ఫూర్తిని అమలుపరిచిన వారమవుతామని కేసీఆర్ స్పష్టం చేశారు. కొనసాగుతున్న కష్టాలను తొలగించి, తెలంగాణ ప్రజా జీవితాల్లో దసరా పండుగ, శుభాలను, సుఖ సంతోషాలను తీసుకురావాలని కేసీఆర్ ప్రార్థించారు.

నెలలోగా కాఫర్ డ్యామ్ నిర్మించండి

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత..

లేదంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తం



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి లక్ష్మీ పంప్ హౌస్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్ డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్ హౌస్ వద్దే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. మేడిగడ్డను ఒక భూతంగా చూపి రైతులను నష్ట పరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. తమ పార్టీ కేవలం విమర్శించడానికే పరిమితం కాలేదని, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తోందని తెలిపారు. టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తాము పనిచేస్తున్నామని కవిత స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

రూ.50 వేల కోట్ల స్కాం

- రేవంత్ సర్కార్‌పై సీబీఐ విచారణకు మన్నెక్రిశాంక్ డిమాండ్



హైదరాబాద్, మనం ప్రతినిధి : రాష్ట్రంలో ప్రభుత్వ అండతో రూ.50,000 కోట్ల విలువైన కుంభకోణాలు జరిగాయని బీఆర్ఎస్ నేత మన్నె కిషోర్ ఆరోపించారు. ముఖ్యంగా సెక్షన్ 22ఏ కింద ఉన్న నిషేధిత భూముల వ్యవహారంలో భారీగా అవినీతి చోటుచేసుకుందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి పాత్ర లేకపోతే, వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు.

సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో క్రిశాంక్ మాట్లాడుతూ... ఈ భూ సెటిల్‌మెంట్ల వెనుక సీఎం సోదరుడు కృష్ణారెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను బెదిరించడమే కాకుండా, భూదందాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. చేవెళ్ల పరిధిలోని చందనవల్లి గ్రామంలో సర్వే నంబర్ 363లోని అసైన్డ్ భూమిని వ్యవసాయ భూమిగా మార్చి, ఆర్9 కన్‌స్ట్రక్షన్స్ పేరుపై రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఈ కంపెనీలో కృష్ణారెడ్డి భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. ఇలాంటి భూ కబ్జాల కోసమే సెక్షన్ 22ఏను వాడుకుంటున్నారని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే విజయం

- ఓబీసీ మోర్చా నేషనల్ మెంబర్ పెరిక సురేష్



హైదరాబాద్, అక్టోబర్ 19, (మనం బ్యూరో): రాబోయే ఎమ్మెల్సీ, గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా మీడియా, ఐటీ, సోషల్ మీడియా ఇంచార్జ్ పెరిక సురేష్ అశాభావం వ్యక్తం చేశారు. ధర్మంపై అధర్మం, సత్యంపై అసత్యం, మంచిపై చెడు సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దసరా శరన్నవరాత్రుల పవిత్ర సందర్భంలో శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయం సన్నిధిలో భవానీ దీక్షలో ఉన్న కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌ను పెరిక సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురేష్ మాట్లాడూ దుర్గామాత ఆశీస్సులతో బీజేపీ విజయాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రం శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజలందరి జీవితాల్లో విజయం, ఆనందం వెల్లివిరియాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరిలో ధైర్యం, ధర్మనిష్ఠ, సత్ప్రవర్తన, సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని, సమైక్యత, సామాజిక బాధ్యతతో ప్రగతిశీల తెలంగాణ పురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రజాసేవలో నాయకులు మరింత అంకితభావంతో ముందుకు సాగాలని, తెలంగాణ ప్రజలకు, దేశానికి సేవలందించే క్రమంలో వారికి అమ్మవారి ఆశీస్సులు లభించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

తాగునీరు, విద్యుత్‌కు ప్రత్యామ్నాయ ప్రణాళికలు

- జిల్లా, మండల స్థాయిలోనూ పకడ్బందీ కార్యాచరణ
- అధికారులకు సిఎస్ ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 19(మనం న్యూస్): ఎల్-నినో ప్రభావంతో రానున్న కాలంలో ఎటువంటి తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా జిల్లా, మండల స్థాయిలోనూ ముందస్తు ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు స్పష్టం చేశారు. ఎల్-నినో పరిస్థితుల తీవ్రతపై రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖల వారీగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని, ఇదే రీతిలో సూక్ష్మ స్థాయిలోనూ (మైక్రో లెవెల్) కార్యాచరణ ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.

విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి...

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికీ వ్యవసాయానికి, గృహోపయోగ అవసరాలకు నిరంతరం అందిస్తున్నామని సీఎస్ తెలిపారు. పరిశ్రమలకు ఎలాంటి పవర్ కట్స్ విధించడం లేదని, యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ పొదుపు చర్యల్లో భాగంగా పగటిపూట అత్యవసరమైతేనే ఏసీలను 25 డిగ్రీల పరిమితిలో వాడాలని, సాయంత్రం 6 గంటల తర్వాత ఏసీల వాడకం పూర్తిగా తగ్గించాలని సీఎస్ సూచించారు. అన్ని థర్మల్ స్టేషన్లలో గరిష్ట ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని, యాదాద్రి కేంద్రంపై ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలోనే అఖిలపక్ష సమావేశం, క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ఉంటుందని వెల్లడించారు.

అక్రమ మోటార్లతో ట్రాన్స్ ఫార్మర్ల దగ్ధం..

వ్యవసాయ అవసరాల కోసం స్థానిక నీటి వనరుల నుంచి కొందరు అక్రమంగా మోటార్లతో నీటిని తోడుతున్నారని విద్యుత్ శాఖ అధికారులు వివరించారు. దీనివల్ల ఓవర్లోడ్ పడి స్థానికంగా ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అనధికారిక వినియోగాన్ని అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ అధికారులకు సూచించారు.

హైదరాబాద్లో తాగునీటి అవసరాల కోసం

మంజీర, సింగూరు ద్వారా నీటి సరఫరా లేని నేపథ్యంలో మిషన్ భగీరథ (60 ఎంజీడీలు), కృష్ణా జలాల ద్వారా తాగునీటిని సేకరిస్తున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. నగరంలో తాగునీటి అవసరాలకు మినహా కొత్త నిర్మాణాలకు బోర్లు తవ్వడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. నల్లాలకు అక్రమ మోటార్లు బిగిస్తే హైడ్రా సహకారంతో ఏరివేసే ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. నవంబర్ 1 నుంచి నిర్మాణ పనులకు ఎస్టీపీల ట్రీటెడ్ వాటర్ను గ్రీన్ ట్యాంకర్ల ద్వారా అందజేస్తామని వెల్లడించారు.

జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ చర్యలు..

రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతుండటంతో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు. నల్గొండ జిల్లాలో ఉపాధి హామీ పనులను మరింత ముమ్మరం చేశామని హరిచందన వివరించగా, కరీంనగర్ జిల్లాలో వచ్చే జూన్ వరకు తాగునీటి సమస్య ఉండదని బీడీ ఎక్కా స్పష్టం చేశారు. ఆదిలాబాద్లో పశుగ్రాసానికి ముందస్తు ప్రణాళిక అమలు చేస్తున్నామని ఇలంబర్తి చెప్పారు.



మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు జూన్ వరకు నీరందాలంటే పాలేరు రిజర్వాయర్లో 4 టీఎంసీలు కావాల్సి ఉండగా ప్రస్తుతం 2 టీఎంసీలే ఉన్నాయని ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ సమావేశంలో నవీన్ మిత్తల్, సురేంద్ర మోహన్, టీకే శ్రీదేవి, సీఎండీలు వరుణ్ రెడ్డి, జితేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

చెడుపై విజయమే విజయ దశమి



నవరాత్రి పదంలో నవ శబ్దం తొమ్మిది సంఖ్యను సూచిస్తుంది. నవరాత్రులను నవ అహోరాత్రాలు అని ధార్మిక గ్రంథాలు వివరిస్తున్నాయి. అంటే తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు నిర్వర్తించే దేవి పూజకు ఒక ప్రత్యక విధానం ఉంది. ఆశ్వయుజ శుక్ల పక్ష పాడ్యమి తిథి నుండి పూర్ణిమ వరకు తొమ్మిది రాత్రులు తొమ్మిది పగళ్ళు అమ్మవారిని పూజించడం ప్రశస్తంగా చెప్పబడింది. దీనినే 'శరన్నవరాత్రులు' లేదా 'దేవి నవరాత్రులు' అంటారు.

నవ రాత్రి వాస్తవానికి ఋతువుల సంధికాలం. అందుచేత సృష్టికి కారణమైన మహా మాయ తీవ్రవేగం కలిగి ఉంటుంది. పూజాదుల చేత ఆమెను ఆహ్వానించటం సులభ సాధ్యం. తొమ్మిది రోజులు నవ దుర్గలను నిష్ఠగా ఉపాసించే ఆరాధకులకు దేవి అనుగ్రహం లభిస్తుంది. నవ రాత్రులలో రాహు కాల వేళ రాహుకాల దీపం వెలిగించాలి. రాహు ప్రతికూల ప్రభావం తగ్గి, దోష నివారణ జరుగుతుంది. దేవి అర్చనలో లలితా సహస్రనామాలు, దుర్గాసప్తశతి పారాయణ చేసే భక్తుల కోరికలు నెరవేరుతాయి. రోగ పీడలతో బాధపడే వారు, జాతకంలో అపమృత్యు దోషం ఉన్నవారు ఈ తొమ్మిది రోజులు నియమం తప్పకుండా దేవి ఆరాధన చేయడం శుభకరం.

సాధారణంగా విజయదశమి నాడు శ్రవణ నక్షత్రం ఉంటుంది. నక్షత్ర మండలంలో శ్రవణ నక్షత్రం చెవి ఆకారంలో ఉంటుంది. అందుకే ఈ రోజు ఏదైనా కొత్త విద్యలు నేర్చుకోవాలనుకొనేవారు ఈ రోజు ప్రారంభిస్తే విశేషంగా లాభిస్తుంది. శమీ చెట్టు యొక్క పూజ ఈ రోజు విశేషంగా లాభిస్తుంది. జమ్మి చెట్టును పూజించడం లక్ష్మీప్రదమని పురాణాలు చెబుతున్నాయి. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయ దశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుంది.

పరమ శివునికి జగన్మాత దుర్గాదేవికి, సిద్ధి ప్రదాత గణపతికి శమీ పత్రి సమర్పించే ఆచారం అనాదిగా వస్తోంది. పూర్వం జమ్మి చెట్టు కాడల రాపిడి ద్వారా సృష్టించిన అగ్నితోనే యజ్ఞ యాగాదుల క్రతువులు నిర్వహించేవారు. ఇవాల్టికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో శమీ వృక్షంలో అగ్ని ఉంటుందనే విశ్వాసం దృడపడింది. అగ్ని వీర్యమే సువర్ణం కనుక జమ్మి బంగారం కురిపించే చెట్టుగా పూజార్హత పొందింది. ఈ రోజే శ్రీ రాముడు రావణునిపై విజయం సాధించాడు. విజయదశమి రోజునే శమీ పూజ కుడా నిర్వహిస్తారు.

శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది. సామాన్యులే గాక యోగులు నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ముఖ్యంగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. ఆలయాలలో అమ్మ వారికి విశేష అలంకరణలు, బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేసి, పూజిస్తారు. అమ్మవారు లోక కళ్యాణం కోసం ఒక్కోరోజు ఒక్కో అవతారం ధరించింది. అలా అమ్మవారు అవతరించిన రోజున, ఆ రూపంతో అమ్మవారిని అలంకరించి ఆ నామంతో ఆరాధిస్తూ ఉంటారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

శమయతే పాపం... శమీ వృక్ష విశిష్టత



భారతీయ సనాతన సంస్కృతిలో పండుగలు కేవలం ఆనందాన్ని పంచడమే కాకుండా, మానవుడిలో నైతిక స్థైర్యాన్ని, కర్తవ్య దీక్షను నింపుతాయి. పండుగలలో అత్యంత విశిష్టమైనది, అసురులపై సాధించిన విజయోత్సవానికి ప్రతీక అయిన 'విజయదశమి'. కామ క్రోధాది అరిషడ్వర్గాలపై, అధర్మంపై ధర్మం సాధించిన శాశ్వత విజయానికి గుర్తుగా జరుపుకొనే ఈ దసరా వేడుకల్లో మన పూర్వీకులు ప్రకృతి ఆరాధనకు పెద్దపీట వేశారు. ఈ తొమ్మిది రోజుల శరన్నవరాత్రి ఉత్సవాల ఆసాంతం అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచిన భక్తులు, పదవ రోజైన విజయదశమినాడు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే పవిత్ర ఘట్టం 'శమీ పూజ'. త్రేతా యుగంలో శ్రీరాముడు రావణాసురునిపై యుద్ధానికి వెళ్లే ముందు లంకా విజయానికి సంకేతంగా శమీ వృక్షాన్ని పూజించాడు. అలాగే, ద్వాపర యుగంలో మహాభారత యుద్ధానికి ముందు పాండవులు తమ అజ్ఞాతవాస సమయంలో తమ దివ్య అస్త్రాలను ఈ శమీ వృక్షంపైనే భద్రపరిచి, తిరిగి వాటిని పొంది మహా సంగ్రామంలో గొప్ప విజయాన్ని సాధించారు.



పౌరాణిక విశిష్టత కలిగిన ఆ పవిత్ర జమ్మి చెట్టు (శమీ వృక్షం) మనకు కేవలం ఒక వృక్షం మాత్రమే కాదు, భయాలను తొలగించి అభయాన్ని, అడుగుడుగునా విజయాన్ని అందించే ఒక దైవిక శక్తి. అగ్నిదేవుడు నివసించే నిలయంగా భావించే ఈ చెట్టును దర్శించడం, పూజించడం ద్వారా సకల పాపాలు హరిస్తాయని నమ్ముతారు. విజయదశమికి, శమీ వృక్షానికి ఉన్న ఆ విడదీయరాని ఆధ్యాత్మిక అనుబంధం ఏమిటి? ఆనాటి సాంప్రదాయాలు నేటి సమాజానికి ఇస్తున్న సందేశం ఏమిటో ఇప్పుడు చూద్దాం. దసరా (విజయదశమి) పర్వదినాన పూజించే శమీ వృక్షం (జమ్మి చెట్టు)కు మన సంస్కృతిలో, పురాణాల్లో అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. శమీ పూజ త్రేతా యుగం, ద్వాపర యుగాల నాటి నుంచే కొనసాగుతోంది. ద్వాపర యుగంలో పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్ళే సమయంలో తమ దివ్య అస్త్రాలను (గాండీవం, ఖడ్గాలు మొదలైనవి) ఈ శమీ వృక్షంపైనే భద్రపరిచారు. అజ్ఞాతవాసం ముగిసిన తర్వాత విజయదశమి రోజున ఆ చెట్టును పూజించి, తమ ఆయుధాలను తిరిగి పొంది కురుక్షేత్ర యుద్ధంలో విజయం సాధించారు. దసరా నవరాత్రులలో అత్యంత ముఖ్యమైన విజయదశమి (పదవ రోజు) రోజున సాయంత్రం వేళ, అపరాహ్న కాలంలో శమీ పూజ చేయడం సంప్రదాయం. ఈ రోజును 'శమీ పూజ' లేదా 'జమ్మి పూజ' అని పిలుస్తారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పాటు దుర్గాదేవి కూడా ఈ వృక్షంలో కొలువై ఉంటారని భక్తుల విశ్వాసం. ఈ చెట్టును పూజించడం వల్ల శత్రువులు తొలగిపోతారని, అనుకున్న పనులలో విజయం, ధైర్యం కలుగుతాయని నమ్ముతారు.

'శమీ శమయతే పాపం శమీ లోహిత కంటకీ/ధారిణీ అర్జున బాణానాం రామస్య ప్రియవాదినీ/కరిష్యమాణ యాత్రాం యథాకాలం సుఖం మయా/తత్ర నిర్విఘ్న కర్త్రీ భవ శైవ నిరంతరం' ఈ మంత్రానికి 'నాలోని పాపాలను, కష్టాలను శమీ వృక్షం హరించాలి. త్రేతా యుగంలో రాముడికి, ద్వాపర యుగంలో అర్జునుడికి విజయాన్ని చేకూర్చినట్లుగానే, నా ప్రయాణంలోనూ ఎలాంటి విఘ్నాలు కలగకుండా నాకు విజయాన్ని ప్రసాదించు' అని అర్థం. విజయదశమి రోజు జమ్మి ఆకులను 'బంగారంగా' భావించి పెద్దల ఆశీర్వాదం తీసుకుని ఇళ్లకు తెచ్చుకుంటాం. ఆయుర్వేదంలో శమీ వృక్షానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీని ఆకులు, వేర్లు, బెరడు వివిధ ఆయుర్వేద ఔషధాల తయారీలో చర్మ వ్యాధులు, మధుమేహం వంటి వాటి నివారణకు వాడతారు.

ఇలా విజయదశమి రోజున జమ్మి ఆకులను (బంగారంగా భావించి) పెద్దల చేతుల మీదుగా తీసుకుని బంధుమిత్రులకు ఇచ్చి 'శమీ శమయతే పాపం శమీ లోహిత కంటినీ' అంటూ ఆశీస్సులు తీసుకుంటారు. ఈ దసరాకే శమి వృక్షాన్ని పూజిస్తారు. పాండవులు తమ ఆయుధాలకు పూజ చేసి విజయం సాధించిన రోజూ, శ్రీరాముడు విజయం సాధించిన రోజూ ఇదే కావడంతో, కొత్త పనులు ప్రారంభించేవారికి, విజయాలను కోరుకునేవారికి ఈ రోజు అత్యంత పవిత్రమైనది. అందుకే ఈ పండగ నాడు శమీ పూజ చేయడం ఆనవాయితీగా మారింది. కాలాన్ని బట్టి ఆచారాలు, జీవన శైలులు మారుతున్నా, మన సాంస్కృతిక వేర్లను గట్టిగా పట్టుకుని భవిష్యత్తుకు బాటలు వేసే సనాతన సంప్రదాయాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి, తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ఈ పవిత్ర విజయదశమి వేళ మనం భక్తితో పూజించే ఆ జమ్మి చెట్టు, మన జీవితాల్లోని అజ్ఞానమనే చీకట్లను, కష్టాలనే మేఘాలను తొలగించి, ముందడుగు వేసే ప్రతి ప్రయత్నంలోనూ నూతన ఉత్తేజాన్ని, సకల జయాలను ప్రసాదించాలని మనసారా కోరుకుందాం. అరిషడ్వర్గాలపై, చెడుపై మంచి అఖండ విజయం సాధించిన ఈ మహోత్సవ దినాన, మనలోని అహంకార, మమకారాలను వదిలిపెట్టి, సేవాభావంతో, కర్తవ్య దీక్షతో, విజయవంతమైన అడుగులతో ముందుకు సాగుదాం.

- పింగళి భాగ్యలక్ష్మి
9704725609

పండుగెట్లా..?

ఎల్ నినోదే దెబ్బ
గుయ్యిమంటది గూబ
సర్కారు కేందబ్బ!
ఓ కోయిలమ్మ
తిండి గింజలు కరువు
దినవెచ్చములు బరువు
యెవ్వడివ్వడు అరువు
ఓ కోయిలమ్మ
పసుగ్రాసముకు కొరత
పనిలేని మన యువత
లేదు పల్లెన భవిత --
ఓ కోయిలమ్మ
మరుగుతున్నది జలము
కరుగుతున్నది హిమము
తరుగుతున్నది స్థలము
ఓ కోయిలమ్మ

నీల్ల లేమికి అండ
సలి కాలమున యెండ
ప్రజల కడుపులు మండ!
ఓ కోయిలమ్మ

గుక్క నీల్లకు గోస
ఆగె పైరుల శ్వాస
చావదెందుకు ఆశ
ఓ కోయిలమ్మ

పాతాళమున గంగ
ఆశలే చెదరంగ
పల్లె రైతుకు బెంగ!
ఓ కోయిలమ్మ

కరువు కోరలు సాచి
చెరువు నెర్రెలు సూచి
గుండె దరువులు వేసె
ఓ కోయిలమ్మ
సంఘజీవిగ మనిషి-
స్వార్థ బుద్ధిని వలచి-
సకల సంపద దోచె-
ఓ కోయిలమ్మ

ధరలు దిగి రావోయి-
ప్రభుత ఇది కనదోయి-
ఇగ పండగేదోయి?
ఓ కోయిలమ్మ

- జమ్మి

అశోకుని దమ్మ విజయమే దసరా

భారత చరిత్రలో రెండు విజయదశములు ఉన్నాయి. ఒకటి పురాణాల విజయదశమి, రెండోది చరిత్రలో నమోదైన అశోక విజయదశమి. ప్రతి సంవత్సరం రెండూ ఒకే రోజు రావడం యాదృచ్ఛికం కాదు, చరిత్రను అర్థం చేసుకునే సందర్భం.

మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అశోకుడు క్రీ.పూ 261 లో కళింగ యుద్ధం చేశాడు. లక్ష మంది చనిపోయారు. ఆ రక్తపాతం చూసి అశోకుడి హృదయం మారింది. బౌద్ధ భిక్షువు ఉపగుప్తుడి ద్వారా బుద్ధ ధమ్మాన్ని స్వీకరించాడు. ఇకపై 'భేరి ఘోష' కాదు, 'ధమ్మ ఘోష' అని ప్రకటించాడు.ఈ నిర్ణయం తీసుకున్న రోజు ఆశ్వయుజ శుద్ధ దశమి. అంటే పదో రోజు. ఆ రోజు నుండి అశోకుడు తన రాజ్యమంతా శిలాశాసనాలు వేయించి, 'అన్ని జీవులు నా బిడ్డలు, యుద్ధం వద్దు, దయ, సత్యం, అహింస కావాలి' అని చాటించాడు. బౌద్ధ గ్రంథాలైన దీపవంశం, మహావంశం ప్రకారం, అశోకుడు తన కుమారుడు మహేంద్రుడు, కుమార్తె సంఘమిత్ర ద్వారా బౌద్ధాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్ వరకు పంపాడు. ఈ విజయానికి గుర్తుగా బౌద్ధులు ఆ రోజును 'అశోక విజయదశమి'గా జరుపు కుంటున్నారు. దీనికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అశోకుడి శాసనాలు ఇప్పటికీ భారతదేశ మంతా ఉన్నాయి.



హిందూ పురాణాల ప్రకారం దసరా రోజు రాముడు రావణుడిపై, దుర్గాదేవి మహిషాసురుడిపై గెలిచిన రోజు. దీనికి చారిత్రక శాసన ఆధారాలు లేవు. ఐతే తేదీ మాత్రం అదే ఆశ్వయుజ దశమి. అశోకుడి కాలం క్రీ.పూ 3వ శతాబ్దం. రామాయణ, మహాభారత కాలం తర్వాత వ్రాయబడిన పురాణాల్లో దసరా ప్రస్తావన వచ్చింది. మౌర్యుల తర్వాత వచ్చిన శుంగ వంశపు పుష్యమిత్ర శుంగుడు బౌద్ధులను ఊచకోత కోసి, బౌద్ధ పండుగలను, స్థూపాలను ధ్వంసం చేసి, వాటి స్థానంలో బ్రాహ్మణీయ పండుగలను ప్రతిష్టించాడని చరిత్రకారులు డి.డి. కోశాంబి, డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ 'ది రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్ ఇన్ ఇండియా' లో రాశారు.

అశోకుడు నెలకొల్పిన 'శోకం లేని రాజ్యం' అంటే దుఃఖం, కులం, మతం, వర్ణం, లింగం తదితర భేదాలు లేకుండా యుద్ధం లేని సమాజం. దానిని మరిచిపోయేలా చేయడానికి ఆ రోజునే దుర్గాదేవి విజయంగా మార్చారని, ఇది చారిత్రక వక్రీకరణ అని అంబేద్కర్ వాదులు, బౌద్ధ పండితులు చెబుతారు. ఇది వందశాతం అబద్ధం అని గానీ నిజం అనీ చెప్పలేం. కానీ ఒక విషయం మాత్రం చారిత్రక వాస్తవం అశోక విజయదశమికి శాసన ఆధారాలు ఉన్నాయి, దసరా పౌరాణిక కథకు ఆధారాలు లేవు.

అంబేద్కర్ 1956 అక్టోబర్ 14 న బౌద్ధ ధమ్మ దీక్ష తీసుకున్నారు. ఆ రోజు అశోక విజయదశమి. ఆయన తెలిసే ఆ రోజును ఎంచుకున్నారు. 'నేను కొత్త మతంలోకి పోవడం లేదు, ఈ దేశపు అసలు ధమ్మానికి, అశోకుడి ధమ్మానికి తిరిగి వస్తున్నాను' అశోకుడు రాజ్యాధికారంతో దమ్మాన్ని స్థాపించాడు. అంబేద్కర్ రాజ్యాంగంతో అదే దమ్మాన్ని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని ఆధునిక భారతంలో స్థాపించాలనుకున్నాడు.

బహుజన నాయకుడు కాన్షీరాం దీన్నే అర్థం చేసుకున్నారు. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని శక్తిగా ఉపయోగించుకొని ఉత్తరప్రదేశ్‌లో 1993-2007 మధ్య బహుజన రాజ్యాన్ని స్థాపించి చూపించారు. నాడు అశోకుడు నెలకొల్పిన సమతా రాజ్యాన్ని ఉత్తర ప్రదేశ్‌లో కాన్షీరాం నెలకొల్పాడు. అగ్రవర్ణ కులాల చేత తరతరాలుగా ఊరికి చివరన ఉంటూ అంటరాని వారిగా ముద్ర పడి సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా పీడనకు గురైన బహుజన సమాజాన్ని పాలకులను చేశాడు. 'అశోకుడి వారసులం మనం, మనువు వారసులు కాదు'

ప్రతి గ్రామంలో ధమ్మపదం, రాజ్యాంగ పాఠశాలలు పెట్టాలి. మనసులో మనువును తీసి, బుద్ధుడిని పెట్టాలి. దేవుడి కోసం కాదు, ఆత్మగౌరవం కోసం బౌద్ధ విహారాలకు వెళ్లాలి. రాజకీయ పోరాటం: కాన్షీరాం చెప్పిన 'ఓటు ఖడ్గం'ను వాడాలి. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ 85% ప్రజలు ఒకే వేదికపైకి రావాలి. కులాల వారీగా విడిపోతే అగ్రవర్ణాలే రాజ్యమేలుతారు. అశోకుడి శోకం లేని రాజ్యం అంటే అందరికీ భూమి, విద్య, వైద్యం, ఉపాధి సమృద్ధిగా మౌలిక సదుపాయాలు ఉన్న రాజ్యం, అది ఓటుతోనే సాధ్యం.

దసరా రోజు ఆయుధాలను పూజించడం కాదు, అశోకుడిలా ఆయుధాలను వదిలేయడం నేర్చుకోవాలి. రావణ దహనం కాదు, మనలోని కుల అహంకారం, మనువాదాన్ని దహనం చేయాలి. అంతిమంగా అశోక విజయదశమి దసరా రెండూ ఒకే తేదీన రావడం చరిత్ర మనకు ఇచ్చిన అవకాశం. పురాణాన్ని నమ్ముతూ బానిసలుగా బతకాలా? చరిత్రను తెలుసుకుని అశోకుడి వారసులుగా రాజ్యాధికారం చేపట్టాలా? అనేది నేటి బహుజనుల ముందున్న ప్రశ్న? అంబేద్కర్ కలగన్న ప్రబుద్ధ భారత్, కాన్షీరాం కలగన్న బహుజన రాజ్యం రెండూ అశోకుడి దమ్మ రాజ్యానికి ఆధునిక రూపాలే. కాబట్టి ఇతరులను ఓడించడం కంటే సమాజంలోని అన్యాయాన్ని ఓడించడం గొప్ప విజయం! అదే అశోకుడి మానవతా విలువలకు, అంబేద్కర్ రాజ్యాంగానికి, కాన్షీరాం బహుజన ఉద్యమ లక్ష్యానికి నిజమైన నివాళి.

- పుల్లెంల గణేష్
9553041549

విజయ దశమి

చెడుపైన మంచిచేయు
యుద్ధమే సంబురము
బాధలన్నీ తొలగిపోవు
ఆనందమే అంబరము
మహిషాసుర సంహారం
చేసినట్టి ఆదిపరా శక్తి
ఉగ్రరూప జగద్ధాత్రి
పులకించెను ఈ ధరిత్రి
దుర్గదేవి విరోచితం
పది దినాల పరం పరం
జగతి శాంతి కేతనం
ప్రగతి కాంతి పతాకం
రావణ గుణవధ పర్వం
అణచబడ్డ రాక్షస గర్వం
విరోచిత విజయాలను
తెలుపుతుంది దసరా రథం
పాండవుల ఉడుం పట్టు
ఆయుధాల అసలు గుట్టు
దాచినట్టి జమ్మిచెట్టు
పూజలందు కుంటున్నది
పుడమిపై బంగార మైవున్నది
స్వచ్ఛ వెలుగు పూలబుట్ట
స్వేచ్ఛ పులుగు పాలిట్ట
రివ్వున ఎగిరి వస్తున్నది
పండుగను తిరిగి తెస్తున్నది
శరదృతువు ఆరంభం
దశమి క్రతువు సంరంభం
అసుర గణాల పరాజయం
జన గణానికి జయం జయం..!

- డా.కటుకోర్ల్వుల రమేష్
9949083327

పాలపిట్ట

వచ్చింది వచ్చింది పాలపిట్ట
వచ్చి వాలింది జమ్మి చెట్టు పైన
వచ్చింది వచ్చింది పాలపిట్ట
వచ్చి ఇచ్చింది శుభాలు పాలపిట్ట!

దాని రంగు నింగి నీలి రంగు
నీలకంఠుని నీలి హంగు!
పరమేశ్వరుని రూపం పాలపిట్ట
పరమ పవిత్రమైన రంగుల పాలపిట్ట!

ఆటంకాలు తొలగించు పాలపిట్ట
ఆయుధాల మీద వాలింది పాలపిట్ట
అడుగడుగున జయం అందించు పాలపిట్ట
అదృష్టాన్ని తెచ్చే అదృష్టాల పాలపిట్ట!

పాండవులకు జాడ చూపింది పాలపిట్ట
పాతరలో ఆయుధాలు కాపాడింది పాలపిట్ట!
వనవాసం తీర్చి గెలిపించింది పాలపిట్ట
విజయాలు కలిగించు మన పాలపిట్ట!

విజయదశమి నాడు చూద్దాము పాలపిట్ట
విజయాలు కలిగించు పాలపిట్ట
జమ్మి ఆకుతో పాటు మొక్కుదాం పాలపిట్ట
జయమంటూ కాపాడుదాం పాలపిట్ట!
జయము జయము పాలపిట్ట
జయాల విజయదశమి పాలపిట్ట!

-పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250



హృదయ మయూరం

స్వాతి చినుకు తాకినట్టు
నీ తలపు తాకితే ఎండిన నా అంతరంగం
వసంతమై పరిమళిస్తుంది.
వెన్నెల జాబిల్లి కింద
నీ మౌనం పలికినప్పుడల్లా
మాటలకందని ప్రేమ
నా లోపల రాగమవుతుంది.
నీ చూపు ఒక్కసారి
నా జ్ఞాపకాన్ని తడిపితే
నిశ్చలమైన కాలంలోనూ
వయసు ఊయలూగుతుంది.
తొలకరి నేలను ముద్దాడిన క్షణంలా
నీ జ్ఞాపకం నన్ను తాకగానే
మౌనం మధురమవుతుంది,
ఊహకు రెక్కలొస్తాయి...
అప్పుడు నా అంతరంగపు ఆకాశంలో
హృదయ మయూరం
పురివిప్పి నాట్యమాడుతుంది!

- డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల నుండి వికసిత భారత్ వైపు...

ఆర్.ఎస్.ఎస్.ను 1925 విజయదశమి నాడు నాగపూర్‌లోడాక్టర్ కేశవ బలిరామ్ హెడ్గేవార్ ప్రారంభించారు. ఆర్.ఎస్.ఎస్. 2025 విజయదశమి నాటికి తన శతాబ్ది (100 ఏళ్లు) ప్రస్థానాన్ని చేరుకుంది. ఒక శతాబ్ద కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా రూపాంతరం చెందింది. ఆర్.ఎస్.ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025 విజయదశమి నుంచి 2026 విజయదశమి వరకు దేశవ్యాప్తంగా ఏడాది పొడవునా శతాబ్ది కార్యక్రమాలను నిర్వహించారు.

శతాబ్ది ఉత్సవాల ప్రారంభం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఒకే రోజు సుమారు 62,555 విజయ దశమి కార్యక్రమాలు, 25,000 ప్రాంతాల్లో యూనిఫాంలో క్రమశిక్షణతో కూడిన 'పథ్ సంచలన్'లు 2025లో నిర్వహించారు. ఇందులో 32 లక్షలకు పైగా స్వయంసేవకులు పాల్గొన్నారు. అదే ఏడాది ఆర్.ఎస్.ఎస్ శతాబ్దిని పురస్కరించుకుని కేంద్రం రూ. 100 ప్రత్యేక స్మారక నాణేన్ని (Commemorative Coin), ప్రత్యేక పోస్టల్ స్టాంపును ఆవిష్కరించింది.

ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ వెళ్ళటం, మాట్లాడటం ఆర్.ఎస్.ఎస్. జన సంపర్కం ఆనవాయితీగా వస్తున్నదే. సంస్థ పరిధిని విస్తరిస్తూ దేశంలోని 58,000 పైగా మండలాలు, 44,000 బస్తీలలో 'గృహ సంపర్క్' (ఇంటింటి ప్రచారం) నిర్వహించి, పంచపరివర్తన పై అవగాహన కల్పించారు. దేశ వ్యాప్తంగా ప్రతిష్టిత, నాగరిక, మేధావుల సదస్సుల పేరుతో అన్నీ జిల్లా కేంద్రాలలో ప్రభావ వంతమైన కార్యక్రమాల్ని నిర్వహించింది.అంతే కాకుండా వివిధ కుల సంఘాలను ఏకం చేస్తూ సద్భావన సదస్సులను దేశమంతటా నిర్వహించింది.

హిందూ సమ్మేళనాలు, యువ సమ్మేళనాలు జరిగిన తీరు 'నభూతో న భవిష్యతీ' అనే చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా ఒక లక్షకుపైగా హిందూ సమ్మేళనాలు నిర్వహిం చింది.

శతాబ్ది సంవత్సరంలో సంఘ్ కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా సమాజంలో మార్పు కోసం ఐదు ప్రధాన అంశాలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. సామాజిక సామరస్యత (కులాల సమానత్వం), కుటుంబ ప్రబోధన్



(కుటుంబ విలువలు), పర్యావరణ పరిరక్షణ (జల సంరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజం),'స్వదేశీ' జీవనశైలి ఆత్మనిర్భరత,పౌర విధులు (రాజ్యాంగ నిబంధనలు, పౌర నియమాల పాలన).

ఆర్.ఎస్.ఎస్ వందేళ్ల కాలంలో సామాజిక, రాజకీయ, సాంస్కృతిక మరియు విద్యా రంగాలలో బలమైన ముద్ర వేసింది. సంఘ్ సాధించిన అతిపెద్ద విజయం క్రమశిక్షణ గల నాయకులను సమాజానికి అందించడం. రోజువారీ 'శాఖ'ల ద్వారా దేశభక్తి, నిస్వార్థ సేవ, సమాజ హితాన్ని నూరిపోసి సాధారణ పౌరుల నుంచి అగ్రశ్రేణి నాయకుల వరకు తీర్చిదిద్దింది. భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, సామాజిక కార్యకర్తలు సంఘ్ నేపథ్యం నుంచి ఎదిగినవారే.

విద్యారంగంలో విద్యాభారతి పేరుతో వేల సంఖ్యలో సరస్వతీ శిశుమందిర్‌లు, మారు మూల గిరిజన గ్రామాల్లో ఒకే ఉపాధ్యాయుడితో నడిచే లక్షలాది 'ఏకల్ విద్యాలయాలు' ద్వారా నిరుపేదలకు విద్యను అందించింది. గిరిజన సంక్షేమం కొరకు వనవాసి కల్యాణ ఆశ్రమం పేరుతో అటవీ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్య, వైద్యం కల్పించి వారి హక్కులను, సంస్కృతిని పరిరక్షించింది. రైతుల కోసం భారతీయ కిసాన్ సంఘ్, భారతీయ మజ్దూర్ సంఘ్ ద్వారా శ్రామిక వర్గాలకు స్వతంత్ర వేదికలను నిర్మించింది.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ద్వారా దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘాన్ని నిలబెట్టింది.

భారతదేశంలో ఎక్కడ భూకంపం, వరదలు, తుఫానులు లేదా రైలు ప్రమాదాలు జరిగినా సంఘ్ స్వయంసేవకులు తక్షణమే రక్షణ చర్యల్లో పాల్గొంటారు.1975లో విధించిన అత్యవసర పరిస్థితి సమయంలో ఆర్.ఎస్.ఎస్‌పై నిషేధం విధించినప్పటికీ, రహస్యంగా పోరాటాన్ని నిర్వహించింది. 'లోక్ సంఘర్ష్ సమితి' ద్వారా లక్షలాది మంది కార్యకర్తలు జైలుకు వెళ్లి దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు వెన్నెముకగా నిలిచారు.

శతాబ్ద కాలంలో భారతీయ సంస్కృతి, పురాతన వారసత్వం, జాతీయవాదం వంటి అంశాలను సమాజంలో ప్రధాన స్రవంతి చర్చలుగా మార్చడంలో ఆర్.ఎస్.ఎస్ సిద్ధాంతాలు కీలక పాత్ర పోషించాయి.

ఈ శతాబ్ద కాలంలో ఆర్.ఎస్.ఎస్ మూడు పర్యాయాలు (1948, 1975, 1992) ప్రభుత్వ నిషేధాలను, అనేక రాజకీయ, సైద్ధాంతిక విమర్శలను ఎదుర్కొంది. ఎప్పటి కప్పుడు కోర్టుల ద్వారా క్లీన్ చిట్ సాధిస్తూ, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించడం ద్వారా సంస్థ తన ప్రభావాన్ని నిలబెట్టుకోగలిగింది. 1925లో ఒక చిన్న నగరంలో స్వదేశీ ఆశయంతో ప్రారంభమైన ఆర్.ఎస్.ఎస్, 2025 నాటికి దేశంలోని మూలమూలకూ విస్తరించిన వ్యవస్థగా ఎదిగింది. రాబోయే దశాబ్దాలలో 'వికసిత భారత్' నిర్మాణంలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, కుల అసమానతలు లేని సమరస సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా సంఘ్ తన శతాబ్ది ప్రస్థానాన్ని ముందుకు నడిపిస్తోంది.

- సాకి
9949394688

నేడు చిగురుమామిడి మండలంలో దసరా వేడుకలు

పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ



చిగురుమామిడి, అక్టోబర్ 19(మనం న్యూస్): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నేడు చిగురుమామిడి మండల వ్యాప్తంగా శమీ పూజ (జమ్మి పూజ) ఘనంగా జరగనుంది. మండలంలోని అన్ని గ్రామాల్లోని జమ్మి చెట్ల వద్ద ఉదయం 6 గంటల నుండి భక్తులు పూజలు నిర్వహించనున్నారు. పురోహితులు శమీ వృక్ష ప్రాముఖ్యతను వివరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. భక్తులు జమ్మి ఆకులను బంగారంగా భావించి ఒకరికొకరు పంచుకోనున్నారు.

శమీ పూజ అనంతరం పాలపిట్ట దర్శనం:

శమీ పూజ అనంతరం భక్తులు పాలపిట్ట దర్శనం కోసం ఆసక్తిగా ఎదురుచూడనున్నారు. దసరా రోజున పాలపిట్టను దర్శించుకోవడం శుభప్రదమని, విజయానికి సంకేతమని భక్తుల నమ్మకం. పొలాల్లో, జమ్మి చెట్ల సమీపంలో పాలపిట్ట కనిపిస్తే శుభం జరుగుతుందని పెద్దలు చెబుతారు. నేడు ఉదయం నుండి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు, యువకులు పాలపిట్ట దర్శనం కోసం సాయంత్రం పొలాల్లోకి వెళ్లనున్నారు. అదేవిధంగా నేడు ఉదయం 10 గంటలకు చిగురుమామిడి పోలీస్ స్టేషన్లో ఆయుధ పూజ నిర్వహించనున్నారు. ఎస్ఐ జగదీశ్వర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తమ ఆయుధాలు, వాహనాలు, విధి నిర్వహణ సామగ్రిని శుభ్రం చేసి పూలతో అలంకరించి పూజ చేయనున్నారు. శాంతి భద్రతలు పరిరక్షించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. మండలంలోని ప్రధాన ఆలయాల వద్ద వాహన పూజలు కూడా నేడు జరగనున్నాయి. రైతులు, వాహనదారులు తమ వాహనాలకు పూజలు చేసి సురక్షిత ప్రయాణం కోసం వేడుకోనున్నారు. ఈ కార్యక్రమాల్లో వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మండలఅధికారులు,, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయదశమి వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు.

కృష్ణానగర్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

సొంత నిధులతో ఏర్పాటు చేసిన బతుకమ్మ
బావిని ప్రారంభించిన మాజీ చైర్పర్సన్ అడువాల జ్యోతి



జగిత్యాల: అక్టోబర్ 19(మనం న్యూస్): జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలు తీసుకొచ్చిన బతుకమ్మలను అందంగా అలంకరించగా, వాటిలో ఉత్తమంగా అలంకరించిన మొదటి పది బతుకమ్మలను ఎంపిక చేసి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కృష్ణానగర్లో నూతనంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ బావిని అడువాల జ్యోతి తన సొంత నిధులతో నిర్మించగా, ఆమె ప్రారంభించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఉపయోగపడేలా బతుకమ్మ బావిని ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పులి రమాదేవి, కో ఆప్షన్ వీరబత్తిని పద్మజ శ్రీనివాస్, శ్రీ అభయ ఆంజనేయ ఆలయ ట్రస్ట్ మెంబర్స్ మరియు స్థానికులు నాయకులు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చండీ హోమంలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్



జగిత్యాల అక్టోబర్ 19 (మనం న్యూస్): జగిత్యాల పట్టణంలోని నూకపల్లి శ్రీ సరస్వతీ దేవాలయంలో నిర్వహించిన చండీ హోమం కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేదమంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన చండీ హోమంలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, జగిత్యాల పట్టణం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రాన్ని సమర్పించి, మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ను ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోయినపల్లి ప్రశాంత్ రావు, భక్తులు, ఆలయ అర్చకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విజయదశమి ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలి

జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని ఆకాంక్షించారు. దృఢమైన సంకల్పం, పట్టుదలతో ముందుకు సాగితే విజయం తప్పక సిద్ధిస్తుందనే స్ఫూర్తిని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు.

దుర్గాదేవి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని, చేపట్టిన ప్రతి కార్యంలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సానుకూలత, విజయాలను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి): ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 16 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవో లు మధు సూదన్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

శాతవాహనలో 49 సహాయ ఆచార్యుల నియామకానికి అనుమతి

రాష్ట్రవ్యాప్తంగా 429 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం: మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి అక్టోబర్ 19 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పట్ల రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏడు విశ్వవిద్యాలయాల్లో మొత్తం 429 పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయనుండగా, అందులో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో 49 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చిందని మంత్రి తెలిపారు. ఈ నియామకాలకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ 141, 142 నంబర్లతో ఉత్తర్వులు జారీ చేసిందని, సాధారణ మార్గదర్శకాలు, రోస్టర్ విధానానికి అనుగుణంగా ఈ నెలాఖరు నాటికి ప్రకటనలు వెలువడనున్నాయని పేర్కొన్నారు.

శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో ఖాళీల వివరాలు:

విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల (హుస్నాబాద్) - 36 పోస్టులు, గణక శాస్త్ర విభాగం: 07, కృత్రిమ మేధ విభాగం: 07, విద్యుదయస్కాంత విభాగం: 07, సమాచార సాంకేతిక విభాగం: 05, విద్యుత్ విభాగం: 01, యాంత్రిక విభాగం: 02, ఆంగ్లం: 01, గణిత శాస్త్రం: 02, భౌతిక శాస్త్రం: 02, రసాయన శాస్త్రం: 02, వ్యాయామ విద్యా విభాగం: 01, గ్రంథాలయాధికారి: 01, న్యాయ కళాశాల (విశ్వవిద్యాలయ ప్రాంగణం) - 08 పోస్టులు, న్యాయ శాస్త్రం: 08, ఔషధ శాస్త్ర కళాశాల (ఎల్ఎండీ ప్రాంగణం) - 02 పోస్టులు, ఔషధ శాస్త్రం: 02, వాణిజ్య, నిర్వహణ కళాశాల (విశ్వవిద్యాలయ ప్రాంగణం) - 01 పోస్టు, వాణిజ్య శాస్త్రం: 01 ఈ పోస్టుల భర్తీ ద్వారా ఉన్నత విద్యా రంగం మరింత బలోపేతం కావడంతో పాటు నాణ్యమైన బోధన అందుబాటులోకి వస్తుందని మంత్రి వివరించారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మంథని నుంచి లడఖ్ వరకు6,500 కి.మీసోలో బైక్ యాత్ర పూర్తి



మంథని, అక్టోబర్ 19(మనంన్యూస్): పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన శివకుమార్ సంగే తన బజాజ్ డొమినార్ 400 బైక్ పై ఒంటరిగా 6,500 కిలోమీటర్ల సాహస యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. మంథని నుంచి హైదరాబాద్ మీదుగా శ్రీనగర్ మార్గంలో లడఖ్ చేరుకుని,తిరుగు ప్రయాణంలో మనాలి మార్గం ద్వారా స్వస్థలానికి చేరుకున్నారు.ఈ యాత్రలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న మోటారు రహదారిగా గుర్తింపు పొందిన 19,024 అడుగుల ఎత్తులోని ఉమ్లింగ్ లా పాస్, 17,582 అడుగుల ఎత్తులోని ఖర్దుంగ్ లా పాస్ లను అధిరోహించి అరుదైన ఘనత సాధించారు. తీవ్రమైన చలి,తక్కువ ఆక్సిజన్, క్లిష్టమైన పర్వత మార్గాలను ఎదుర్కొంటూ చేసిన ఈ యాత్ర చిన్ననాటి కలను నిజం చేసుకోవడమేనని శివకుమార్ తెలిపారు. స్వస్థలానికి చేరుకున్న ఆయనకు స్నేహితులు ఘనంగా స్వాగతం పలికారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉన్నాం

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథని అభివృద్ధి
సర్వసుందరంగా పుష్కర్ ఘాట్ పనులు,చెరువుల సుందరీకరణ పనులు
ఓర్వలేకనే మంత్రిపై అసత్యపు ఆరోపణలు



మంథని అక్టోబర్19(మనం న్యూస్): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉన్నామని మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ పేర్కొన్నారు.ఆదివారం మంథని మున్సిపల్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్రలో సద్దుల బతుకమ్మను ఈ సంవత్సరం ఘనంగా నిర్వహించుకున్నామని తెలిపారు.తెలంగాణ ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రజలంతా ప్రశాంతమైన వాతావరణంలో దసరా పండుగ జరుపుకోవాలని సూచించారు. దసరా పండుగ ఏర్పాట్లను మంథని మున్సిపల్ పాలకవర్గం పర్యవేక్షిస్తుందని తెలిపారు.మంత్రి శ్రీధర్ బాబు చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకనే మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.మిట్ట మధ్యాహ్నం తమ్మీ చెరువు కట్టను సందర్శించి,వీధి దీపాలు లేవు అనడం ఎంతవరకు సమంజసం అని అన్నారు.ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంథని అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించడం జరిగిందని,పుష్కర ఘాటు వద్ద అత్యంత సర్వ సుందరంగా తీర్చిదితే కార్యక్రమాలు జరుపుతున్నట్లు తెలిపారు.బాహుబలి సెట్,కాశీ నుండి పండితులను రప్పించి పుష్కరాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు.గతంలో మంథని ఎంత మేరకు అభివృద్ధి చెందింది, ప్రస్తుతం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.గత ప్రభుత్వ కాలంలో ప్రతి చిన్న పనికి ప్రజల నుండి కమిషన్లు తీసుకునేవారని,మా పాలకవర్గ సభ్యులు ప్రజల సమస్యను ప్రజలచేతకు వెళ్లి పరిష్కరిస్తున్నట్లు గుర్తు చేశారు.చెత్త మీద కమిషన్లు మా పాలకవర్గ సభ్యులు తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు.వచ్చే ఎన్నికల వరకు ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తి చేస్తేనే ఓట్లు అడుగుతామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్లు సగం వరకే పనులు చేసి ఎందుకు వదిలిసారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం మంత్రి శ్రీధర్ బాబు,టీపీసీసీ కార్యదర్శి శ్రీనుబాబు, మున్సిపల్ పాలకవర్గం పైన ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ పబ్బం కోసమే మంథని మాజీ ఎమ్మెల్యే అసత్యపు ఆరోపణ చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. చెరువుల వద్ద వీధి దీపాలు రాత్రి వెలుగుతాయని పగలు కాదని సూచించారు.సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా చెరువుల సుందరీకరణ పనులను పాలకవర్గ సభ్యులు దగ్గరుండి చేయించారని తెలిపారు.గత ప్రభుత్వం కాలంలో 70 శాతం పనులే ఎందుకు పూర్తయ్యాయని ప్రశ్నించారు.గత ప్రభుత్వం పనులు చేద్దాం అని అనుకుంటే,మా ప్రభుత్వం ఐటీ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పనులు చేసి చూపెడుతుందని పేర్కొన్నారు.ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో గంగపురిలో డార్మెటరీ వచ్చే రెండు నెలలు పూర్తవుతుందని దాని ద్వారా సుమారుగా 300 మంది మహిళలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పనకు టాస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటివరకు టాస్క్ ద్వారా 86 మందికి ఉద్యోగాలు లభించాయని వివరించారు. విద్యార్థులలో నైపుణ్యం వెలికితీయడానికి డ్రీమ్ స్టార్ట్ రైజ్ సంస్థ నెలకొల్పడం జరిగిందని తెలిపారు.మంథని అభివృద్ధి యే ధ్యేయంగా పనిచేస్తున్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పైన ఆరోపణలు చేస్తే సహించమని పేర్కొన్నారు.చెత్త ద్వారా మున్సిపల్ పాలకవర్గం ఆదాయం సంపాదించిందని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని అన్నారు.గత ప్రభుత్వమే ప్రణాళిక లేకుండా ప్రజాధనాన్ని వృధా చేసిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఇప్పటికైనా చౌకబారు ఆరోపణలు మానుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కుర్ర లింగయ్య,మారుపాక నిహారిక,పెంటరి రాజేందర్, ఎల్లంకి వంశీధర్,నాయకులు జంబోజు సమ్మయ్య, ఎరుకల రమేష్ బాబు,సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఆరెల్లి కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్

జగిత్యాల అక్టోబర్ 19(మనం న్యూస్): భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 21 నుంచి డిసెంబర్ 31 వరకు కేంద్ర ప్రభుత్వ జన సురక్షా భీమా పథకాలైన 'ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన' మరియు 'ప్రధాన మంత్రి సురక్షా భీమా యోజన ' కోసం జిల్లా పరిధిలో ఉన్న అర్హులైన వారందరూ నమోదు చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ అన్నారు. సహజ మరణం మరియు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే ఆ కుటుంబ సభ్యులైన నామినీ కి కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఆర్థిక భరోసా ఇస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని అన్ని బ్యాంకుల బ్రాంచీలు తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఖచ్చితంగా శిబిరాలు నిర్వహించి ఎక్కువ మొత్తంలో నమోదు చేయాలని, రీ కేవైసీ పెండింగ్ కూడా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే అన్ని బ్యాంకుల ఉన్నతాధికారులతో మాట్లాడి తదనుగుణంగా కార్యచరణ రూపొందించామని అమలు పరచడానికై తగు ప్రణాళిక సిద్ధం చేసినట్లుగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ తెలిపారు.

హైదరాబాద్‌లో హనీట్రాప్ కలకలం

వాట్సాప్‌లో పరిచయం..
యువతిలా నటిస్తూ పోలీసుకే వల



హైదరాబాద్, మనం ప్రతినిధి : హైదరాబాద్ నగరంలో సంచలనం సృష్టించిన హనీట్రాప్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. యువతిగా నటిస్తూ వాట్సాప్‌లో పరిచయం పెంచుకుని, ఏకంగా ఒక పోలీసు అధికారిని బ్లాక్‌మెయిల్ చేసిన పవన్ అనే నిందితుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడి వలలో వందలాది మంది బాధితులు చిక్కుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

పవన్ అనే యువకుడు వాట్సాప్‌లో యువతి పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, ఒక పోలీసు అధికారితో స్నేహం చేశాడు. చాటింగ్ ద్వారా కొంతకాలం నమ్మకాన్ని కలిగించిన అనంతరం, సదరు అధికారిని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేయడం ప్రారంభించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన సైదాబాద్ పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే సోమవారం మీడియాకు వెల్లడించారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి, అతని నేర చరిత్రను వివరించారు. నిందితుడి మోసాల పరిధి కేవలం తెలంగాణకే పరిమితం కాలేదని, ఇతర రాష్ట్రాలతో పాటు దుబాయ్ వంటి విదేశాల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నపోలీసులు, ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

దేశానికి ఆదర్శంగా రాష్ట్రంలో పథకాల అమలు

- ఎల్‌నినోతో అప్రమత్తం అవసరం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



కాటారం, అక్టోబర్ 19మనం న్యూస్: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు చేస్తుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంత్రి స్వగ్రామం కాటారం మండలం ధన్వాడలో దత్తాత్రేయ స్వామి ఆలయంలో నెలకొల్పిన దుర్గామాతను సోమవారం మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సురక్షితంగా ఉండాలి అని మంత్రి ఆకాంక్షించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేక ఎండలు పెరిగి నీరు, విద్యుత్ కొరత ఏర్పడిందని ప్రకృతి వనరులను పొదుపుగా వాడాలి అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రానికి కావాల్సిన తాగునీరు 400 టీఎంసీలు కాగా ప్రస్తుతం 200 టీఎంసీలే ఉందన్నారు. ఓవర్ వేల్స్ తో భూగర్భ జలాలు ఇంకిపోయి బోరుబావులు ఎండిపోతున్నాయని అందుకే తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు రబీ సీజన్ లో ఆలోచించి పంటలు వేయాలన్నారు. నీరు, కరెంటు, తాగునీటిని పొదుపుగా వాడాలి అని మంత్రి విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. రేషన్ కార్డుదారులకు మనిషికి 6 కిలోల చొప్పున 24-25 కిలోల సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. 50-70 రూపాయలు పలికే బియ్యాన్ని ఉచితంగా ఇస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, 70 వేలకు పైగా ఉద్యోగాలు, రైతు భరోసా, రుణమాఫీ ఇస్తున్నాం. ఇది మార్పు కాదా?' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ విమర్శలను మంత్రి తిప్పి కొట్టారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై ఎన్డిఎస్ఏ రిపోర్టు ప్రకారమే వెళ్తున్నామని, నీళ్లు వదిలితే బ్యారేజీలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని న్యాయిఅ చెప్పిందని మంత్రి పేర్కొన్నారు. న్యాయిఅ అనేది కేంద్ర ప్రభుత్వ సంస్థ, అక్కడ బీజేపీ ఉందని మేము ఇన్ఫ్లుయెన్స్ చేయగలమా అని మంత్రి ప్రశ్నించారు. భద్రతను దృష్టిలో పెట్టుకుని లిఫ్ట్ చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి యాక్షన్ ప్లాన్, పర్స్పెక్టివ్ ప్లాన్ తయారు చేస్తున్నామని, చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో రోజూ సమీక్షలు జరుగుతున్నాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల, మండల అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య, చీమల సందీప్, వేమునూరి ప్రభాకర్ రెడ్డి, జాడి మహేశ్వరి, సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధినిదేవిగా భక్తులకు దివ్యదర్శనం



- వైభవంగా అష్టోత్తర శతకలిశాభిషేకం
- ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దంపతులు



వర్గల్ అక్టోబర్18 (మనంన్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేతం వర్గల్ శ్రీ విద్యా సరస్వతి శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో సోమవారం శ్రీ విద్యాధరి అమ్మవారు మహిషాసురమర్ధినిదేవి అవతారంలో భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు ఘనంగా అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించగా, ఆలయ బాధ్యులు రాజశేఖర శర్మ ప్రధాన కలశాన్ని అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు నృత్యాలు చేస్తూ తన్మయత్వం పొందగా, ఆధ్యాత్మిక శోభ,భజన కార్యక్రమాలు శ్రీ విద్యాధరి అమ్మవారి వైభవాన్ని చాటి చెప్పాయి. వేద విద్యార్థులు, ఆలయ పండితులు, దీక్షాదారులు, భక్తుల భజనలు క్షేతంలో ఆధ్యాత్మికతను స్ఫురింపజేయగా, వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనము, మహా పూర్ణాహుతి, 108 కలశాల ప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.ఈ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతోపాటు మహా ప్రసాదం అందజేయగా, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మధుశ్రీ దంపతులు, సిద్దిపేట్ డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.ఈసందర్భంగా వారికి ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బాధిత కుటుంబానికి వీఎన్ నాయక్ పరామర్శ



హనుమకొండ,అక్టోబర్ 19 మనం న్యూస్: విజయదశమి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులను కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబాలను కలిసి ఓదార్చిన బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధారావత్ రామచందర్ నాయక్ గారి తండ్రి , కోల్పోయిన సందర్భంగా మరియు పోరిక భారతి భర్త ఈశ్వర్ సింగ్ గారు కోల్పోయిన కుటుంబాన్ని, డోంగ్రోత్ కిషోర్ గారి తండ్రి కోల్పోయిన సందర్భంగా వారి కుటుంబాన్ని బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యుల మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీఎన్ నాయక్, గౌరవ అధ్యక్షులు జవహర్లాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి అర్పిత నాయక్, ఈసీ సభ్యులు రమేష్ నాయక్, సాంబు నాయక్, అనసూయబాయి, ఎల్హెచ్పీఎస్ నాయకుడు బానోత్ వసంత్ నాయక్, జర్నలిస్ట్ లావుడియా పల్లవి రాజు నాయక్, సీనియర్ జర్నలిస్ట్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పరస్పరం అండగా నిలవడం, మానవత్వంతో బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడం ఎంతో ముఖ్యమని వారు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

- మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి అక్టోబర్ 19 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని మంత్రి పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసం తోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివి రియాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐకమత్యంతో దసరా పండుగను జరుపుకోవాలని, ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో అభివృద్ధి, ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

ముగిసిన బతుకమ్మ సంబరాలు

- జగ్గారెడ్డి, నిర్మల ఆధ్వర్యం లో ఘనంగా జరిగిన సద్దుల బతుకమ్మ పండుగ
- నేటి దసరా వేడుకలకు సిద్ధమైన అంబేద్కర్ స్టేడియం
- సంగారెడ్డిలో దసరా వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు
- అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి
- వేదిక, సౌండ్, సీటింగ్ ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు
- రావణ దహనం, బాణాసంచా కాల్చే సమయంలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం

సంగారెడ్డి, అక్టోబర్ 19 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి లో సద్దుల బతుకమ్మ సంబురాలు ముగిశాయి.. ఇక దసరా ఉత్సవాల సందడి మొదలైంది. బతుకమ్మ వేడుకలతో పూల పరిమళాలు వెదజల్లిన సంగారెడ్డి పట్టణం ఇప్పుడు విజయదశమి వేడుకలకు ముస్తాబవుతోంది. జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కింది బజార్ పెద్ద చెరువు కట్టపై బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా ముగియగా అంబేద్కర్ స్టేడియంలో దసరా వేడుకలకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కింది బజార్ చెరువు కట్టపై ఎనిమిది టన్నుల పూలతో ఏర్పాటు చేసిన 32 అడుగుల మహా బతుకమ్మ, ఆరు వేదికలపై మహిళల ఆటపాటలు, కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేలాది మంది మహిళల సందడితో బతుకమ్మ సంబురాలు ముగిశాయి.

దసరా ఏర్పాట్లపై జగ్గారెడ్డి ప్రత్యేక దృష్టి...

సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న దసరా వేడుకల ఏర్పాట్లను సోమవారం రాత్రి జగ్గారెడ్డి స్వయంగా పరిశీలించారు. స్టేడియం అంతటా కలియతిరుగుతూ వేదిక నిర్మాణం, సౌండ్ సిస్టమ్, ప్రేక్షకుల సీటింగ్ ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన వేదిక ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు వివరించారు. సామాన్య ప్రజలు సైతం కార్యక్రమాలను సౌకర్యవంతంగా వీక్షించేలా సీటింగ్ ఉండాలని సూచించారు.

చివరి వరుసకూ స్పష్టంగా వినిపించేలా సౌండ్...

దసరా ఉత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల ప్రదర్శనలు స్టేడియంలోని ప్రతి ఒక్కరినీ అలరించేలా ఏర్పాట్లు ఉండాలని జగ్గారెడ్డి సూచించారు. ముఖ్యంగా వేదికపై నుంచి వచ్చే శబ్దం స్టేడియం చివరి వరుసలో కూర్చున్న వ్యక్తికి సైతం స్పష్టంగా వినిపించేలా అత్యాధునిక సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన భారీ రావణాసురుడి ప్రతిమను జగ్గారెడ్డి పరిశీలించారు. రావణ దహనం నిర్వహించే సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై నిర్వాహకులతో చర్చించారు. రావణ దహనాన్ని తిలకించేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం దసరా వేడుకల్లో భాగంగా కాల్చేందుకు సిద్ధం చేసిన బాణాసంచాను పరిశీలించారు. బాణాసంచా కాల్చే సమయంలో భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వీక్షకులకు సురక్షిత దూరంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. గత మూడు దశాబ్దాలుగా సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భారీ రావణాసురుడి ప్రతిమ దహనం, ఆకట్టుకునే బాణాసంచా ప్రదర్శనలు, ప్రముఖ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. బతుకమ్మ సంబురాలతో ఇప్పటికే పండుగ శోభను సంతరించుకున్న సంగారెడ్డి పట్టణంలో దసరా వేడుకలను సైతం అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బతుకమ్మ పాటల సందడి ముగిసిన వెంటనే విజయదశమి వేడుకల హడావుడి మొదలవడంతో పట్టణంలో పండుగ వాతావరణం కొనసాగుతోంది. ఈ కార్యక్రమం లో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు జార్జ్, బొంగుల రవి,కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, శ్రీహరి, బెస్త నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఆయుధ, వాహన పూజ



- వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 19 (మనంప్రతినిధి): దుర్గామాత నవరాత్రులలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్లో ఆయుధ పూజ, వాహన పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయుధ పూజ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను ప్రత్యేకంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఆయుధ పూజ మన సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయుధాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, క్రమశిక్షణ, అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం పోలీస్ వాహనాలకు వాహన పూజ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అత్యవసర సమయాల్లో ప్రజలకు తక్షణ సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించే పోలీస్ వాహనాలను ఎప్పటికప్పుడు సక్రమమైన స్థితిలో ఉంచాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ వేడుకలను పురస్కరించుకుని పోలీస్ హెడ్ క్వార్టర్స్లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని పోలీస్ అధికారులు, సిబ్బందికి అన్న ప్రసాదాలను వడ్డించారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు, ఆర్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతలో సీతక్క.. ప్రజాసేవలో అశోక్.. చల్వాయిలో భక్తి పరిమళం!



గోవిందరావుపేట, అక్టోబర్ 19 మనం ప్రతినిధి: భక్తి, సేవ, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం. ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద తెలంగాణ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవలందించే మంత్రి సీతక్క, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ ప్రజలతో మమేకమవుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఒకే వేదికపై దుర్గామాతకు పూజలు నిర్వహించడం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సేవలో సీతక్క. నాయకత్వంలో అశోక్అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మంత్రి సీతక్క, పైడాకుల అశోక్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని స్వయంగా వితరణ చేశారు. దైవసేవతో పాటు అన్నదానంలో పాల్గొని భక్తులకు ప్రసాదం అందించడం ద్వారా ఆధ్యాత్మికతకు, సేవాభావానికి ప్రాధాన్యతనిచ్చారు. ప్రజలతో మమేకమై, వారి సంతోషాల్లో భాగస్వాములవుతూ ముందుకు సాగడమే నిజమైన ప్రజానాయకత్వానికి నిదర్శనమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. చల్వాయి ముద్దుబిడ్డకు గ్రామస్తుల ఆత్మీయ సత్కారం!ఇదే క్రమంలో చల్వాయి గ్రామానికి చెందిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, ఆయన సతీమణిని గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. తమ గ్రామంలో పుట్టి, పెరిగి, నేడు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతున్న అశోక్ను గ్రామస్తులు ఆప్యాయంగా అభినందించారు. స్వగ్రామానికి వచ్చిన తమ బిడ్డను సతీమణితో కలిసి సత్కరించడం గ్రామస్తుల ప్రేమాభిమానాలకు, అశోక్ ఉన్న ఆత్మీయ అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది.మంత్రి సీతక్క ప్రజా సేవా స్ఫూర్తి.. పైడాకుల అశోక్ ప్రజలతో పెనవేసుకున్న అనుబంధం..

ఈ రెండూ చల్వాయి గ్రామంలో ఆధ్యాత్మిక వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. దైవభక్తితో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల మధ్య సాగిన ఈ కార్యక్రమం గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపింది.ఈ కార్యమంలో గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామస్తులు తదితర నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ఘనంగా బతుకమ్మ పండుగ



- పాండవుల చెరువు వద్దకు మహిళలు
- పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు
- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డీజే పాటల ఏర్పాట్లు

గజ్వేల్, అక్టోబర్ 19 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలో బతుకమ్మ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం ఉదయం నుండి రకరకాల పూలతో బతుకమ్మలను తయారు చేసి సాయంత్రం ఆటలు ఆడుకుంటూ ఒకచోట మహిళలు గుమ్మి కూడారు. ముఖ్యంగా బతుకమ్మ తయారీలో గుణకపువ్వు, పట్టుకుచ్చుల పువ్వు, గడ్డి పువ్వు, తంగేడు పువ్వు, బంతిపూలు, తోపాటు తదితర రకాల పువ్వులను పేర్చి అందంగా నిర్వహించారు. సాయంకాలం గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు వద్దకు బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లడం జరిగింది అనంతరం అక్కడ ఆటపాటలతో కోలాటాల మధ్య ఘనంగా బతుకమ్మ పండుగను మహిళలు నిర్వహించుకున్నారు. మహిళలకు తోడుగా పురుషులు కూడా పాండవుల చెరువు వద్దకు తరలి రావడం జరిగింది . పట్టణంలోని ప్రజలు పూర్తిస్థాయిలో పాండవుల చెరువు వద్దకు రాగా వారితో పాటు వారి చుట్టాలు కూడా బతుకమ్మ నిమజ్జనానికి రావడంతో పాండవుల చెరువు ప్రాంతం కిక్కిరిసిపోయింది. ప్రతి సంవత్సరం కూడా ఇలానే నిమజ్జనానికి జనాలు రావడం జరుగుతుందని ముందుగానే అంచనా వేసిన పోలీస్ శాఖ వారు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. గజ్వేల్ పట్టణ సీఐ రవికుమార్ తో పాటు ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ లో ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. అలాగే ప్రతిసారిలాగా ఈసారి కూడా మున్సిపాలిటీ వారు అందమైన వేదికని ఏర్పాటు చేసి అందంగా అలంకరించి పెద్దగా అలంకరించి తీసుకు వచ్చిన బతుకమ్మలను గుర్తించి వారికి బహుమతులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయా పార్టీల నాయకులు ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావడం జరిగింది.

వైన్‌షాపులో నిల్.. బెల్ట్ ఫాపులో ఫుల్!

- రూ.190 బీరు రూ.230-240కు విక్రయం?
- ధరల నియంత్రణ ఏదీ.. పర్యవేక్షణ ఏదీ?



కొణిజర్ల, అక్టోబర్ 19(మనం న్యూస్) : మండల కేంద్రంలోని వైన్షాపుల్లో కొన్ని రకాల మద్యం, కింగ్ఫిషర్ బీరు అందుబాటులో ఉండటం లేదని, అదే సమయంలో గ్రామాల్లోని బెల్ట్షాపుల్లో మాత్రం మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. వైన్షాపుల్లో దొరకని మద్యం బెల్ట్షాపుల్లో ఎలా లభిస్తోందని, ఆయా విక్రయ కేంద్రాలకు మద్యం నిల్వలు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు.

రూ.190 బీరు రూ.230 నుంచి రూ.240 వరకు?

కింగ్ఫిషర్ బీరు ధర రూ.190 ఉండగా, కొన్ని బెల్ట్షాపుల్లో రూ.230 నుంచి రూ.240 వరకు విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. నిర్ణీత ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నా నియంత్రించే వారు లేరా? వినియోగదారుల నుంచి అదనపు ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అయితే, ఈ ధరల వ్యత్యాసంపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

గ్రామాల్లో బెల్ట్షాపుల జోరు.. పర్యవేక్షణ ఏదీ?

మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్షాపులు కొనసాగుతున్నాయని, అక్కడ మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. ఈ దుకాణాలకు మద్యం ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది? వైన్షాపుల నుంచి నిల్వలు తరలిస్తున్నారా? ఈ విక్రయ కేంద్రాలకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతున్నారు.మద్యం నిల్వలు, సరఫరా, విక్రయ ధరలు, అనధికార విక్రయ కేంద్రాలపై పర్యవేక్షణ నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉందని పలువురు పేర్కొంటున్నారు. గ్రామాల్లో బెల్ట్షాపులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ధరల నియంత్రణతో పాటు మద్యం సరఫరా వ్యవస్థపై సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

స్పందించని ఎక్సైజ్ అధికారి.....

బెల్ట్షాపుల నిర్వహణ, మద్యం విక్రయాల్లో ధరల వ్యత్యాసాలు, అధికారుల పర్యవేక్షణ తదితర అంశాలపై వివరణ కోరేందుకు సంబంధిత ఎక్సైజ్ అధికారిని సంప్రదించగా స్పందించలేదు. వైన్షాపుల్లో మద్యం లభ్యత, బెల్ట్షాపుల్లో విక్రయాలు, ధరల వ్యత్యాసాలపై వచ్చిన ఆరోపణలను సంబంధిత అధికారులు పరిశీలించాలని మద్యం ప్రియులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేయాలి

టన్నెల్‌తో పాటు పాలేరు లింక్ కాలువ పనులు సమాంతరంగా పూర్తి చేయాలి
కాలువల నిర్మాణానికి రైతులు సహకరించాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 19 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం, పాపకొల్లు గ్రామ పరిధిలోని భోజ్య తండా అటవీ ప్రాంతంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పథకంలో ప్యాకేజీ నంబర్ 8 కింద నిర్మిస్తున్న జూలూరుపాడు టన్నెల్ పనులను రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా టన్నెల్ నిర్మాణం, పాలేరు లింక్ కాలువ పనులు, ప్రాజెక్టు అనుసంధానంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టులో కీలకమైన జూలూరుపాడు టన్నెల్ పనులను వేగవంతం చేసి వచ్చే విజయదశమి నాటికి పూర్తి చేయాలని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. టన్నెల్ పనులతో పాటు పాలేరు లింక్ కాలువ నిర్మాణాన్ని సమాంతరంగా చేపట్టి, టన్నెల్ పూర్తయ్యేలోగా కాలువ పనులు కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గతంలో భారీ మట్టి కట్టల నిర్మాణంపై నిపుణుల కమిటీ సాంకేతిక అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో , టన్నెల్ నిర్మాణంపై సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. నిపుణుల కమిటీ సూచనల మేరకు టన్నెల్ నిర్మాణం సురక్షితమైనదిగా, పనులను వేగంగా పూర్తి చేసేందుకు అనుకూలమైనదిగా నిర్ధారించినట్లు తెలిపారు. టన్నెల్ నిర్మాణం పూర్తయితే గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్కు తరలించేందుకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ముఖ్యమంత్రి 4 వేల కోట్లు ఆమోదం తెలిపారని వెల్లడించారు. ఆయా నియోజకవర్గాల్లో కాలువల నిర్మాణానికి అవసరమైన భూముల విషయంలో రైతులను ఒప్పించి పనులు ముందుకు సాగేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామని, భూముల సర్వే ఆధారంగా అర్హులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగించుకుని జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, రిజర్వాయర్లను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. సింగభూపాలెం, అన్నదైవం, వెంగళరాయసాగర్, వైరా, లంకాసాగర్ తదితర ప్రాజెక్టులకు నీటిని అందించడం ద్వారా రైతులకు ప్రయోజనం కలిగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మారెళ్ళ పాడు లిఫ్ట్ ద్వారా పినపాక ప్రాంతంలో సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే పాలేరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కూడా సాగునీటి సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి రైతులకు సూచించారు. సాగునీటితో పాటు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా నీరు, విద్యుత్ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో, తక్కువ వ్యవధిలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

అనంతరం జూలూరుపాడు-వినోబానగర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం కాలువలో నీటి ప్రవాహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. జిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు కరువు పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు గోదావరి జలాల వినియోగం కీలకమని మంత్రి అన్నారు. జూలూరుపాడు టన్నెల్, అనుసంధాన కాలువల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్, ఖమ్మం సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నవంబర్ 15 నాటికి వెలుగుమట్ల కాలనీ నిర్మాణాలు పూర్తి చేయాలి

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
ప్రతి మూడు రోజులకు పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలి
నవంబర్ 8 నాటికి ఇళ్లపై సోలార్ రూఫ్టాప్ ప్యానెళ్ల ఏర్పాటు పూర్తి చేయాలి
డిసెంబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా వెలుగుమట్ల కాలనీ ప్రారంభోత్సవం
వెలుగుమట్ల కాలనీని పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్)ః వెలుగుమట్ల కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీలో చేపడుతున్న అన్ని మౌళిక వసతుల పనులను నవంబర్ 15వ తేదీ నాటికి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం వెలుగుమట్ల కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్తో కలిసి మంత్రి పరిశీలించి, మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వెలుగుమట్ల కాలనీలో నిర్మాణం ప్రారంభించిన 300 ఇళ్లను నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నిర్మాణ స్థితిగతులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు, పూర్తికావాల్సిన పనులు, పనుల పురోగతితో కూడిన నివేదికను ప్రత్యేకంగా సిద్ధం చేసి జిల్లా కలెక్టర్కు సమర్పించాలని సూచించారు. ప్రతి రోజూ పనులను పర్యవేక్షిస్తూ, ప్రతి మూడు రోజులకు ఒకసారి పురోగతి నివేదికను కలెక్టర్కు అందించాలన్నారు. అన్ని ఇళ్లను ఒకే నమూనాలో, ఆకర్షణీయంగా నిర్మించాలని, ఒకే రంగులో తీర్చిదిద్దాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పగలు, రాత్రి పనులు కొనసాగించాలని ఆదేశించారు. అక్టోబర్ నెలాఖరులోగా అన్ని ఇళ్ల స్లాబుల నిర్మాణం పూర్తి చేయాలని, విద్యుత్ పనులను కూడా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.



కాలనీలో అన్ని మౌళిక వసతులు ఒకేసారి పూర్తి చేయాలి

ఇళ్ల నిర్మాణంతోపాటు రహదారులు, డ్రైనేజీలు, ఎనిమిది దుకాణాలతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్, బస్తీ దవాఖానా, కమ్యూనిటీ హాల్, అంగన్వాడీ కేంద్రం తదితర మౌళిక వసతుల పనులను కూడా నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అన్ని పనులను సమాంతరంగా చేపట్టాలని, ఏ పనిలోనూ జాప్యం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. కాలనీలోని ప్రతి ఇంటికి త్రాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసి, ఇంటి వద్దనే త్రాగునీటి కుళాయి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాలనీకి అవసరమైన రహదారులను నిర్మించాలని సూచించారు. మున్సిపల్ కమీషనర్ ప్రతి మూడు రోజులకు ఒకసారి కాలనీని సందర్శించి పనుల నాణ్యత, పురోగతిని స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు. అన్ని సౌకర్యాలతో వెలుగుమట్ల కాలనీని ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు.

దీపావళి నాటికి సోలార్ రూఫ్టాప్ ప్యానెళ్ల ఏర్పాటు

కాలనీలోని ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్టాప్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన అనుమతులను ఇంధన శాఖ కార్యదర్శి ద్వారా పొందేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నవంబర్ 8వ తేదీ దీపావళి నాటికి సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

డిసెంబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా కాలనీ ప్రారంభోత్సవం:

వెలుగుమట్ల కాలనీని డిసెంబర్ 9వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అప్పటికి కాలనీలోని అన్ని ఇళ్లు, రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌళిక వసతులు అందుబాటులోకి రావాలని స్పష్టం చేశారు. కాలనీకి సంబంధించిన పేరును ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ప్రకటిస్తారని తెలిపారు. గతంలో ఇక్కడ జరిగిన పరిణామాలను వివరిస్తూ, పేదల పేరుతో కొంతమంది భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని, కోర్టు నిర్ణయం ప్రకారం జిల్లా యంత్రాంగం ఆక్రమణలను తొలగించిందని మంత్రి పేర్కొన్నారు. అదే ప్రాంతంలో మోసపోయిన పేదలకు శాశ్వత నివాసాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు. పేదలకు న్యాయం చేస్తూ ఆదర్శ కాలనీగా, వెలుగుమట్ల కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కాలనీల్లో ఎలాంటి సౌకర్యాలు ఉంటాయో, అలాంటి సదుపాయాలన్నింటినీ వెలుగుమట్లలోని పేదలకు ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి తెలిపారు. ఇళ్లతోపాటు రహదారులు, డ్రైనేజీలు, బస్తీ దవాఖానా, అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం వెలుగుమట్లలో ఆదర్శవంతమైన కాలనీని నిర్మిస్తోందని అన్నారు. గతంలో జరిగిన దోపిడీని ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలు, వారికి కల్పిస్తున్న సదుపాయాలను కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు ప్రాధాన్యం

తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు ఖర్చు చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల స్థాయిపై ఆసక్తి వ్యక్తమవుతోందని, ఇటీవల తమిళనాడు పర్యటన సందర్భంగా అక్కడి వారు తెలంగాణలో ఇన్ని సంక్షేమ పథకాలను ఎలా అమలు చేయగలుగు తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. పేదల సంక్షేమాన్ని ప్రధాన ఎజెండాగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, దీపక్ చౌదరి, కమర్తపు మురళి, కిషోర్, సాధు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాల అమలు ఆగదు
రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

ఖమ్మం, అక్టోబర్ 19(మనం న్యూస్)ః రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలం ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నవరాత్రులలో అమ్మవారిని నిష్ఠతో పూజించి, మనసులోని కోరికలన్నీ విజయదసరి రోజున అమ్మవారు తీర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. గతంలో ఎన్నికల సమయంలో బొమ్మలు చూపించి, సినిమాటిక్ గా ప్రకటనలు చేసి మోసం చేసిన ప్రభుత్వాలలా కాకుండా, అర్హులైన పేదవాడెవరూ నష్టపోకుండా ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చాలనేదే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాదులో లక్ష ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా, హైదరాబాద్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. గ్రామీణ, తండా ప్రాంతాల్లో కూడా విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 30 వేల నుంచి 2 లక్షల 40 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, ఇంకా ఎంత ఖర్చయినా మూడో, నాలుగో విడతల్లో ఇళ్లు కట్టిస్తామని, అర్హులందరికీ అందజేస్తామని మంత్రి అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుందని మంత్రి అన్నారు. ప్రతిపక్ష శాసనసభ్యుల నియోజకవర్గాల్లో కూడా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. సన్నబియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ. 500 లు సన్నబియ్యానికి బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు భీమా అందిస్తున్నామని, మహిళలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, మరో 14,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని, త్వరలో మరిన్ని ఇవ్వబోతున్నామని తెలిపారు. గత 33 నెలల్లోనే కేవలం మహిళా సంఘాలకు రూ. 73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామన్నారు. పేదవాడి కష్టం తెలిసిన మన ప్రభుత్వం, పేదవాడి ముఖంలో ఆనందం చూడటమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేస్తూ, రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పీ. శ్రీనివాస రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహశీల్దార్ సైదులు, హౌజింగ్ డీఈ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ వివక్షపై సమరం

ఇందిరమ్మ కమిటీల పేరుతో సర్పంచ్ హక్కులకు తూట్లు
జెండా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇండ్లు
22 కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

ఖమ్మం, అక్టోబర్ 19(మనం బ్యూరో)ః ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రాజకీయ వివక్షపై వామపక్షాలతో పాటు బిఆర్ఎస్ సమరానికి సిద్ధమయ్యాయి. ఈ నెల 22న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ(ఎంఎల్) మాస్స్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు ప్రకటించాయి. వామపక్షాలు బిఆర్ఎస్ నేతల సంయుక్త మీడియా సమావేశం సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఆయా పక్షాల బాధ్యులు మాట్లాడుతూ పేదవానికి దక్కాల్సిన ఇండ్ల రాజకీయ కారణాలతో అసర్హులకు లబ్ధి చేకూరుతుందని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన నిబంధనలను గాలికి వదిలి చట్టబద్ధత లేని ఇందిరమ్మ గ్రామ కమిటీల సిఫారసులను అమలు చేస్తున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఉండటం లేదా ఆ పార్టీ జెండా కప్పుకుంటేనే ఇండ్లు కేటాయిస్తున్నారని అధికారులు కూడా ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ కార్యాలయాల నుంచి వచ్చిన జాబితాను యథాతథంగా 'ఆమోదిస్తున్నారని వారు ఆరోపించారు. గత ప్రభుత్వం లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయించిందని కానీ ఇప్పుడు ఆ పద్ధతికి కాంగ్రెస్ -తిలోదకాలు ఇచ్చిందన్నారు. రాజీవ్ గాంధీ హయాంలో జరిగిన 73, 74 రాజ్యాంగ సవరణకు ఇది పూర్తి విరుద్ధమన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం పేదవాడు అర్హుడైతే రాజకీయ జోక్యం ఎందుకని వివపక్షాల నేతలు ప్రశ్నించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన వాటికి బిల్లులు ఇవ్వకుండా నిలుపుదల చేశారని వాటికి వెంటనే బిల్లులు ఇవ్వాలన్నారు. చట్టబద్ధత లేని ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని, సర్పంచులకు పేదల ఎంపిక బాధ్యతను అప్పగించి లబ్ధిదారుల ఎంపికకు లాటరీ తీయాలని ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలు పాటించాలని వారు -డిమాండ్ చేశారు. శాసనసభకు నిర్ణయాధికారం ఉంటుందని కానీ గ్రామ కమిటీలకు ఏమి నిర్ణయాధికారం ఉంటుందని వారు ప్రశ్నించారు. సర్పంచులు చేసిన గ్రామసభ తీర్మానాలకు అధికారులు విలువ ఇవ్వడం లేదని ఈ తీరు మార్చుకోవాలని వారు సూచించారు. 22న జరిగే మహాధర్నాలో సర్పంచులు, లబ్ధిదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు, ఎంఎల్సి తాతామధు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య తదితరులు ప్రసంగించగా వివిధ పార్టీల నాయకులు యర్రాబాబు, మాదినేని రమేష్, బండి రమేష్, బెల్లం వేణుగోపాల్, ఆవుల అశోక్, లక్ష్మి నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



తుమ్మలకు దసరా శుభాకాంక్షలు తెలియజేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా




దమ్మపేట, అక్టోబర్ 19(మనం న్యూస్)ః రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సత్తుపల్లి ఎంఎల్ఏ మట్టా రాగ మయి దసరా శుభకాంక్షలు తెలి పారు. సత్తుపల్లి రైతులకు సకాలంలో నీళ్లు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రైతులు తుమ్మలని కలిసి జిల్లాలో ఉన్న సమస్యలు సాగు, తాగునీటి కష్టాల గురించి వివరించి గోదావరి జలాలు అందించినందుకు తుమ్మలకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అశ్వారావుపేట మండలం మారుమూల ప్రాంతమైన ముసర్లగూడెం మహిళలు తుమ్మలనీ కలిసి వారి సమస్యలు చెప్పుకున్నారు. త్వరలో మీ ఊరు వచ్చి మీకున్న సమస్యను సకాలంలో తీరుస్తాను అని వారికి హామీ ఇచ్చారు. అలానే ఒక నిరుపేద వికలాంగుడు పెన్షన్ కోసం తుమ్మల,ని అడగగా ఇతను పూర్తిగా వికలాంగుడు ఇతనికి పెన్షన్ ఎందుకు రావడం లేదు అని సత్తుపల్లి ఎమ్మెల్యేని పిలిచి త్వరగా పెన్షన్ ఇప్పించాలని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు కార్యకర్తలు దసరా శుభాకాంక్షలు తెలియజే యడానికి రావడంతో తుమ్మల నివాసం జనసంద్రంతో నిండిపోయింది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

- **పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి**
- **ఎంఎల్ఏ జారె ఆదినారాయణ**

దమ్మపేట అక్టోబర్ 19(మనం న్యూస్)ః రాబోయే ఉమ్మడి ఖమ్మం-నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని, గ్రాడ్యుయేట్ ఓటర్లను నేరుగా కలిసి పార్టీ విధానాలు, ప్రజా ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నివాస క్యాంపు కార్యాలయంలో సోమవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రాబోయే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన కార్యాచరణ, క్షేత్రస్థాయిలో ప్రజలను కలిసే విధానం, ఓటర్లకు ఎన్నికల ప్రాధాన్యతను వివరించాల్సిన అవసరంపై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను గుర్తించి, వారిని వ్యక్తిగతంగా కలిసి ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు నాయకులు కృషి చేయాలని తెలిపారు. పార్టీ నాయకత్వం సూచనల మేరకు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.



గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉంటూ ఓటర్లతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్లకు చేరవేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు, కిసాన్ సెల్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్యూఐ నాయకులు, పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, గ్రాడ్యుయేట్ ఓటర్లకు సంబంధించిన అంశాలపై బాధ్యతాయుతంగా చర్చించాలని ఎమ్మెల్యే సూచించారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

శ్రీ మఠంలో దుర్గాష్టమి వేడుకలు



మంత్రాలయం , అక్టోబర్ 19,మనం న్యూస్) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో దేవి శరన్నవరాత్రులల్లో భాగంగా సోమవారం దుర్గాష్టమి వేడుకలు పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్ర తీర్థుల అధ్వర్యంలో ఘనంగా జరిగాయి. దుర్గాష్టమి పురస్కరించుకుని మంచాలమ్మ దేవికి సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా శ్రీ దుర్గా దేవి అలంకరణలో ఉన్న శ్రీ మంచాలమ్మను దర్శించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అన్నవరంలో ఘనంగా దసరా మహోత్సవాల ముగింపు

విజయదశమి సందర్భంగా సత్యదేవుడు, అమ్మవార్ల గ్రామోత్సవం.. రాత్రి శమీ పూజ

అన్నవరం, అక్టోబర్ 19, మనం న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి, దసరా మహో త్సవాలు మంగళవారం విజయదశమి పర్వదినంతో వైభవంగా ముగియనున్నాయి. ఈ నెల 11వ తేదీ ఆదివారం ప్రారంభమైన పది రోజుల ఉత్సవాలు భక్తుల ఆధ్యాత్మిక సందడితో దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. విజయదశమి సందర్భంగా మంగళవారం ఉదయం 11 గంటలకు దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైదిక సంప్రదాయాల ప్రకారం నిర్వహి ంచనున్నారు. పూర్ణాహుతితో నవరాత్రి మహోత్సవాలకు శాస్త్రోక్తంగా ముగింపు పలకనున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది.

గజవాహనంపై స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం

విజయదశమి రోజున కొండ దిగువ నుంచి



శ్రీ స్వామివారు, అమ్మవార్లను గజవాహనంపై ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించనున్నారు. భక్తుల హరినామ స్మరణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగే ఈ ఉత్సవం పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం ద్వారా భక్తులకు దివ్యదర్శనం కల్పించనున్నారు.

రాత్రి 7 గంటలకు శమీ పూజ

అదే రోజు రాత్రి 7 గంటలకు దేవస్థానం హైస్కూలు వద్ద శమీ పూజతో పాటు ఇతర వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విజయదశమి పర్వదినాన శమీ వృక్ష పూజకు విశేష ప్రాధాన్యం ఉండటంతో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి, అమ్మవార్ల ఆశీస్సులు పొందనున్నారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భావించే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నవరం క్షేత్రంలో నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమాలు భక్తుల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపనున్నాయి. పూర్ణాహుతి, గజవాహన గ్రామోత్సవం, శమీ పూజలతో దసరా మహోత్సవాలు సంప్రదాయబద్ధంగా ముగియనున్నాయి.

మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన పలువురు వైసీపీ నాయకులు



- పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపు

కర్నూలు: అక్టోబర్ 19 మనం న్యూస్ నగరంలో తెలుగుదేశం పార్టీకి మద్దతు పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు టీడీపీకి మద్దతుగా నిలుస్తున్నారు. నగరంలోని 8వ వార్డుకు చెందిన షేక్ షా, నజీర్లు వైఎస్సార్సీపీని వీడి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో 8వ వార్డు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి షేక్ నిలోఫర్ విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు. అలాగే కర్నూలు నగరంలోని ధర్మపేటకు చెందిన వీరేష్ తన అనుచరులతో కలిసి మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ధర్మపేటకు చెందిన టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి సురేంద్ర గెలుపు కోసం తన అనుచరులతో కలిసి కృషి చేయాలని మంత్రి.. వీరేష్కు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

బ్యాలెట్ పత్రాల ముద్రణకు పకడ్బందీ ఏర్పాట్లు

- మేయర్, కార్పొరేటర్ల అభ్యర్థుల ఎన్నికలకు 10 లక్షల బ్యాలెట్ పేపర్ల ముద్రణ
- బ్యాలెట్ పత్రాల ముద్రణలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదు
- భద్రత, గోప్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- ప్రింటింగ్ ప్రెస్ సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు, బారికేడ్లు
- అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పత్రాల ముద్రణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లోని ప్రింటింగ్ ప్రెస్లను పరిశీలించారు. మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులకు సంబంధించి మొత్తం 10 లక్షల బ్యాలెట్ పత్రాల ముద్రణకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 4,79,861 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ప్రతి ఓటరు మేయర్ అభ్యర్థికి ఓటు వేసేందుకు ఒక బ్యాలెట్ పత్రం, కార్పొరేటర్ అభ్యర్థికి ఓటు వేసేందుకు మరో బ్యాలెట్ పత్రం వినియోగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వీటికి అదనంగా పోలింగ్ కేంద్రాల్లో 10 శాతం బ్యాలెట్ పత్రాలను అందుబాటులో ఉంచాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 10 లక్షల బ్యాలెట్ పత్రాల ముద్రణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ముద్రణ ప్రక్రియలో పూర్తి గోప్యత పాటిస్తూ, బ్యాలెట్ పత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రింటింగ్ ప్రెస్ కేంద్రాల వద్ద అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రింటింగ్ ప్రెస్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆఖరి బ్యాలెట్ పత్రం ముద్రణ పూర్తయ్యే వరకు నిర్విరామంగా ముద్రణ ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. ముద్రించిన బ్యాలెట్ పత్రాల లెక్కింపు, భద్రపరచడం, తరలింపు ప్రక్రియలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.అదేవిధంగా అథెనా స్కూల్లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్కు ముందు రోజు ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు అవసరమైన రిసెప్షన్ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, ఎస్ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీసీపీ శబ్నం శాస్త్రీ, కార్యదర్శి నాగరాజు, ఆర్వో వాజిద్, డీఈఈలు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, శ్రీనివాసన్, ఎలక్ట్రికల్ సూపర్వైజర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ధర్మకర్తపై దాడికి యత్నం

- అన్నదమ్ముల మధ్య ముదిరిన వివాదం
- దేవుని డబ్బును నొక్కేసిన వైనం
- పోలీస్ స్టేషన్లో ధర్మకర్తల ఫిర్యాదు



మంత్రాలయం, అక్టోబర్ 19,మనం న్యూస్: మండల పరిధిలోని మాధవరం గ్రామం లో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆలయ ధర్మకర్త నర్సిరెడ్డి పై సోమవారం దాడికి యత్నం జరిగింది.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సొంత అన్నదమ్ములైన పైబావి శ్రీనివాస్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పృథ్వి లు మాపై దాడికి ప్రయత్నం చేశారన్నారు.గతకొంత కాలంగా మేము ఆలయ ధర్మ కర్తలుగా కొనసాగుతున్నామని ,అయితే మా ఆధ్వర్యంలో ఈ దేవాలయం దిన దినాభివృద్ధి చెందుతుండడంతో, దేవాలయా లోని లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి భక్తుల తాకిడి అధికం అయ్యిందన్నారు.సుమారు రూ. 30 లక్షలతో దేవాలయం ను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రామ్మోహన్ రెడ్డి అనే వ్యక్తి గతంలో దేవుని హుండీ డబ్బులు సుమారు రూ. 35,000 అక్రమంగా వాడుకున్నట్లు తెలిపారు. అయితే మాపై కక్ష సాధింపు, అసూయ తో తట్టుకోలేక దేవాలయం లో ఉన్న బ్యానర్ ను చించి వేసి. మాపై దాడికి ప్రయత్నం ,ఆలయ అర్చకుడిని బెదిరించారన్నారు. ఇద్దరి మధ్య కొంతసేపు వాగ్వివాదం జరిగింది. ఈ సంఘటనపై మాధవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. మాపై దాడికి ప్రయత్నం చేసిన శ్రీనివాస్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పృథ్వి పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న మంత్రి టీజీ భరత్



కర్నూలుఅక్టోబర్ 19మనం న్యూస్ : రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ కుటుంబ సమేతంగా కర్నూలులోని చిన్న అమ్మవారిశాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్లూరులోని అమ్మవారిశాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రి టీజీ భరత్ను ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు జరిగించాలి



జూపాడుబంగ్లా అక్టోబర్ 19 (మనం న్యూస్): భారత రాజ్యాంగంలోని 243 కె మరియు 243 జెడ్ ఏ పరిచేదం కింద మరియు ఇందుకు కల్పించే ఇతర అన్ని అధికారాలను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు మండల ప్రజా పరిషత్తుకు స్వేచ్ఛగా, నిజాయితీగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ క్రింద తెలిపిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని జారీ చేయడం జరిగిందని ఎన్నికల సహాయ అధికారి చంద్రశేఖర్ నాయక్, ఆధ్వర్యంలో మండలంలోని రాజకీయ నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఎన్నికల సహాయ అధికారి చంద్రశేఖర్ నాయక్, మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తేదీ నుండి ఈ ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని ఈ ప్రవర్తన నియమావళి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు అమలులో ఉంటుందని ఈ నియమావళి లో ఉపయోగించిన పదజాలం మరియు భావము 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వాటి ప్రకారము రూపొందించిన నియమాలలో పేర్కొన్న బావ పదజాలాన్ని పోలి ఉంటుందని. రాష్ట్రమంతటా గ్రామీణ స్థానిక సంస్థలకు సాధారణ ఎన్నికలను నిర్వహించేటప్పుడు ఎన్నికల ప్రవర్తన నియమావళి కేవలం గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే వర్తిస్తుందని.₹జడ్పిటిసి సభ్యుడు,₹ ఒక జడ్పీటీసీ స్థానానికి ఎన్నిక షెడ్యూల్ ప్రకటించినప్పుడు అట్టి జడ్పిటిసి స్థానం కలిగిన రెవెన్యూ డివిజన్ మొత్తానికి ఈ ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని.₹ఎంపీటీసీ సభ్యుడు:₹ ఒక ఎంపీటీసీ స్థానానికి ఎన్నిక ప్రకటన వెలువడినప్పుడు అట్టి ఎంపీటీసీ స్థానం కలిగిన మండల ప్రజా పరిషత్ మొత్తానికి ఈ ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని. ఏ పార్టీ లేదా అభ్యర్థి గాని ప్రస్తుతం నెలకొన్న విభేదాలను తీవ్రతరం చేయడము పరస్పర దేశభావాన్ని సృష్టించడము వేద కులాలు, మతాల మధ్య లేదా భాషల మధ్య విభేదాలను సృష్టించే కార్యకలాపాలలో పాల్గొనకూడదని.

జిల్లా ప్రజా పరిషత్తులు మరియు మండల ప్రజాపరిషత్తుల ఎన్నికల పోలింగ్ ముగియటానికి నిర్ణయించిన సమయానికి ముందు 48 గంటల నుండి గ్రామపంచాయతీలకు జరిగే ఎన్నికల విషయంలో పోలింగ్ పరిసమాప్తం కావడానికి నిర్ణయించిన సమయానికి ముందు 44 గంటల నుండి ఓటర్లకు ఏ రూపంలోనైనా లంచము లేదా రివార్డులు ఇవ్వ జూపడం సరైనది కాదని. పోలింగ్ స్టేషన్ కు వంద మీటర్ల పరిధిలోపల ఓట్ల కోసం ప్రచారం చేయుట లేదా విజ్ఞప్తి చేయుట, ఓటర్లకు ఏదైనా ప్రయాణ సౌకర్యం లేదా ప్రయాణ ఏర్పాట్లను చేయడం, పోలింగ్ అధికారి తన డ్యూటీని నిర్వర్తించడంలో అడ్డగించడం వేరొక ఓటరు పేరు మీద ఓటు వేయడానికి ప్రయత్నించడం, ఏదైనా రాజకీయ పార్టీ లేదా అభ్యర్థి ఇతర రాజకీయ పార్టీల లేదా వారి నాయకుల దిష్టి బొమ్మలను ఊరేగించడం తగులబెట్టడం మరియు ఇతర రూపాలలో ప్రదర్శించడం చేరాలని ఆయన తెలియజేశారు. అదేవిధంగా నామినేషన్ వేయడానికి వచ్చేవారు తప్పనిసరిగా నియమ నిబంధనలను పాటించి పోలింగ్ అధికారులకు సహకరించాలని నామినేషన్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గాని పెద్ద ఊరేగింపే గాని జరగకుండా ప్రతి ఒక్క నామినేషన్ దారుడు శాంతియుతంతో ప్రేమ భావంతో నామినేషన్ దాఖలు చేయుటకు అన్వేషించబడతారని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

పరిమితికి మించి ఎవరికి మద్యం విక్రయించకూడదు



నందికొట్కూరు(మనం న్యూస్): పరిమితికి మించి ఎవరికి మద్యం గ్రహించకూడదని ఎక్సైజ్ ఎస్ఐ భాష్యం శ్రీనివాసులు ఈ సందర్భంగా తెలియజేశారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలో మిడ్తూరు, జూపాడుబంగ్లా, కడమూరులలో మద్యం దుకాణాల తనిఖీలు ముమ్మరం చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా, నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సాధు రవికుమార్ ఆదేశాల మేరకు అధికారుల బృందం తనిఖీలు తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగా నందికొట్కూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఎస్.ఐ భాష్యం శ్రీనివాసులు ఆధ్వర్యంలో మిడ్తూరు, జూపాడుబంగ్లా మండల కేంద్రాలలోని మద్యం దుకాణాలతో పాటు, కడమూరు గ్రామంలోని మద్యం దుకాణాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రికార్డులు, రిజిస్టర్లు, విక్రయాల వేళలు మరియు సీసీ కెమెరాల పనితీరును ఎస్.ఐ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ భాష్యం శ్రీనివాసులు మాట్లాడుతూ... ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అనుమతించిన పరిమితికి మించి ఎవరికీ మద్యం విక్రయించకూడదని, అక్రమంగా మద్యం నిల్వ చేసినా లేదా సరిహద్దు ప్రాంతాలకు అక్రమ రవాణా చేసేందుకు సహకరించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమాచారం కొరకు జారీ చేయబడినదని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు ఈ సందర్భంగా తెలియజేశారని చెప్పడం జరిగింది.

కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీకి దరఖాస్తుల ఆహ్వానం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు సంప్రదించాలి



మంత్రాలయం, అక్టోబర్, 19, (మనం న్యూస్): మంత్రాలయం తాలూకా పరిధిలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయాలనుకునే ఆశావహ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్టీ తాలూకా ఎన్నికల ఇన్చార్జి ఆర్.సి. యువరాజ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తాలూకా పరిధిలోని గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ తదితర స్థానాల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తమ పేరు, గ్రామం, మండలం, విద్యార్హతలు, రాజకీయ అనుభవం తదితర వివరాలను పార్టీకి అందజేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఈ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9108911458 నంబర్ను సంప్రదించి తమ వివరాలను తెలియజేయాలని కోరారు.

పోలీసు స్టేషన్లో ఆయుధ పూజ

మంత్రాలయం , అక్టోబర్ 19,మనం న్యూస్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో దుర్గాష్టమిని పురస్కరించుకుని భాగంగా సిఐ గిరిబాబు , ఎస్సై మల్లికార్జున అధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్ లో సోమవారం ఆయుధ పూజ లు నిర్వహించారు. ముందుగా అర్చకులు శ్రీ రామాచార్ ధుర్గా దేకి వేద మంత్రాలతో విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం తుపాకులు , రికార్డులు , వాహనాలకు జమ్మి చెట్టు కు తదితర పరికరాల పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేసి పోలీసు సిబ్బందిని ఆశీర్వదించారు. అలాగే మాధవరం పోలీసు స్టేషన్ లో ఎస్ఐ విజయకుమార్ ఆదేశాలు మేరకు ఆయుధ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ హరిప్రసాద్ , హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి , మురళిధర్ రెడ్డి , పోలీసులు రామకృష్ణ , సురేంద్ర , సోమశేఖర్ , గోపి , హోం గార్డు వీరేష్ , యల్లప్ప , మాధవరం పోలీసు సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

SOUTHER POWER DISTIRBUTION COMPANY OF TELANGANA LIMITED

Tender Notice (Paper Notification-18/26-27)

E PROC TENDERS of CE/MP **1) Sp.No. 39/26-27** Erection of new 33/11KV I/D SS at Nayani Narsihma Reddy Steel Bridge, **2)Sp.No. 40/26-27** Erection of new 33/11KV I/D SS at Pillar No. 6, Shaikpet Flyover. Bids start Dt.26.10.26 at 16:00 Hr.& Upload End Dt. 10.11.26 at 16:00 Hr. & hard copy sub. Dt: 11.11.26 by 12.00 Hrs. **& 1st Extn. 1) Sp No. 28/26-27, 2) Sp No. 29/26-27, 3) Sp No. 30/26-27** Upload End Dt.02.11. 26 at 16:00 Hr. & hard copy sub. Dt: 03.11.26 by 12.00 Hrs. **Note :** Any further information in this regard can be obtained on website **https://tgsouthernpower.org/generaltenders.** Sd/-. Chief Engineer Master Plan Zone, DIPR.NO. 12172-PP/CL/ADVT/1/2026-27, Dt: 19.10.2026 Mint Compound, Hyderabad.

ఏలేశ్వరం మున్సిపాలిటీలో

పోలీసుల కవాతు

- సిఐ సూర్య అప్పారావు, యస్ ఐ రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన కవాతు

ఏలేశ్వరం,అక్టోబర్,17:-(మనం న్యూస్): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు కవాతు నిర్వహించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు, ఆధ్వర్యంలో వజ్ర వాహనాలతో పోలీసు బలగాలు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టాయి. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కవాతు నిర్వహించారు. ప్రజల్లో భద్రతా భావాన్నికల్పించడంతో పాటు, ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు.



ఎన్నికల సమయంలో ప్రజలు శాంతియుతంగా వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా సి ఐ బి సూర్య అప్పారావు సూచించారు.

జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి



కర్నూలుఅక్టోబర్ 19 మనం న్యూస్ : విజయానికి, ధర్మానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మంత్రి టీజీ భరత్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరిలో నూతన ఉత్సాహాన్ని, సానుకూల ఆలోచనలను నింపాలని, జిల్లా ప్రజలందరికీ శుభం కలగాలని మంత్రి టీజీ భరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చెడుపై మంచి విజయానికి ప్రతీక విజయదశమి..!

- జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ దసరా శుభాకాంక్షలు



పుట్టపర్తి, అక్టోబర్ 19 మనం న్యూస్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఉత్సాహం, విజయాలను నింపాలని ఆకాంక్షించారు. శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలనా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం, సహకారంతో శ్రీ సత్యసాయి జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. విజయదశమి ప్రతి ఇంటా సిరిసంపదలు, ప్రతి కుటుంబంలో ఆనందం నింపాలని ఆకాంక్షించారు

అంగారకుడి చందమామ నుంచి నమూనాల సేకరణ!

- రేపు వ్యోమనౌకను పంపనున్న జపాన్



టోక్యో, అక్టోబర్ 19 : అంగారకుడి చందమామ ఫోబోస్ నుంచి నమూనాలను తెచ్చేందుకు ఒక వ్యోమనౌకను జపాన్ పంపనుంది. తద్వారా ఆ ఘనత సాధిస్తున్న తొలి దేశంగా గుర్తింపు పొందనుంది. అంగారకుడిపైకి వ్యోమగాములను పంపాలని అమెరికా, చైనాలు భావిస్తున్న తరుణంలో జపాన్ చేపడుతున్న ఈ ప్రయోగం ప్రాధాన్యం సంతరించుకుంది. అరుణ గ్రహానికి ఫోబోస్, డైమోస్ అనే రెండు చందమామలున్నాయి. 1960ల నుంచి పలు దేశాలు పదుల సంఖ్యలో అంగారకుడి వద్దకు వ్యోమనౌకలను పంపాయి. దాని చందమామలపై మాత్రం పెద్దగా దృష్టి సారించలేదు. ఫోబోస్‌పై స్పేస్ క్రాఫ్ట్‌ను దించేందుకు రష్యా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఈ రెండు చందమామలు ఎలా ఏర్పడ్డాయన్నది శాస్త్రవేత్తలకు అంతుచిక్కకుండా ఉంది. అంగారకుడిని ఒక భారీ ఖగోళ వస్తువు ఢీ కొట్టడంవల్ల ఏర్పడ్డ శకలాలుగా వీటిని కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మరికొందరు మాత్రం అవి మరెక్కడి నుంచో వచ్చిన గ్రహశకలాలుగా విశ్లేషిస్తున్నారు. ఫోబోస్ నమూనాల విశ్లేషణ ద్వారా ఈ గుట్టు వీడుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్షియన్ మూన్స్ ఎక్స్‌ప్లొరేషన్ (ఎంఎంఎక్స్) అనే వ్యోమనౌకను మంగళవారం హెచ్-3 రాకెట్ద్వారా జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ (జాక్సా) ప్రయోగించనుంది. దాదాపు ఏడాది తర్వాత అది అంగారకుడికి చేరువవుతుంది. మూడేళ్ల పాటు ఫోబోస్‌కు దగ్గరగా వెళ్తూ డేటాను సేకరిస్తుంది. ఆ తర్వాత ఆ చందమామ నుంచి కనీసం 10 గ్రాముల నమూనాలను ఒడిసిపడుతుంది. అంతకుముందు.. ఫ్రాన్స్, జర్మనీ సంయుక్తంగా రూపొందిస్తున్న ఐడిఫిక్స్ అనే రోవర్ 2029లో ఫోబోస్‌పై దిగి, అక్కడి ఉపరితలాన్ని శోధిస్తుంది. తద్వారా నమూనాల సేకరణకు జపాన్ వ్యోమనౌకకు సాయం చేస్తుంది. ఎంఎంఎక్స్ 2031లో భూమికి తిరిగొస్తుంది.

ఈ వ్యోమనౌక మొత్తం బరువు 5 టన్నులు. ఇందులో ప్రొపల్షన్, ఎక్స్‌ప్లొరేషన్, రిటర్న్ అనే మూడు మాడ్యూల్స్ ఉంటాయి. రిటర్న్ మాడ్యూల్ నమూనాలను తీసుకుని భూమికి తిరిగొస్తుంది. వీటి విశ్లేషణ ద్వారా ఫోబోస్, డైమోస్‌కు సంబంధించిన కొత్త విశేషాలతోపాటు సౌర కుటుంబంలో జీవం ఆవిర్భావం గుట్టును విప్పొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భవిష్యత్‌లో అంగారకుడిపైకి జరిపే మానవ సహిత యాత్రలో ఈ చందమామను ఒక మజిలీగా ఉపయోగించుకోవచ్చా అన్నది శాస్త్రవేత్తలు నిర్ధారిస్తారు. ఈ ప్రాజెక్టులో అంతర్జాతీయ సహకారం ఉంది. అమెరికా, ఇతర దేశాల అంతరిక్ష సంస్థలు సాధనాలు, కమ్యూనికేషన్ తోడ్పాటును అందిస్తున్నాయి.

ఫోబోస్ వెడల్పు 20-30 కిలోమీటర్లుంటుంది. అంగారకుడికి 6వేల కిలోమీటర్ల దూరంలో అది పరిభ్రమిస్తోంది. అరుణ గ్రహాన్ని ఒకసారి చుట్టడానికి దీనికి 3 రోజులు పడుతుంది. జపాన్ గతంలో రెండు హయబుసా మిషన్ల ద్వారా గ్రహశకలాల నుంచి నమూనాలను సేకరించింది.



నిరసనల మధ్య జాగింగ్..

ఆశ్చర్యానికి గురిచేసిన మహిళ..!

పారిస్, అక్టోబర్ 19 : నిరసనలు, హింసాత్మక ఘటనలతో ఫ్రాన్స్ అట్టుడుకుతోంది. ఎటుచూసినా మంటలు, దట్టమైన పొగలే కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఓ మహిళ ఏమాత్రం బెదరకుండా.. ఆ హింసాత్మక ప్రదేశం నుంచి జాగింగ్ చేస్తూ వెళ్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. మండుతున్న బారికేడ్ పక్క నుంచి ఆమె ఎంతో ప్రశాంతంగా పరుగెడుతూ వెళ్లడం చూసి నెటిజన్లు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ వీడియోపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు 'ఆమె దేశం కోసం కాదు.. తన ఫిట్నెస్ కోసం పోరాడుతోంది' అంటూ 'ఇంటర్నెట్లో ఇదే అత్యంత వింతైన ఫిట్నెస్ వీడియో' అని కామెంట్ చేస్తున్నారు. ఒక పక్క నిరసన జరుగుతుంటే.. వ్యాయామం అవసరమా? అంటూ కొందరు మండిపడుతున్నారు.

యుద్ధం ముగించేందుకు

అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

కీవ్, అక్టోబర్ 19 : రష్యాతో యుద్ధాన్ని ముగించడానికి తాము అన్ని రకాల దౌత్య ప్రయత్నాలు చేస్తున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇందుకోసం తమ భాగస్వాములు చేపట్టిన చర్చలను స్వాగతించామని.. కాల్పుల విరమణ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించామని అన్నారు. అయినా పుతిన్ దాడులు ఆపట్లేదని విమర్శించారు. దాడులను సాగదీయాలనే రష్యా కోరిక వల్ల మాత్రమే యుద్ధం కొనసాగుతోందన్నారు. తాజాగా కీవ్‌లోని ఇంధన మౌలిక సదుపాయాలపై రష్యా బాలిస్టిక్ క్షిపణులు, జెట్-పవర్డ్ డ్రోన్లతో దాడులకు పాల్పడిందని ఆరోపించారు. దీంతో తాము ఎదురు దాడులు చేయాల్సి వస్తోందన్నారు.

రష్యా దాడుల నుంచి గతంలో నిఘా సమాచారాన్ని పంచుకున్న భాగస్వామ్య దేశాలు కూడా కొద్ది కాలంగా వాటి గురించి తమకు ఎటువంటి సమాచారం, ముందస్తు హెచ్చరికలు అందించట్లేవని జెలెన్‌స్కీ వాపోయారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం రష్యాకు ప్రయోజనం కలిగించేలా ఆ దేశంపై ఆంక్షల ఎత్తివేత, డీజిల్ దిగుమతికి ఒప్పందం కుదుర్చుకోవడం వంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. స్టార్లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు చెందిన సైనిక-స్థాయి వెర్షన్‌ను తమ సైనికులు వినియోగించడంపైనా ఇటీవల అగ్రరాజ్యం పరిమితులు విధించిందన్నారు. దీనివల్ల తమ డ్రోన్ కార్యకలాపాలకు అంతరాయం కలిగిందన్నారు. అదే సమయంలో అమెరికాకు చెందిన పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థల కొరత వల్ల తమ సైన్యం మరింత బలహీనపడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు ఉక్రెయిన్‌కు లభిస్తున్న విదేశీ మద్దతు ఆగిపోయే వరకు వేచి చూసి, ఆ తర్వాత శత్రువును పూర్తిగా అణచివేసేలా చర్యలు తీసుకోవడానికి పుతిన్ ప్రణాళిక రచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే కీవ్‌కు నిఘా సమాచారం అందించడాన్ని వాషింగ్టన్ ఆపలేదని ట్రంప్ ఆదివారం స్పష్టం చేశారు.



మీ అదృష్టాన్ని ఇంకోసారి

పరీక్షించుకోవాలనుకుంటున్నారా..?

ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ

టెహ్రాన్, అక్టోబర్ 19 : ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు రహస్య చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ పని పూర్తి చేస్తామంటూ ట్రంప్ తాజాగా హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇరుదేశాలు తమపై దాడి చేసినప్పుడు టెహ్రాన్ సమర్థంగా పోరాడి, తానేంటో నిరూపించుకుందన్నారు. ఇప్పుడు మరోసారి మా పని పూర్తి చేస్తామని అనుకుంటే మరింత బలంగా కలబడతామన్నారు. 'అమెరికా, ఇజ్రాయెల్ మీ అదృష్టాన్ని ఇంకోసారి పరీక్షించుకోవాలనుకుంటున్నారా? అయితే ప్రయత్నించండి. కానీ, జాగ్రత్త. మాకు కూడా పూర్తికాని పనులు చాలా ఉన్నాయి' అని అరాగ్చీ హెచ్చరించారు.

స్వదేశంలో చట్టపరమైన పరిణామాలను తప్పించుకోవడానికి నెతన్యాహు అమెరికాను మరో సైనిక ఘర్షణలోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారని ఇరాన్ మంత్రి ఆరోపించారు. ఆయన జైలు జీవితాన్ని తప్పించుకోవడానికి ట్రంప్‌ను వాడుకుంటున్నారన్నారు. ఈ చర్యల పర్యవసానాలను ఇజ్రాయెల్‌తో పాటు, అమెరికా కూడా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.



కాగా.. అక్టోబర్ 27న జరగనున్న ఇజ్రాయెల్ పార్లమెంటరీ ఎన్నికలకు ముందు నెతన్యాహుపై టంప్ ప్రశంసలు కురిపించారు. ఆయన ఇరాన్‌తో ఘర్షణను సమర్థంగా ఎదుర్కొని, ఇజ్రాయెల్లో శాంతిని నెలకొల్పారన్నారు. మరోసారి ప్రధానిగా ఆయన ఎన్నికకు తాను మద్దతిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశానికి వేరే నాయకుడిని ఎన్నుకోవద్దని ఇజ్రాయెల్ ప్రజలను హెచ్చరించారు. ఒకవేళ వారు తప్పుడు నేతను ఎన్నుకుంటే అమెరికా జోక్యం చేసుకోవాల్సి వస్తుందన్నారు. దశాబ్దాలుగా ఇజ్రాయెల్, అమెరికాలకు ఇరాన్ ముప్పుగా పరిణమిస్తోందని ఆరోపించారు. నెతన్యాహు లేకపోతే టెహ్రాన్ ఇజ్రాయెల్‌ను నాశనం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ఆ దేశం తన పంథాను మార్చుకోకపోతే త్వరలోనే దాని పని పూర్తి చేస్తామని హెచ్చరించారు.

అల్బర్టా సైనిక స్థావరంలో అగ్నిప్రమాదం

- నలుగురు మృతి
- 19 మంది పరిస్థితి విషమం

ఒట్టావా, అక్టోబర్ 19 : కెనడాలో సంభవించిన అగ్ని ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. అల్బెర్టా ప్రావిన్స్‌లోని వేనైట్ సైనిక స్థావరంలో చెలరేగిన



మంటల్లో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 39 మంది గాయపడ్డారు. వారిలో 19 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం సైనిక శిక్షణ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గంటకు సుమారు 96 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. దీంతో అప్రమత్తమైన సహాయక బృందాలు.. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాయి.

సైనిక శిక్షణలో ఉపయోగించే మందుగుండు పేలడంతోనే మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంపై కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాలను అవనతం (పతాకాన్ని సంతాప సూచకంగా కొద్దిసేపు జెండా కర్రకు సగం ఎత్తులో ఎగరవేయడం) చేయాలని ఆదేశించారు. కెనడా సైన్యం ఎదుర్కొన్న అత్యంత విషాదకర ఘటనల్లో ఇదొకటని పేర్కొన్నారు.



నా మాట తీరు తప్పే

అమెరికా ఉపాధ్యక్షుడు జెడీవాన్స్

వాషింగ్టన్, అక్టోబర్ 19 : హెచ్ 1బీ వీసాలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూనే.. తన మాటతీరు సరిగా లేదని అంగీకరించారు. విదేశీ నిపుణులను 'వెట్టి చాకిరీ చేసేవారు'గా అభివర్ణించడంపై వివరణ ఇచ్చారు. తన విమర్శలు వీసాదారులపై కాదని, వారిని యజమానులపై ఆధారపడేలా చేస్తున్న వీసా విధానంపై అని స్పష్టం చేశారు. హెచ్ 1బీ వీసాపై అమెరికాకు వచ్చే ఉద్యోగుల వీసా వారి నివాసానికి ప్రధాన ఆధారమవుతోందని, ఉద్యోగం కోల్పోతే స్వదేశానికి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. తన వ్యాఖ్యలు. ఎవరినైనా కించపరిచి ఉంటే అది తన మాటతీరులోని లోపమేనని అంగీకరించారు. తన భార్య ఉషా వాన్స్.. దక్షిణ భారతదేశం నుంచి వలస వచ్చిన తల్లిదండ్రుల కుమార్తె అని గుర్తు చేశారు. వలసదారులను అమానవీయంగా చూడటం తన ఉద్దేశం కాదని పేర్కొన్నారు.

అమెరికా భవిష్యత్ అధ్యక్షుడు ఇజ్రాయెల్ విరోధి కావొచ్చు

- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

టెల్ అవీవ్, అక్టోబర్ 19 : భవిష్యత్తులో అమెరికా అధ్యక్షుడు అయ్యే వ్యక్తి ఇజ్రాయెల్‌కు విరోధి కావొచ్చని ఆ దేశ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. ఈ క్రమంలో భారత్, లాటిన్ అమెరికా వంటి బలమైన దేశాలతో పొత్తు పెట్టుకోవాలని తమ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్‌లో అక్టోబర్ 27న జరగనున్న ఎన్నికలకు ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

'మరో రెండేళ్లలో ఇజ్రాయెల్ పట్ల శత్రుభావంతో ఉండే వ్యక్తి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టవచ్చు. వారు పురుషుడు లేదా మహిళ ఎవరైనా కావచ్చు. మీరు దానిని ఎలా ఎదుర్కొంటారు? (అధికారులను ఉద్దేశించి), అగ్రరాజ్యంతో సంబంధాలు ఎలా



నిర్వహిస్తారు?అమెరికా విధానంలో సంభవించే పెద్ద మార్పుకు సిద్ధమవుతూనే.. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న రోజుల్లో ఇజ్రాయెల్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. వచ్చే రెండేళ్లలోనే అమెరికా సాయంతో చేయగలిగినదంతా చేయాలి.

అదే సమయంలో భవిష్యత్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మరిన్ని దేశాలతో సంబంధాలు పెంచుకోవాల్సిన అవసరం ఉంది. కూటములను ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పుడు నేను అదే పని చేస్తున్నాను. భారత్ చిన్న దేశమేమీ కాదు. అలాగే లాటిన్ అమెరికా, బ్రెజిల్‌లో త్వరలో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉంది. మనం మన కూటముల సంఖ్యను విస్తరించుకోవాలి. మన విలువ పెంచే సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలి' అని నెతన్యాహు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఇజ్రాయెల్ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడాన్ని ఎన్నికల్లో ఆయన ప్రధాన ప్రత్యర్థి అయిన గాడి ఐసెన్‌కోట్ తప్పుబట్టారు. ఇతర దేశాల పేరు చెప్పి నెతన్యాహు ప్రజలను భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు.



పాక్‌లో 200 ఏళ్లనాటి హిందూ ఆలయానికి తాళం

పెషావర్, అక్టోబర్ 19 : పాకిస్థాన్ ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని డేరా ఇస్మాయిల్‌లో ఉన్న రామ్‌లీలా ఆలయానికి అధికారులు సీల్ వేశారు. వాణిజ్య భవనం నిర్మించేందుకు 200 ఏళ్లనాటి ఈ ఆలయాన్ని కూల్చేసేందుకు ప్రయత్నించగా.. స్థానిక హిందూ సంఘాలు ఆందోళనలకు దిగాయి. దీంతో శనివారం అధికారులు ఆలయాన్ని స్వాధీనం చేసుకుని సీల్ వేశారు. డేరా ఇస్మాయిల్ పట్టణంలోని రహీం బజార్లో ఈ ఆలయం ఉంది. ఈ ఆలయంతోపాటు మొత్తం 400 భవనాలను వారసత్వ సంపదగా ఎవాక్యూ ట్రస్టు ప్రాపర్టీ బోర్డు (ఈటీపీబీ) గుర్తించింది. ఆలయాన్ని కూల్చేసేందుకు ఓ వ్యక్తికి కాంట్రాక్టు ఇవ్వగా స్థానికులు అడ్డుకున్నారు.



రష్యాపై వెయ్యి డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

మాస్కో, అక్టోబర్ 19 : రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న చమురు ఎగుమతి స్థావరంపై ఉక్రెయిన్ వేయి డ్రోన్లతో ఆదివారం దాడి చేసింది. ఈ దాడుల్లో ఒకరు మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. తమ ప్రాంతాల్లో జరిగిన దాడులకు సంబంధించి దాదాపు 1,015 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణశాఖ తెలిపింది. వీటికి ప్రతీకారంగా దక్షిణ ఉక్రెయిన్‌పై రష్యా చేసిన దాడిలో ఓ మహిళ మృతి చెందగా, ఆరేళ్ల బాలికతోపాటు మరొకరు గాయపడ్డారని స్థానికులు తెలిపారు.

టెల్ అవీవ్-వియన్నా విమానానికి బాంబు బెదిరింపు..

అత్యవసర ల్యాండింగ్


టెల్‌అవీవ్, అక్టోబర్ 19 : బాంబు బెదిరింపు నేపథ్యంలో ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్ నుంచి వియన్నాకు వెళ్తున్న విమానం అత్యవసరంగా ల్యాండింగ్ అయింది. ఆస్ట్రియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం బల్గేరియా రాజధాని సోఫియాలో సురక్షితంగా దిగింది. రొమేనియా సరిహద్దు సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో విమాన సిబ్బందికి బాంబు బెదిరింపు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఫ్లైట్‌ను సోఫియాకు మళ్లించారు. బల్గేరియా ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఫైటర్ జెట్.. ఈ విమానం సోఫియాలో ల్యాండ్ అయ్యే వరకు ఎస్కార్ట్‌గా వచ్చింది. విమానం దిగిన వెంటనే అందులోని 51 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందిని బయటకు తరలించారు. అనంతరం భద్రతా సిబ్బంది తనిఖీలు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి నుంచి వచ్చిన బెదిరింపుతో ఈ ఘటన జరిగినట్లు ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది. ఫ్లైట్‌లో అనుమానాస్పద వస్తువు కనిపించడంతో భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తినట్లు పేర్కొంది. ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించేందుకు వెళ్తోన్న ఇజ్రాయెల్ యువ ప్రతినిధుల బృందం కూడా ఈ విమానంలో ఉన్నట్లు తెలిపింది. అయితే.. బాంబు బెదిరింపుపై పూర్తి వివరాలు ఎయిర్‌లైన్స్ వెల్లడించలేదు. ఫ్లై దుబాయ్ విమానంలో ఆందోళన తలెత్తిన కొన్ని వారాలకే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.



ప్రజారక్షణకై పోలీసులు నిరంతర నిఘా

- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ



సూర్యాపేట, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి): జిల్లా ప్రజలందరికీ విజయదశమి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, చెడు నశించి మంచి వర్ధిల్లాలని, సమాజంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఆకాంక్షించారు. దసరా పండుగను పురస్కరించుకుని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఆయుధ పూజ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని పోలీస్ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ ఆయుధాలు, వాహనాలు కీలక పాత్ర కలిగివున్నాయి తెలిపారు. పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణలో ఆయుధాలు, వాహనాలు ఎంతో అవసరమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతలను కాపాడటంలో ఇవి ముఖ్యమైన సాధనాలని పేర్కొన్నారు. విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ చెడును విడనాడి మంచిని స్వాగతించాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అడ్మిన్ స్టేటివ్ ఆఫీసర్ మంజు భార్గవి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, రవి, ఇన్స్పెక్టర్లు రామారావు, రాజశేఖర్, వెంకటయ్య, మగ్దుమ్ అలీ, ప్రవీన్ కుమార్, జానయ్య, శివకుమార్, నారాయణరాజు, ఎస్ఐలు, ఆరమ్డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ప్రజల రక్షణే లక్ష్యంగా ప్రాణాలర్పించిన వీరులకు ఘన నివాళి విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సూర్యాపేట జిల్లా పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించే పోలీసుల సేవలు వెలకట్టలేనివి అని ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు, సమాజంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తుంటారు. ఈ క్రమంలో విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరమరణం పొందిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివి. వారి ధైర్యసాహసాలు, అంకితభావం భావితరాలకు స్ఫూర్తిదాయకం.సూర్యాపేట జిల్లా పోలీసు శాఖకు చెందిన నలుగురు అమరవీరులు ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 2002 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ వీరమరణం పొందారు. అలాగే, 2015 ఏప్రిల్ 1వ తేదీన సూర్యాపేట పట్టణ కేంద్రంలో సెమీ ఉగ్రవాదులు జరిపిన దాడిలో కానిస్టేబుల్ లింగయ్య, హోంగార్డు మహేశ్వర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు పోలీసుల విధి నిర్వహణలోని సాహసాన్ని, ప్రజల భద్రత కోసం వారు ఎదుర్కొనే ప్రమాదాలను గుర్తుచేస్తాయి. అదేవిధంగా, 2025 సంవత్సరంలో నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ విధుల్లో ఉన్న పోలీసు కానిస్టేబుల్ శీలం కమలాకర్ను కారు ఢీకొనడంతో ఆయన మృత్యువాత పడ్డారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఈ పోలీసు సిబ్బంది కుటుంబాలకు తీరని లోటు మిగిల్చినా, సమాజ భద్రత కోసం వారు చేసిన త్యాగం చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. వారి సేవలను గుర్తుచేసుకుంటూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ మరింత అంకితభావంతో ముందుకు సాగుతోంది. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ నేరరహిత సమాజ నిర్మాణం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, శాంతిభద్రతలను కాపాడటం పోలీసు శాఖ ప్రధాన లక్ష్యాలు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, వారి త్యాగాలను భావితరాలకు తెలియజేయడం పోలీసు శాఖ బాధ్యతగా భావిస్తోంది. వారి త్యాగం వృథా కాదు.వారు చూపిన ధైర్యం, నిబద్ధత, సేవాభావం ప్రతి పోలీసు సిబ్బందికి స్ఫూర్తి అని స్పష్టం చేశారు.

ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ నరసింహ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వినతులను పరిశీలించారు. ప్రజలు అందించే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు.ప్రజా రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్పీ గారు పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

అనుమతులు లేనిదే బాణాసంచా కేంద్రాలు ఏర్పాటు చేయవద్దు



- హుజూర్‌నగర్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సుబ్బరామిరెడ్డి

నేరేడుచర్ల అక్టోబర్ 19 మనం న్యూస్: శాఖపరమైన అనుమతులు లేనిదే ఎటువంటి బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయవద్దని హుజూర్నగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరామిరెడ్డి అన్నారు. నేరేడుచర్ల పట్టణం హుజూర్నగర్ రోడ్డు నందు దసరా దీపావళి సందర్భంగా స్థానిక వ్యాపారులు బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కేంద్రాలను నేరేడుచర్ల ఎస్సై గోపాల్ రెడ్డి తో కలిసి సోమవారం ఫైర్ ఆఫీసర్ పరిశీలించారు. నివాసాల ప్రాంతాలలో ఇలా టెంట్లు ఏర్పాటు చేసి అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయడం వలన చిన్న ప్రమాదం జరిగిన పెద్ద నష్టం జరుగుతుందని అనుమతులు తీసుకొని విడివిడిగా జన సంచారం లేని అవుట్ కట్స్ నందు మాత్రమే ఏర్పాటు చేయాలని దుకాణదారులకు వివరించారు. పోలీసు వారు చెప్పిన సూచనలు పాటిస్తూ స్థానిక వ్యాపారులు ఉదయం నుంచి కష్టపడి ఏర్పాటు చేసుకున్న కేంద్రాలను మూసివేసి సరుకును తరలించారు.

అమ్మవారి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలి



- భవాని యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

నేరేడుచర్ల అక్టోబర్ 19 మనం న్యూస్: అమ్మవారి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి అన్నారు.నేరేడుచర్ల పట్టణం శివాజీనగర్లో ఏర్పాటుచేసిన శ్రీ భవాని మాతకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భవాని యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో సోమవారం అమ్మవారిని మహిషాసుర మర్దిని అలంకారంలో దర్శనమిచ్చేలా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భవాని యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని,ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్,తాళ్ల సురేష్ రెడ్డి,లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ బట్టు మధు,లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు కర్రి సూరిబాబు, సభ్యులు డి.శంకరాచారి,లలిత,మంగ్య నాయక్ మరియు భవాని మాలధారులు,భక్తులు,స్థానిక ప్రజలు,భవాని యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి



తిరుమలగిరి అక్టోబర్ 19 (మనం న్యూస్): సూర్యాపేట జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించాలని,సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు డిమాండ్ చేశారు. తిరుమలగిరి మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ కోసం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి కరువు నివారణ చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, కరువు కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు తగిన నష్టపరిహారాన్ని వెంటనే అందించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు సరిపడా గడ్డి, మేత, తాగునీటి సరఫరాలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కన్వీనర్ గుమ్మడవెల్లి ఉప్పలయ్య, పార్టీ నాయకులు కడారి లింగయ్య, మిట్టపల్లి లక్ష్మి, బూర్గుల ప్రభాకర్, వనం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

28న డబ్ల్యూపీఎల్ వేలం

- బరిలో 146 మంది ప్లేయర్లు

హైదరాబాద్, అక్టోబర్ 19 :

మహిళల ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)- 2027 వేలం అక్టోబర్ 28న కేరళంలోని కొచ్చిలో జరగనుంది. ఐదు ఫ్రాంచైజీల్లోని 27 స్థానాల కోసం 146 మంది క్రికెటర్లు పోటీ పడుతున్నారు. ఇందులో 119 మంది భారత ప్లేయర్లు (22 క్యాప్డ్, 97 అన్ క్యాప్డ్) ఉన్నారు.

20 స్లాట్ల కోసం వీరు పోటీ పడుతున్నారు. విదేశీ ప్లేయర్లు 27 మంది (14 క్యాప్డ్, 13 అన్ క్యాప్డ్) ఉన్నారు. వీరు 7 స్థానాల కోసం పోటీపడుతున్నారు. వేలంలో ఉన్న 146 మంది క్రీడాకారుల జాబితా కోసం క్లిక్ చేయండి. ఇంగ్లాండ్కు చెందిన సోఫియా డంక్లీ, ఆస్ట్రేలియాకు చెందిన సోఫీ మొలినెక్స్ అత్యధిక బేస్ ప్రైస్ రూ.50 లక్షలకు తమ పేరు నమోదు చేసుకున్నారు. భారత్కు చెందిన జి.కమలిని, కిరణ్ నవగిరే, ఆసీస్కు చెందిన హీథర్ గ్రాహమ్, జెస్ జొనాసెన్ రూ.40 లక్షల బేస్ ప్రైస్కి వేలంలోకి వస్తున్నారు. మరో 30 మంది ప్లేయర్లు రూ.30 లక్షల ధరతో రిజిస్టర్ చేసుకున్నారు.

నేడు సీఎం పర్యటనకు ప్రతిష్టాత్మకంగా అన్నిఏర్పాట్లు పూర్తి

- భద్రత, మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- సీఎం పర్యటన ప్రాంతాలను అణువణువునా పరిశీలించిన సీఎం భద్రతాధికారులు
- కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ క్షేత్రస్థాయిలో పరిశీలన



ఉమ్మడి మహబూబ్ నగర్, (వంగూర్) అక్టోబర్ 19 (మనం బ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేడు మంగళవారం నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలంలోని సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం అయిన కొండారెడ్డిపల్లిలో నిర్వహించే దసర వేడుకల్లో పాల్గొననున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటన ఏర్పాట్లను పూర్తి చేసిందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరపాట్లు, ఇబ్బందులు తలెత్తకుండా భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి భద్రతాధికారులు, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణా రెడ్డిలు సోమవారం కొండారెడ్డిపల్లిని సందర్శించి పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం కొండారెడ్డిపల్లిలో దసర పండుగ వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొననున్నారు. ముందుగా గ్రామంలోని ఈ సందర్భంగా కట్ట మైసమ్మ దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం దసర సంప్రదాయంలో భాగంగా గ్రామ సరిహద్దులో ఉన్న జమ్మి చెట్టు వద్దకు పాదయాత్రగా వెళ్లి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

ముఖ్యమంత్రి భద్రతాధికారులు, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఐడబ్ల్యూఓ ఎస్పీ రామ్ చందర్ తదితరులు కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. ఆలయాలు, జమ్మి చెట్టు వద్ద నిర్వహించనున్న కార్యక్రమాల ప్రదేశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, వాహనాల రాకపోకల నిర్వహణ, ప్రజల రాకపోకలకు అవసరమైన మార్గాలు, కార్యక్రమాల ప్రాంగణాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పురోగతిని పరిశీలించి, పూర్తిచేయాల్సిన పనులపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన ముఖ్యమంత్రి పర్యటన భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం,తదితరులతో కలిసి వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టాల్సిన పనులు, అధికారులకు అప్పగించిన బాధ్యతలు, ఏర్పాట్ల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. పర్యటనకు అవసరమైన పనులను సకాలంలో పూర్తి చేయడంతోపాటు, వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి భద్రతాధికారులకు సూచించారు.

సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ...., ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లతోపాటు పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రవాణా సదుపాయాలు, పర్యటన ప్రాంతాల పరిశుభ్రత, కార్యక్రమాల ప్రాంగణాల సిద్ధతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కొండారెడ్డిపల్లి గ్రామానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. చేపట్టిన పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు ఎదురైతే చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్కు, సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏవైనా లోటుపాట్లు గుర్తిస్తే తక్షణమే సరిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి భద్రత అధికారి శ్రీధర్ రెడ్డి, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయికి చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిలీ నెంబర్ ప్లేట్లు

- 100 మందిపై క్రిమినల్ కేసులు

హైదరాబాద్, అక్టోబర్ 19 : నకిలీ నెంబర్ ప్లేట్ల వాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. గత 8 నెలల వ్యవధిలో 100 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి.. వారి వాహనాలను సీజ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటన విడుదల చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అనధికారిక రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ప్రదర్శిస్తున్న వాహనదారులపై చర్యలకు ఉపక్రమించారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడంతోపాటు, తమ వాహనాలను గుర్తించకుండా నకిలీ నంబరు ప్లేట్లను వినియోగిస్తున్నారనే ఫిర్యాదులు పెరగడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. సీజ్ చేసిన వాహనాల్లో 88 ద్విచక్రవాహనాలు, 12 ఫోర్ వీలర్ వాహనాలు ఉన్నాయి.

సింగరేణి అధికారులకు దసరా కానుక

హైదరాబాద్, అక్టోబర్ 19 : సింగరేణి అధికారులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. కోల్ఇండియా తరహాలో వేతనాల పెంపునకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ 1-7 వరకు.. సుమారు 1,800 మందికి ప్రయోజనం కలగనుంది. సెప్టెంబర్ 25 నుంచి ఆర్థిక ప్రయోజనాలు వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సింగరేణి అధికారులు చేసిన విజ్ఞప్తిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈమేరకు నెరవేర్చారు.

అనంతపురం మేయర్ పీఠం ఎవరికి?

- ముగిసిన నామినేషన్ల పర్వం... రసవత్తరంగా కార్పొరేషన్ ఎన్నికల సమరం!
- అధికార కూటమి, వైయస్సార్సీపి వ్యూహాలు... ఉత్కంఠ రేపుతున్న మేయర్ బరి!
- హోరాహోరీ గా మేయర్ పీఠం పోరు,, బిసి అభ్యర్థుల మధ్య అసలు సిసలైన ఫైట్
- రసవత్తరంగా మున్సిపల్ రాజకీయం : రమేష్ గౌడ్ ఔట అజేష్ బాబు.. గెలుపు ఎవరిది?


అనంతపురం, అక్టోబర్ 19: మనం బ్యూరో: ఆంధ్రప్రదేశ్లో మునుపెన్నడూ లేని విధంగా ఉత్కంఠ రేపుతున్న స్థానిక సమరంలో అనంతపురం నగరపాలక సంస్థ (ఏ ఎం సి) ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన కార్పొరేషన్ పీఠాన్ని దక్కించుకోవడానికి ప్రధాన రాజకీయ పార్టీలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. నామినేషన్ల పర్వం ముగియడంతో అనంతపురంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

అనంతపురం మేయర్ స్థానం మరియు డివిజన్ల బరిలో నిలిచిన ప్రధాన అభ్యర్థులు, వారి పార్టీల బలాబలాలు, బయోడేటా ఆధారంగా ప్రత్యేక విశ్లేషణ క్రింద చూడవచ్చు:

1. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైస్సార్సీపీ) మేయర్ అభ్యర్థి విశ్లేషణ

అభ్యర్థి పేరు: చిట్టూరు రమేష్ గౌడ్
సామాజిక వర్గం: బీసీ (గౌడ వర్గం)
బ్రీఫ్ బయోడేటా రాజకీయ నేపథ్యం:
అనంతపురం నగరపాలక సంస్థ మేయర్

అనంతపురం మున్సిపాలిటీ బీసీ వర్గాల పోరు: గెలుపు ఎవరిది?



పీఠాన్ని బీసీ జనరల్కు కేటాయించడంతో వైఎస్సార్సీపీ హైకమాండ్ స్థానిక నేతల ఏకాభిప్రాయంతో చిట్టూరు రమేష్ గౌడ్ను బరిలోకి దించింది. ఆయనకు స్థానికంగా బలమైన ప్రజాసంబంధాలు, సుదీర్ఘ రాజకీయ/సామాజిక సేవా అనుభవం ఉన్నాయి. పార్టీ పట్ల విధేయత కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు.

వైసీపీ బలాలు:

స్థానిక కేడర్ పటిష్టత: నగరంలో పార్టీకి మొదటి నుంచి బలమైన ద్వితీయ శ్రేణి నాయకత్వం మరియు క్యాడర్ ఉంది.

సామాజిక సమీకరణాలు: బీసీ వర్గానికి చెందిన అభ్యర్థి కావడంతో ఆ వర్గపు ఓట్లు గంపగుత్తగా పడే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు.

డివిజన్ల వారీగా కూడా నామినేషన్ల ప్రక్రియలో వైఎస్సార్సీపీ గట్టి పోటీ ఇస్తోంది.

2. కూటమి (ఎన్డీఏ - బీజేపీ / టీడీపీ / జె ఎస్ పి) మేయర్ అభ్యర్థి విశ్లేషణ

అభ్యర్థి పేరు: కోట్ల అజేష్ బాబు (అజేష్ యాదవ్)
సామాజిక వర్గం: బీసీ (యాదవ వర్గం)
బ్రీఫ్ బయోడేటా మరియు రాజకీయ నేపథ్యం:

కూటమి పొత్తులో భాగంగా అనంతపురం మేయర్ స్థానం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖాతాలోకి వెళ్ళింది. బీజేపీ యువ మోర్చా రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్న కోట్ల అజేష్ బాబును ఎన్డీయే కూటమి అధికారిక మేయర్ అభ్యర్థిగా ప్రకటించింది. యువ నాయకుడిగా, చురుకైన వక్తగా నగరంలో మంచి గుర్తింపు ఉంది. ఆయన నామినేషన్ సందర్భంగా కూటమి పార్టీలన్నీ కలిసి భారీ ప్రదర్శన నిర్వహించాయి.

కూటమి బలాలు:

ప్రభుత్వ అనుకూలత: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి (టీడీపీ , జన సేన , బీజేపీ) ప్రభుత్వం ఉండటం వల్ల నగర అభివృద్ధి వేగంగా జరుగుతుందనే ప్రచారం బలపడింది.

మూడు పార్టీల కూటమి ఓటు బ్యాంక్: టీడీపీ, జనసేన, బీజేపీల సంయుక్త క్యాడర్ బలం అజేష్ యాదవ్ విజయం కోసం క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేస్తోంది.

నగరంలో కూటమి తరపున కార్పొరేటర్ డివిజన్ స్థానాలకు అత్యధిక సంఖ్యలో (టీడీపీ ఆధ్వర్యంలో భారీగా) నామినేషన్లు దాఖలు కావడం కూటమి ఉత్సాహానికి నిదర్శనంగా నిలుస్తోంది.

మండల పజలకు విజయదశమిశుభాకాంక్షలు



టేకుమట్ల అక్టోబర్ 19 మనం న్యూస్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, మేధావులు, పాత్రికేయులు మరియు అన్ని వర్గాల ప్రజలకు దొంతుల శ్రీనివాస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో విశిష్ట పాత్ర పోషించిన మాజీ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, విజయదశమి ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం నింపాలని ఆకాంక్షించారు. టేకుమట్ల మండల ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ములుగు గడ్డపై గులాబీ జెండా రెపరెపలాడాలి



- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పిలుపు

ఏటూర్ నాగారం అక్టోబర్ 19 మనం ప్రతినిధి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని, కొత్తగూడెం, గంగారం ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ని మరియు ఏటూరు నాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత ని మర్యాదపూర్వకంగా కలిసి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారుఈ ఆత్మీయ కలయికలో భాగంగా కొత్తగూడెం మండలంలోని గంగారం తదితర ప్రాంతాల్లో ఉన్న పార్టీ అంతర్గత పరిస్థితులను, క్షేత్రస్థాయి పరిణామాలను మరియు ప్రజల ఆకాంక్షలను జిల్లా అధ్యక్షుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు నాయకులకు, కార్యకర్తలకు ఎంతో ఆత్మీయంగా దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి అసలైన బలం, గుండె ధైర్యం. కేసీఆర్ దూరదృష్టి, కేటీఆర్ నాయకత్వ పటిమ మనకు నిరంతరం మార్గదర్శకాలు. గంగారం, కొత్తగూడెం,ప్రాంతాల్లో బిఆర్ఎస్ జెండాను మరింత ఎత్తున ఎగురవేసేందుకు ప్రతీ ఒక్కరూ శ్రమించాలి. ములుగు నేలపై గులాబీ జెండా సగర్వంగా ఎగిరేలా, ప్రజల గుండెల్లో నిలిచేలా మనమందరం ఒకే కుటుంబంలా, ఐక్యంగా ముందడుగు వెయ్యాలని వారు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో కొత్తగూడ మండల పార్టీ అధ్యక్షులు వేణు యాదవ్, గంగారం అధ్యక్షులు సూరన్న, జిల్లా నాయకులు స్వామి సార్, ఈసం సమ్మయ్య,తిరుమల గండి సర్పంచ్ తాటి కృష్ణారావు, బానోతు నెహ్రూ నాయక్, బానోతు వీరన్న నాయక్,బాలకృష్ణ నాయక్, తదితరులు పాల్గొనడం జరిగింది.

ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ

సభ్యురాలిగా మంత్రి సీతక్క నియామకం

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు



ములుగు, అక్టోబర్ 19,మనం ప్రతినిధి: రాష్ట్రంలో కరువు, ఎల్నినో పరిస్థితులను సమీక్షించి, వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలను సిఫారసు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి సీతక్క సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఆర్టీ నంబరు 1523ను జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరితో పాటు సీతక్క సభ్యురాలిగా వ్యవహరించనున్నారు.జ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి సీతక్క గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశాల నేపథ్యంలో నీటి లభ్యత, సరఫరాపై అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. వేసవికి ముందే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తున్నారు. జల సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఇంకుడు గుంతలు, పంట గుంతలు, ఊట కుంటల నిర్మాణం, నిర్వహణ ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భూగర్భ జలాలను పెంపొందించడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించడమే లక్ష్యంగా శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. రాష్ట్రంలో ఎల్నినో, కరువు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించడం, సంబంధిత శాఖలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయడం, పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం కేబినెట్ సబ్ కమిటీ ప్రధాన బాధ్యతగా వ్యవహరించనుంది.

దుర్గాదేవి నవరాత్రి వేడుకల్లో పాల్గొన్నమంత్రి సీతక్క



- ములుగు, ఇంచెర్ల, చల్వాయిలో ప్రత్యేక పూజలు
- భక్తులకు అన్నప్రసాదం పంపిణీ
- కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్

ములుగు, అక్టోబర్ 19,మనం ప్రతినిధి: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క సోమవారం ములుగు జిల్లా కేంద్రంతో పాటు ఇంచెర్ల, గోవిందరావుపేట మండలం చల్వాయిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ములుగు రామాలయం ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకులు తనుగుల విజయ్ యాదవ్, నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో, చల్వాయిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ప్రియాంక దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణాల్లో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తూ సంప్రదాయాలను భావితరాలకు అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

యువత గుండెల్లో సల్మాన్ బతికే

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



మహాదేవపూర్ అక్టోబర్ 19 మనం న్యూస్: మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్గీయ సల్మాన్ ఖాన్ (మాజీ ఉప సర్పంచ్) స్మారక దసరా క్రికెట్ టోర్నమెంట్ గ్రాండ్ ఫైనల్ మ్యాచ్ సల్మాన్ నైట్ రైడర్స్ మహాదేవపూర్ టీమ్ ప్రథమ స్థానంలో కాటారం గారేపెల్లి క్రికెట్ అసోసియేషన్ ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలిచారు.ఈ రోజు సాయంత్రం జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పాల్గొని విజేతలకు క్రీడా ట్రోఫీలను,20వేలు,15 వేల నగదు పారితోషికాన్ని అందజేశారు.ఈ టోర్నమెంట్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ముఫిద్ షేక్(కాటారం),మ్యాన్ ఆఫ్ ది సిరీస్ సిద్ధు,బెస్ట్ బౌలర్ గా కుమార్ (కమాన్ పూర్),బెస్ట్ బ్యాట్స్ మెన్ గా ముఫిద్ షేక్, గేమ్ చేంజర్ గా అఖిల్ ఈ అవార్డులను అందుకున్నారు.క్రీడలను ఉద్దేశించి పుట్ట మధు మాట్లాడుతూ సల్మాన్ ఖాన్ మహాదేవపూర్ యువత గుండెల్లో నిలిచే ఉన్నాడని,సల్మాన్ నైట్ రైడర్స్ టీమ్ విజయం సాధించడమే దీనికి నిదర్శనమని అన్నారు.మానవత్వం పరిమళించే మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని,చిరు వయస్సులో సల్మాన్ ఖాన్ చేసిన సేవలు నేటి యువత కు స్ఫూర్తి నివ్వాలని అన్నారు.సల్మాన్ ఖాన్ అందరివాడని,సల్మాన్ ఖాన్ ఇకలేడనే వార్త మహాదేవపూర్ ను దిగ్భ్రాంతికి గురిచేసిందని,సల్మాన్ భౌతికంగా మన మధ్యలో లేకపోవడం బాధాకరం అని మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు అన్నారు..క్రీడలకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కేదారి గీత,కలికోట దేవేందర్,కూరతోట శ్రీహరి, సట్ల మురళీ కృష్ణ,భారత్,చాగర్ల రాజు,అన్నమనేని అరుణ,ఓడేటి స్వప్న, సుంకె మధు,రవీందర్ రెడ్డి,నాయకులు,కార్యకర్తలు,అభిమానులు,నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి

- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు,అక్టోబర్ 19 మనం ప్రతినిధి: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పర్వదినం జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆకాంక్షించారు.

ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐకమత్యం మరింత బలపడాలని కోరుకుంటూ జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

అడవి రక్షణ బాధ్యతగా భావించాలి



- డీఎఫ్ఓ కృష్ణాగౌడ్

కాటారం, అక్టోబర్ 19మనం న్యూస్ : అటవీ సంపదను కాపాడుకోవడం, చారిత్రక ప్రాంతాలను పరిరక్షించడం మనందరి బాధ్యతగా భావించి, సిబ్బంది నిరంతరం ఫీల్ లో ఉండి జిల్లా అటవీ శాఖ అధికారి జి. కృష్ణాగౌడ్ అన్నారు. సోమవారం కాటారం రేంజ్ పరిధిలోని ప్రతాపగిరి బీట్ లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాపగిరి గుట్టలోని ప్రసిద్ధ గొంతెమ్మ గుట్టను సందర్శించి దాని చరిత్ర, చారిత్రక ప్రాధాన్యత గురించి అడిగి తెలుసుకున్నారు. గొంతెమ్మ గుట్ట అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు డీఎఫ్ఓ తెలిపారు. అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై అధికారులుతో డిఎఫ్ఓ చర్చించారు. అక్రమ నరికివేతలు, అగ్నిప్రమాదాలు జరగకుండా నిఘా పెంచాలని సిబ్బందికి సూచించారు. డిఎఫ్ వెంట మహాదేవపూర్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ ఎం. సందీప్ రెడ్డి, కాటారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జె. స్వాతి, కాటారం డీఆర్ఓ హెచ్. సురేందర్, బీట్ ఆఫీసర్లు మొయినుద్దీన్, మోనకోసర్, సంజీవ్, సాయి కృష్ణ, ప్రతి బాబు, రాజేందర్, హరీష్, డి. అంజయ్య, బేస్ క్యాంప్ సిబ్బంది, ప్రతాపగిరి సర్పంచ్ వెంకటేశ్వర రావు, గ్రామస్తులు ఉన్నారు.

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తును వెంటనే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్. మహేందర్ జి



ములుగు, అక్టోబర్ 19, మనం ప్రతినిధి: ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వెనువెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి అధికారులను ఆదేశించారు.

దరఖాస్తుల పరిష్కారంలో ఏ దశలోనూ నిర్లక్ష్యం వహించవద్దని, తీసుకున్న చర్యలు, అర్జీల పరిష్కార స్థితిని ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని స్పష్టం చేశారు. సోమవారం నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్. మహేందర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ముఖ్యమంత్రి కార్యాలయ ప్రజావాణి, ప్రజా దర్బార్, గిరిజన దర్బార్తో పాటు మండల, డివిజన్, జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాల్లో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. సమస్యపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, పరిష్కారానికి తీసుకున్న చర్యలు, ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఈ వివరాలను ఉన్నతాధికారులకు, ఫిర్యాదుదారులకు సకాలంలో తెలియజేయాలని సూచించారు. దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమంపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, గత ప్రజావాణిలో అందిన దరఖాస్తుల పరిష్కార స్థితిని, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, పరిష్కారం కావాల్సిన అంశాలపై సమీక్షించి, సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్ లోని ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి 2, ఇతర శాఖలకు సంబంధించి 2 చొప్పున మొత్తం 4 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ నేత భిక్షం గౌడ్?



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో జరగనున్న ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి బీజేపీ తన అభ్యర్థిని దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగళి భిక్షం గౌడ్‌ను బరిలోకి దించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఇటీవల పీఆర్‌టీయూ సీనియర్ నేతలు ఢిల్లీతో పాటు రాష్ట్ర బీజేపీ ముఖ్య నేతలతో చర్చలు జరిపారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల్లో పీఆర్‌టీయూకు ఉన్న బలమైన నెట్‌వర్క్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ స్థానంలో గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకోవాలని బీజేపీ భావిస్తోంది.

దసరా సందర్భంగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ

- ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



ములుగు,అక్టోబర్ 19,మనం ప్రతినిధి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్లో సోమవారం ఆయుధ పూజ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. పోలీసు సిబ్బంది క్షేమంగా ఉండాలని, జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. పండుగల సమయంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మనన్ భట్ ఐపీఎస్, అదనపు ఎస్పీ సదానందం, డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్కుమార్, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, ఆర్ఐలు స్వామి, తిరుపతి, వెంకటనారాయణ, శ్రీకాంత్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వర్లు, వెంకటాపురం ఎస్ఐ చల్లా రాజు, ఎస్ఐలు తాజుద్దీన్, కృష్ణప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ములుగు అసెంబ్లీ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మారం



ములుగు, అక్టోబర్ 19,మనం ప్రతినిధి: ములుగు అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కమిటీని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సోమవారం ప్రకటించారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కమిటీ సభ్యుల పేర్లను వెల్లడించారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మారం సుమన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అంగోతు వంశీ, హరీష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మల్లెల రణధీర్, ప్రధాన కార్యదర్శులుగా జంగం భానుచందర్, కాసర్ల రాజు, కార్యదర్శులుగా కృణదీపక్, బండి రమేష్, అన్వేష్ నియమితులయ్యారు. అధికార ప్రతినిధులుగా పాక భాస్కర్, బొమ్మగాని ప్రభు, ప్రచార కార్యదర్శిగా నాలి అనిల్కుమార్, కోశాధికారులుగా ఘంటా సాయిరెడ్డి, చంటి, కమిటీ సభ్యులుగా బరిగల నరేష్, రేగా సాగర్ ఎంపికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్తో పాటు జిల్లా, నియోజకవర్గ, బ్లాక్, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ నాయకత్వం మాకొద్దు?

గాంధీ, నెహ్రూ, యాదవ్‌ల నాయకత్వంపై అసదుద్దీన్ ఒవైసీ ధ్వజం

ముస్లింలు ఎవరికీ బానిసలు కావదు.. ఓటు బ్యాంకుగా మిగిలిపోవద్దు

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఈ దేశంలో ఇకపై ముస్లిం సమాజానికి.. గాంధీ, నెహ్రూ లేదా యాదవ్ కుటుంబాల నాయకత్వం అసలు అవసరం లేదని, సమాజంలో నుంచే సొంతంగా నాయకులు ఎదగాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ రాంపూర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముస్లింలు ఎవరికీ బానిసలు కాదని, సంప్రదాయ పార్టీలను అనుసరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కొంతమంది ఇప్పటికీ ఇతర పార్టీలకు మద్దతు ఇవ్వాలని సలహా ఇస్తున్నారని, వారిలో నెహ్రూ లేదా గాంధీ వంటి వారు పుట్టుకొస్తారని ఆశిస్తున్నారని ఒవైసీ విమర్శించారు. ‘ఇతరులకు మద్దతివ్వమని వారు చెబుతారు, కానీ మీరే నాయకులుగా మారాలని నేను చెబుతున్నాను. ఇదే వారికి, ఒవైసీకి ఉన్న తేడా’ అని ఆయన అన్నారు. ఇతర వర్గాలతో సమానంగా ప్రతిభ, సామర్థ్యాలు ఉన్నప్పటికీ, ప్రధాన రాజకీయ పార్టీలు ముస్లిం యువతను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని, వారికి సరైన రాజకీయ వేదికను కల్పించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.యువత ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా, స్వతంత్రంగా తమ నాయకత్వాన్ని నిర్మించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రాణాలు తీసిన షేర్ మార్కెట్

- తీవ్ర నష్టాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్, మనం ప్రతినిధి : షేర్ మార్కెట్‌లో భారీగా నష్టాలతో తీవ్ర మనస్తాపానికి గురైన హైదరాబాదుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల మూడు నెలల క్రితమే వివాహమైన ఆ యువకుడు జీవితంపై విరక్తితో భవనంపై నుంచి దూకి ప్రాణాలు విడిచాడు. ఈ హృదయ విదారక ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు, స్థానికులు చెప్పున్న ప్రకారం పూర్తి వివరాల్లోకి వెళితే... తమ్మిశెట్టి ప్రవీణ్ (34) అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతనికి మూడు నెలల క్రితమే వివాహమైంది. కొంతకాలంగా ప్రవీణ్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్నాడు. అయితే, ఇటీవల మార్కెట్‌లో నష్టాల కారణంగా అతను పెట్టిన డబ్బులు మొత్తం పోగొట్టుకున్నాడు. దీంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యాడు. నష్టాల విషయం బంధువులకు తెలిస్తే పరువు పోతుందని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని, చైతన్యపురిలోని ఓ భవనంపై నుంచి కిందికి దూకేశాడు. తీవ్ర గాయాలపాలైన ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎల్‌నినో పేరుతో కాలయాపన

శ్రీశైలంలో 70 టీఎంసీల నీరున్నా పాలమూరు, కల్వకుర్తి పంపులు నడపడం లేదు?

నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలి? : నిరంజన్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ అసమర్థతే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని పెద్దగూడెం తండాలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పర్యటించిన ఆయన, ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కరవని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో నిరంజన్ రెడ్డి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ఎల్‌నినో పేరు చెప్పి ముఖ్యమంత్రి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టాలను వెంటనే అంచనా వేసి, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో 70 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, పాలమూరు, కల్వకుర్తి పంపులను ప్రభుత్వం నడపడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరాపై ప్రభుత్వానికి కనీస అవగాహన లేకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు.



టైగర్ ష్రాఫ్ పై కాల్పుల కేసులో కీలక పురోగతి

బాలీవుడ్ ప్రముఖ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై ముంబై జూహు ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరపడం తీవ్ర కలకలం గా మారింది. కాగా ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు కీలక పురోగతి లభించింది. ఆదివారం సాయంత్రం పుష్పా నర్సీ పార్క్ సమీపంలో టైగర్ ష్రాఫ్ బీఎండబ్ల్యూ కారుపై ఐదు రౌండ్ల కాల్పులు జరిపిన ఇద్దరు అనుమానిత షూటర్ల ముఖచిత్రాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. కాల్పులు జరిపిన అనంతరం నిందితులు ఎస్వీ రోడ్డు మీదుగా పల్సర్ బైక్ వేగంగా పరారయ్యారు. అనంతరం అంధేరీ (వెస్ట్) రైల్వే స్టేషన్ వెలుపల ఆ బైక్ను వదిలిపెట్టి, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్, రైలు ద్వారా తప్పించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. స్టేషన్ వద్ద వదిలివెళ్లిన బైక్ను డీఎన్ నగర్ పోలీసులు స్వాధీనం చేసుకుని, దాని నంబర్ ప్లేట్, ఛాసిస్ నంబర్ ఆధారంగా రికార్డులను పరిశీలిస్తున్నారు. ప్రాథమిక విచారణలో ఆ బైక్ ఇప్పటికే ముగ్గురి చేతులు మారినట్లు అధికారులు గుర్తించారు.

ఈ కాల్పుల ఘటనలో టైగర్ ష్రాఫ్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా, ఆయన డ్రైవర్ ఫిర్దోష్ ఎడమచేతికి బుల్లెట్ గాయమైంది. కారు సమీపంలో ఉన్న మరో వ్యక్తికి కూడా గాయాలు కావడంతో వారిద్దరినీ చికిత్స నిమిత్తం నానావతి ఆసుపత్రికి తరలించారు. ప్రతి ఆదివారం టైగర్ ష్రాఫ్ ఫుట్బాల్ ఆడేందుకు ఆ పార్కుకు వస్తాడనే సమాచారంతోనే దుండగులు ముందుగానే రెక్కీ నిర్వహించి, గేటు బయట కాపుకాసి కాల్పులు జరిపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దాడికి తామే బాధ్యులమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్కు చెందిన అనిల్ పండిట్ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టగా, ఆ పోస్టు ప్రామాణికతను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితుల ఫోటోల ఆధారంగా ముంబై క్రైమ్ బ్రాంచ్కు చెందిన 15 ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేసి నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నాయి.

డబ్ల్యూపీఎల్ 2027

మినీ వేలం తేదీ ఖరారు

మహిళల ప్రీమియర్ లీగ్ 2027 సీజన్ కు సంబంధించి ఆటగాళ్ల వేలం తేదీ, వేదిక ఖరారయ్యాయి. అక్టోబర్ 28న కేరళలోని కొచ్చిలో మినీ వేలం నిర్వహించనున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. సాయంత్రం 5:30 గంటలకు వేలం ప్రారంభం కానుంది.

సెప్టెంబర్లోనే ఫ్రాంచైజీలు తమ జట్లలో కొనసాగించే ఆటగాళ్లు, విడుదల చేసిన క్రికెటర్ల జాబితాలను ప్రకటించాయి. గతేడాది ఢిల్లీలో జరిగిన మెగా వేలం తర్వాత తొలిసారిగా మినీ వేలం జరగనుంది.

27 స్థానాల కోసం 146 మంది ప్లేయర్లు

వేలంలో మొత్తం 146 మంది ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరిలో దేశీయ, విదేశీ క్రికెటర్లు ఉన్నారు. ఫ్రాంచైజీల వద్ద ఖాళీగా ఉన్న 27 స్థానాలను (20 భారత్, 7 విదేశీ) భర్తీ చేయడమే ఈ వేలం ప్రధాన లక్ష్యం.

రూ.50 లక్షల బేస్ ప్రైస్తో సోఫియా డంక్లీ, సోఫీ మోలిన్యూ

ఇంగ్లండ్కు చెందిన సోఫియా డంక్లీ, ఆస్ట్రేలియా క్రికెటర్ సోఫీ మోలిన్యూ అత్యధికంగా రూ.50 లక్షల కనీస ధరతో వేలంలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు.



రూ.40 లక్షల బేస్ ప్రైస్తో జి. కమలిని, కిరణ్ నవగిరే, హీథర్ గ్రాహం, జెస్ జొనాసెన్ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మొత్తం 30 మంది ఆటగాళ్లు రూ.30 లక్షల కనీస ధరను నిర్ణయించుకున్నారు. ఈ జాబితాలో చమరి ఆటపట్టు, గ్రేస్ హారిస్, క్లో ట్రయాన్, స్నేహ్ రాణా ఉన్నారు.

రూ.10 లక్షల బేస్ ప్రైస్తో 106 మంది

వేలం కోసం నలుగురు ఆటగాళ్లు రూ.20 లక్షల కనీస ధరను నిర్ణయించుకోగా, అత్యధికంగా 106 మంది రూ.10 లక్షల బేస్ ప్రైస్తో పేర్లు నమోదు చేసుకున్నారు. మొత్తం వేలం జాబితాలో 119 మంది భారత ఆటగాళ్లు ఉన్నారు. వీరిలో 22 మంది అంతర్జాతీయ క్రికెట్ ఆడినవారు కాగా, 97 మంది అన్ క్యాప్డ్ ప్లేయర్లు. విదేశీ ఆటగాళ్లు 27 మంది ఉండగా, వారిలో ఆరుగురు అసోసియేట్ దేశాలకు చెందినవారు.



సెంచరీతో కదంతొక్కిన సర్ఫరాజ్ ఖాన్

రంజీ ట్రోఫీ 2026-27లో భాగంగా హిమాచల్ ప్రదేశ్తో జరుగుతున్న మ్యాచ్లో ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ సెంచరీతో కదంతొక్కాడు. 213 బంతుల్లో 18 ఫోర్ల సాయంతో 139 పరుగులతో అజేయంగా నిలిచాడు. సర్ఫరాజ్ సెంచరీతో సత్తా చాటడంతో ముంబై తొలి ఇన్నింగ్స్ భారీ స్కోర్ దిశగా సాగుతుంది.

రెండో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 398 పరుగులు చేసి, 258 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. సర్ఫరాజ్కు జతగా ఆకాశ్ ఆనంద్ (58) క్రీజ్లో ఉన్నాడు. అంతకుముందు కెప్టెన్ సిద్దేశ్ లాడ్ (87) సెంచరీకి చేరువలో ఔటయ్యాడు.

సర్ఫరాజ్ తమ్ముడు ముషీర్ ఖాన్ (57) కూడా అర్ధ సెంచరీతో రాణించాడు. ఓపెనర్లు అంగ్క్రిష్ రఘువంశీ 20, దివ్యాంశ్ సక్సేనా 9 పరుగులు చేసి ఔటయ్యారు. హిమాచల్ బౌలర్లలో అభిషేక్ కుమార్, జితేందర్ రానా తలో 2 వికెట్లు తీశారు.

ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన హిమాచల్ ప్రదేశ్, తుషార్ దేశ్వాండే (4-46), సిల్వెస్టర్ డిసౌజా (2-43), మోహిత్ అవస్తి (1-37), తనుశ్ కోటియన్ (1-11) ధాటికి 140 పరుగులకే కుప్పకూలింది. వారి ఇన్నింగ్స్లో కెప్టెన్ పుక్రాజ్ మన్ (35), వైభవ్ కల్టా (33), ఆకాశ్ వశిష్ట (39), ఇన్నేశ్ మహాజన్ (11) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. ముగ్గురు డకౌట్లు కాగా.. మిగతా వారంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు.



పాటిదార్ మెరుపు శతకం

రంజీ ట్రోఫీ 2026-27 సీజన్ను మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పాటిదార్ ఘనంగా ప్రారంభించాడు. పుదుచ్చేరితో జరుగుతున్న ఎలైట్ గ్రూప్ మ్యాచ్లో మెరుపు శతకంతో ఆకట్టుకున్నాడు. 116 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న అతడు.. మొత్తంగా 118 బంతులు ఎదుర్కొని 13 ఫోర్ల సాయంతో 107 పరుగులతో అజేయంగా ఉన్నాడు. పాటిదార్ సెంచరీతో కదంతొక్కడంతో మధ్యప్రదేశ్ పటిష్ట స్థితిలో ఉంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసి, కీలకమైన 125 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. పాటిదార్కు జతగా అథర్వ్ మహాజన్ (32) క్రీజ్లో ఉన్నాడు. వారి ఇన్నింగ్స్లో చంచల్ రాథోడ్ (78), శుభమ్ శర్మ (78) అర్ధ సెంచరీలతో రాణించగా.. హర్ష్ గాల్లి (10), యశ్ దూబే (4), కుమార్ కార్తికేయ (4) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. పుదుచ్చేరి బౌలర్లలో గౌరవ్ యాదవ్ 3 వికెట్లతో రాణించగా.. సాగర్ ఉదేశి, అంకిత్ శర్మ తలో వికెట్ పడగొట్టారు. అంతకుముందు పుదుచ్చేరి 177 పరుగులకే ఆలౌటైంది. మధ్యప్రదేశ్ బౌలర్లు తలో చేయి వేసి పుదుచ్చేరి ఇన్నింగ్స్ను నేలమట్టం చేశారు. రవి కిరణ్ 3, ఆర్యన్ పాండే, కుమార్ కార్తికేయ, సరాన్ష్ జైన్ తలో 2, అర్షద్ ఖాన్ ఓ వికెట్ పడగొట్టారు. పుదుచ్చేరి ఇన్నింగ్స్లో రితేశ్ గుర్జ్ (53) ఒక్కడే అర్ధ సెంచరీతో రాణించాడు. మిగతా ప్లేయర్లలో కనీసం ఒక్కరు కూడా 30 పరుగుల మార్కును తాకలేకపోయారు.



రామ్ కొత్త సినిమాలో బాలీవుడ్ స్టార్



టాలీవుడ్ హీరో రామ్ పోతినేని తొలిసారి దర్శకుడిగా మెగా ఫోన్ పట్టిన చిత్రం 'రాపో23' (వర్కింగ్ టైటిల్). ఈ సినిమాతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యాన్ర కృష్ణ పోతినేని దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం చిత్రబృందం ప్రకటించింది. బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్ముఖ్ ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని తెలిపింది. ఈ మేరకు ఆయనకు స్వాగతం పలుకుతూ ఓ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ సినిమాలో రితేశ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అయితే దీనిపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. కాగా ఈ చిత్రంలో రామ్ 'వీర' అనే పాత్రలో స్టైలిష్గా కనిపించనున్నారు. సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్న రామ్.. ఈ సినిమాతో ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి. రామ్, రితేశ్ దేశ్ముఖ్ కలయికలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

'ఆదర్శ కుటుంబం' నుంచి మరో క్రేజీ సాంగ్

విక్టరీ వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్ 'ఆదర్శ కుటుంబం'. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తుండగా.. నివేదా పేతురాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'మాల వచ్చా చూడు..' అంటూ సాగే లిరికల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది.

'నీ ఒంట్లో ఉంది కరెంటు.. వెలిగించవే నా ఫిలమెంట్' అంటూ సాగే ఈ పాటలో వెంకటేశ్, నివేదా పేతురాజ్ మధ్య సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. తమన్ సంగీతం అందించిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ధనుంజయ సీపాన, రనినా రెడ్డి, తమన్ కలిసి ఆలపించారు. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్, రావు రమేశ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమా విడుదల తేదీ రావాల్సి ఉంది.



'ధర్మన్'లో నయన్?

'చంద్రముఖి', 'దర్బార్' లాంటి చిత్రాల్లో కలిసి నటించి హిట్ జోడీ అనిపించుకున్నారు అగ్రహీరో రజనీకాంత్, కథానాయిక నయనతార. ఇప్పుడు వీరిద్దరూ మరోసారి తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ధర్మన్'. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో కనువిందు చేయనున్నారట నయన్. ఆమె పాత్ర సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనుందని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయని సమాచారం. కమల్ హాసన్ తన రాజ్కమల్ ఫిలమ్స్ ఇంటర్నేషనల్ సంస్థపై ఆర్.మహేంద్రన్తో కలిసి దీన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ చిత్రంలో స్టైలిష్ డాక్టర్గా కనిపించనున్నారు రజనీ. ఇందులో సిమ్రాన్, రాశీఖన్నా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

బాక్సాఫీస్ దగ్గర దూసుకెళ్తోన్న 'రణబాలి'

టాలీవుడ్లో వైవిధ్యమైన చిత్రాలతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక జంటగా నటించిన మూవీ 'రణబాలి'. వీరిద్దరి కలయికలో రూపొందిన మూడో చిత్రమిది. ఈ హ్యాట్రిక్ మూవీ వీరిద్దరి కెరీర్లోనూ ఓ మైలురాయిగా నిలిచేలా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రతి షోకు సినిమాకు కలెక్షన్స్ పెరుగుతున్నాయి. విజయ్ దేవరకొండ నటన, ఆయన ఎంచుకున్న పాత్ర, తెరపై చూపించిన వైవిధ్యం గురించి ప్రేక్షకుల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా 'రణబాలి'లో కనిపించడం ప్రధాన ఆకర్షణ. కథానాయకుడిగా తన ఇమేజ్కు పరిమితం కాకుండా, నటుడిగా కొత్త సవాళ్లను స్వీకరించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని రణబాలి చిత్రం మరోసారి స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా పాత్ర కోసం ఆయన చూపించిన డెడికేషన్, తెరపై తనదైన శైలిలో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం సినిమాకు ప్రత్యేకతని తీసుకొచ్చాయి. 'రణబాలి' విజయ్లోని నటుడిని మరో మెట్టు ఎక్కించిన చిత్రంగా నిలుస్తోంది. మరోవైపు రష్మికతో విజయ్ దేవరకొండ జోడీ కూడా సినిమాపై ఆసక్తిని పెంచింది. వీరిద్దరి కలయికకి ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్, సినిమా చుట్టూ కొనసాగుతున్న చర్చలు 'రణబాలి'కి అదనపు ఆకర్షణగా మారింది.

మొత్తంగా చూస్తే 'రణబాలి' విజయ్ దేవరకొండ కెరీర్లో మరో భిన్నమైన ప్రయత్నం. మూస పాత్రలకు దూరంగా వెళ్లి కొత్త తరహా పాత్రలతో ప్రేక్షకులను మెప్పించాలనే ఆయన ప్రయత్నం మరోసారి సక్సెస్ అయ్యింది. నటుడిగా తన పరిధిని విస్తరించుకుంటూ ముందుకు సాగుతున్న విజయ్ దేవరకొండ, రష్మికలకు ఈ సినిమా ఓ మైల్స్టోన్గా నిలిచిందనటంలో సందేహం లేదు. ఇకపోతే హైదరాబాద్లోని ట్యాంక్ బండ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పాల్గొన్నారు. స్టార్ జంట వేడుకల్లో పాల్గొనడంతో అక్కడి వాతావరణం మరింత సందడిగా మారింది. పెళ్లి తర్వాత తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని రష్మికకు తాను ముందే చెప్పానని విజయ్ దేవరకొండ.. వివాహానంతరం తనకు ఇదే తొలి బతుకమ్మ పండుగ అని రష్మిక మందన్న ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీంతో విరోష్ అభిమానుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.





Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.